veluturu telugu daily

# వెలుతురు

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి నల్గొండ గురువారం 22.10.2026

సంపుటి : 9 సంచిక : 129

www. veluturu.com



టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌ని కలిసి దసరా శుభాకాంక్షలు తెలియజేసిన నిజామాబాద్ మేయర్ ఉమా రాణి, నిజామాబాద్ నగర కార్పొరేటర్లు కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు నగేష్ రెడ్డి కార్పొరేషన్ డీసీసీ అధ్యక్షులు బొబ్బిలి రామకృష్ణ ఉన్నారు.

- నిజామాబాదు వెలుతురు అక్టోబర్ 21

## యుద్ధానికి ముగింపు సంకేతాలు

- రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ముగింపు దిశగా అతిపెద్ద ముందడుగు
- అమెరికాతో త్రైపాక్షిక చర్చలకు పుతిన్ గ్రీన్‌సిగ్నల్
- వచ్చే నెలలోనే భేటీ.. వెల్లడించిన క్రెమ్లిన్ వర్గాలు



**మాస్కో, వెలుతురు, అక్టోబర్ 21:**

రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ముగింపు దిశగా అతిపెద్ద ముందడుగు పడింది. అమెరికా, ఉక్రెయిన్‌లతో కలిసి త్రైపాక్షిక శాంతి చర్చలను తిరిగి ప్రారంభించేందుకు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ సూత్రప్రాయంగా అంగీకరించారు. వచ్చే నెల 10వ తేదీ తర్వాత ఈ కీలక చర్చలు జరిగే అవకాశం ఉందని క్రెమ్లిన్ వర్గాలు వెల్లడించాయి. అమెరికా ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్కాఫ్‌తో పుతిన్ జరిపిన భేటీ అనంతరం ఈ సంచలన ప్రకటన వెలువడింది. ఇప్పటికే నార్వే రాజధాని ఓస్లోలో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో చర్చలు జరిపిన విట్కాఫ్ అక్కడి ప్రతిపాదనలను పుతిన్ ముందు ఉంచారు. ఈ క్రమంలోనే పుతిన్ త్రైపాక్షిక చర్చలకు పచ్చజెండా ఊపడం అంతర్జాతీ ంగా ప్రాధాన్యత సంతరించుకుంది. మొత్తానికి అమెరికా పౌరుడి విడుదల, ఆ వెంటనే త్రైపాక్షిక చర్చలకు పుతిన్ అంగీకారం తెలపడంతో, ఏళ్ల తరబడి సాగుతున్న రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి త్వరలోనే తెరపడే అవకాశాలు కనిపిస్తున్నాయి. రష్యాలోని సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో ఉన్న చారిత్రక కాన్‌స్టాంటైన్ ప్యాలెస్‌లో రష్యా అధ్యక్షుడు - మిగతా 2 లో..





# 2028 నాటికి ఖాళీలన్నీ భర్తీ!

## పోలీసు శాఖలో సిబ్బంది కొరతకు చెక్..



### విడతలవారీగా నియామకాలు

పోలీసు శాఖలో సిబ్బంది కొరత లేకుండా 2028 నాటికి అన్ని ఖాళీలను విడతలవారీగా భర్తీ చేస్తామని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ప్రకటించారు. మారుతున్న నేర స్వభావాలు, సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, కల్తీ ఆహారం వంటి సవాళ్లను సమర్థంగా ఎదుర్కొనేలా పోలీసు వ్యవస్థను మరింత బలోపేతం చేస్తామని స్పష్టం చేశారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా హైదరాబాద్‌లోని గోషామహల్ స్టేడియంలో నిర్వహించిన కార్యక్రమంలో అమరులకు నివాళులర్పించిన అనంతరం ఆయన మాట్లాడారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

- హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 21

- అమరుల త్యాగాలకు ఘన నివాళి.. కుటుంబాలకు ప్రభుత్వం అండ
- హోంగార్డుల ఎక్స్‌గ్రేషియా రూ.10 లక్షలకు పెంపు
- పోలీసు అమరుల కుటుంబాలకు ఉద్యోగం, ఇల్లు, విద్య, వైద్య సాయం
- సైబర్ నేరాలు, డ్రగ్స్, కల్తీపై ఉక్కుపాదం..పోలీసు వ్యవస్థ బలోపేతానికి ప్రత్యేక చర్యలు
- గోషామహల్ స్టేడియంలో అమరులకు నివాళులర్పించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

#### 16 వేల నియామకాలు

రాష్ట్రంలో పోలీసు ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని ముఖ్యమంత్రి తెలిపారు. 2025 అక్టోబర్ నాటికి దాదాపు 16 వేల మంది కానిస్టేబుళ్లు, ఎస్ఐలను నియమించినట్లు వెల్లడించారు. 2026లో మరో 5 వేల ఉద్యోగాల భర్తీకి అనుమతించామని, ఇందులో భాగంగా 4,773 కానిస్టేబుళ్లు, అగ్నిమాపక, జైళ్ల శాఖలకు సంబంధించిన పోస్టులతో కలిపి 7,437 పోస్టుల భర్తీకి అనుమతులు ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా 112 మంది డీఎస్పీలను నియమించామని చెప్పారు. ట్రాన్స్‌జెండర్లను ట్రాఫిక్ అసిస్టెంట్లుగా నియమించి వారి ఆత్మగౌరవానికి ప్రాధాన్యమిచ్చామన్నారు.

#### పరిహారం భారీగా పెంపు

విధి నిర్వహణలో - మిగతా 2 లో..

# భారత్ ఖాతాలో 62 పతకాలు

## పారా ఆసియా గేమ్స్‌లో అథ్లెట్ల హవా సత్తా

## మొత్తంగా ఐదో స్థానంలో భారత్




**నగోయా, వెలుతురు, అక్టోబర్ 21:**

ఆసియా పారా క్రీడల్లో భారత అథ్లెట్లు అదరగొడుతున్నారు. ట్రాక్ అండ్ ఫీల్డ్ విభాగంలో పతకాల వేట కొనసాగిస్తూ దేశాన్ని పతకాల పట్టికలో ఐదో స్థానానికి చేర్చారు. బుధవారం ఒక్కరోజే అథ్లెటిక్స్‌లో ఐదు స్వర్ణాలతో సహా 18 పతకాలు సాధించి సత్తాచాటారు. భారత అథ్లెట్లు సిమ్రాన్, ప్రవీణ్ కుమార్, సచిన్ ఖిలారీ తమ విభాగాల్లో గేమ్స్ రికార్డులు నమోదు చేయడం విశేషం. అథ్లెటిక్స్‌తో పాటు పారా ఆర్చరీ, పారా స్విమ్మింగ్, పవర్‌లిఫ్టింగ్‌లోనూ భారత క్రీడాకారులు పతకాలు సాధించారు. దీంతో భారత్ మొత్తం పతకాల సంఖ్య 62కు చేరింది.

#### అథ్లెటిక్స్‌లో ఐదు స్వర్ణాలు

మహిళల 100 మీటర్ల టీ12 విభాగంలో దృష్టిలోపం ఉన్న భారత స్ప్రింటర్ సిమ్రాన్ అద్భుత ప్రదర్శన చేసింది. 12.02 సెకన్లలో లక్ష్యాన్ని చేరి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకోవడంతో పాటు గేమ్స్ రికార్డును నెలకొల్పింది. ఇరాన్‌కు చెందిన హాజర్ - మిగతా 2 లో..

# పంజాబ్‌లో పాలనకు ఉద్యోగుల షాక్

11

పంజాబ్‌లో ప్రభుత్వ ఉద్యోగులు చేపట్టిన మెరుపు సమ్మెతో రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పరిపాలన తీవ్రంగా స్తంభించింది. పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, పాత పెన్షన్ విధానాన్ని (ఓపీఎస్) పునరుద్ధరించాలని, కాంట్రాక్ట్ సిబ్బందిని క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ సుమారు 3 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులు బుధవారం నుంచి మూకుమ్మడి సెలవులోకి వెళ్లారు.

- చండీగఢ్, వెలుతురు అక్టోబర్ 21

- 3 లక్షల మంది మూకుమ్మడి సెలవు..
- రెవెన్యూ, రిజిస్ట్రేషన్లు, పౌర సేవలు అందించే కేంద్రాల్లో నిలిచిన కార్యకలాపాలు
- డీఏ బకాయిలు, ఓపీఎస్ పునరుద్ధరణ, కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణే ప్రధాన డిమాండ్లు

## అమరుల త్యాగాలతోనే రాంలో శాంతిభద్రతలు

11

- పోలీసు సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం
- కొత్త నేరాలను ఎదుర్కొనేందుకు నైపుణ్యాలు పెంచుకోవాలి
- నిజాయతీగా సేవ చేయడమే అమరులకు నిజమైన నివాళి: డీజీపీ



## మైసూరు దసరా వైభవానికి సీఎం రేవంత్‌రెడ్డి ఫిదా

2

- జంబూ సవారిలో చాముండేశ్వరి అమ్మవారికి పుష్పాంజలి..
- కర్ణాటక సీఎం డీకే శివకుమార్ ఆహ్వానం మేరకు ఉత్సవాలకు హాజరు.. కేరళ సీఎం వీడీ సతీశన్‌తో కలిసి వేడుకల వీక్షణ





# కల్తీ కోరల్లో భాగ్యనగరం!

రుచికరమైన ఆహారం కోసం హోటళ్లకు వెళ్తున్నారా? పండుగకు స్వీట్లు కొనుగోలు చేస్తున్నారా? ఇంట్లో వాడేందుకు పాలు, నెయ్యి, మసాలా దినుసులు తెస్తున్నారా? అయితే అవి నాణ్యమైనవేనా అన్న ప్రశ్న ఇప్పుడు ప్రతి హైదరాబాద్ నగరవాసిని వెంటాడుతోంది. వేగంగా విస్తరిస్తున్న నగరంలో ఆహార వ్యాపారం పెరుగుతున్న కొద్దీ, కల్తీ పదార్థాలు, అపరిశుభ్ర తయారీ కేంద్రాలు, నిబంధనలు పాటించని ఆహార విక్రయ కేంద్రాలు ప్రజారోగ్యానికి సవాలుగా మారుతున్నాయి. లాభాల కోసం కొందరు వ్యాపారులు నాణ్యతను పక్కనపెడుతుండటంతో సామాన్యుడి భోజనమే అనారోగ్యానికి దారితీసే ప్రమాదం నెలకొంటోంది.

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 21

## ఆహారం తింటున్నామా.. అనారోగ్యాన్ని కొనుక్కుంటున్నామా?

### నాణ్యతకు తిలోదకాలు.. ప్రజారోగ్యానికి పెనుముప్పు.. స్వీట్లు, నెయ్యి నుంచి మసాలా దినుసుల వరకు కల్తీ జాడలు

#### స్వీట్లు, పాల ఉత్పత్తుల్లోనూ కల్తీ కలకలం

ఇటీవల హైదరాబాద్ పరిసరాల్లో ఆహార భద్రతా అధికారులు నిర్వహించిన తనిఖీలు ఆందోళనకర పరిస్థితులను వెలుగులోకి తెచ్చాయి. అక్టోబర్ 15న వెలువడిన నివేదికల ప్రకారం, నగర పరిధిలోని ఏడు ఖోవా, స్వీట్ల తయారీ, విక్రయ కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించి సుమారు 2,480 కిలోల ఖోవా, లడ్డూలు, ఇతర ఆహార పదార్థాలను స్వాధీనం చేసుకోవడం లేదా పారవేయడం చేశారు. వీటి విలువ సుమారు రూ.3.78 లక్షలుగా అధికారులు పేర్కొన్నారు. అనుమతులు లేకుండా, అపరిశుభ్ర పరిస్థితుల్లో పనిచేస్తున్న రెండు యూనిట్లను మూసివేయాలని ఆదేశించారు. అంతకుముందు సెప్టెంబరులో పాల ఉత్పత్తులు, పనీర్ తయారీ కేంద్రాలపై జరిగిన తనిఖీల్లోనూ ఉల్లంఘనలు బయటపడ్డాయి. మూడు డెయిరీ యూనిట్ల లైసెన్సులను నిలిపివేయడంతో పాటు, రూ.7.19 లక్షల విలువైన ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నారు.

#### మసాలాల్లోనూ మాయ.. నెయ్యిలోనూ నకిలీ

ఆగస్టులో నగరంలో నిర్వహించిన ప్రత్యేక దాడుల్లో సుమారు 25 టన్నుల కల్తీ మసాలా దినుసులను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. జీలకర్ర, వాము, ఆవాలు, ఇతర దినుసుల ప్రాసెసింగ్‌లో హానికర రసాయనాలు, తినడానికి అనువుకాని రంగులు ఉపయోగించినట్లు ఆరోపణలు వచ్చాయి. మరోవైపు, నెయ్యి పేరుతో చౌక నూనెలు, వనస్పతి, కృత్రిమ సువాసనలను ఉపయోగించి విక్రయిస్తున్నారనే అనుమానాలతో 130 తయారీ, విక్రయ కేంద్రాల్లో తనిఖీలు చేపట్టి సుమారు 36 టన్నుల నెయ్యి, ముడి - మిగతా 2 లో..

# దేశసేవే స్వయం సేవకుల జీవిత ధ్యేయం

- సంఘ్ బలం సంఖ్య కాదు.. క్రమశిక్షణ
- సమాజ ఐక్యతే సంఘ్ లక్ష్యం
- కేంద్ర మంత్రి బండి సంజయ్



**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 21:**

రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ శుభాకాంక్షలు తెలిపారు. భారతమాత సేవ కోసం జీవితాలను అంకితం చేసే వారే స్వయం సేవకులని పేర్కొన్నారు. స్వయం సేవకత్వం అంటే ఆషామాషీ వ్యవహారం కాదని, ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా దేశ రక్షణ, సమాజ సేవ కోసం నిరంతరం పనిచేయడమే వారి కర్తవ్యమని అన్నారు.

దేశంలో అసహనం తొలగిపోయి, శాంతి, సుస్థిరతతో అభివృద్ధి సాధించాలని ఆయన ఆకాంక్షించారు. ప్రజలంతా సమానత్వ భావనతో ముందుకు సాగినప్పుడే భారత్ విశ్వగురువుగా ఎదుగుతుందని పేర్కొన్నారు. అధికారంలో ఉండాలన్నది స్వయం సేవకుల లక్ష్యం కాదని, దేశం ప్రపంచంలో అగ్రస్థానంలో నిలవాలన్నదే వారి ఆకాంక్ష అని స్పష్టం చేశారు.

విమర్శలకు వెరవకుండా దేశం కోసం నిస్వార్థంగా పనిచేసే స్వయం సేవకుడి అడుగు ఎప్పటికీ ఆగదని బండి సంజయ్ అన్నారు. సంఘ్ బలం సభ్యుల సంఖ్యలో కాకుండా క్రమశిక్షణలో ఉందని, దాని ఆయుధం ద్వేషం కాదని, సేవా సంకల్పమని పేర్కొన్నారు. జీవితమంతా దేశం కోసం పనిచేయడమే స్వయం సేవకుడి నిబద్ధత అని తెలిపారు.

భారతమాత వైభవమే ఆర్ఎస్ఎస్ విజయమని, సమాజ ఐక్యతే సంఘ్ బలమని, దేశసేవే స్వయం సేవకుల జీవిత ధ్యేయమని ఆయన అన్నారు. సంఘ్ అనేది కేవలం ఒక పేరు కాదని, తరతరాలకు దేశభక్తిని అందించే స్ఫూర్తి దివిటీ అని అభివర్ణించారు. త్యాగం ఆర్ఎస్ఎస్ చరిత్రగా, దేశభక్తి దాని శ్వాసగా, క్రమశిక్షణ బలంగా నిలుస్తాయని పేర్కొన్నారు.

కులం పేరుతో సమాజాన్ని విడదీసే శక్తులు ఎన్ని ఉన్నా, భారతీయులమనే భావనతో ప్రజలందరినీ ఏకం చేయడమే సంఘ్ సంకల్పమని బండి సంజయ్ తెలిపారు.

## తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని ప్రపంచానికి చాటాలి 12

# మైసూరు దసరా వైభవానికి సీఎం రేవంత్‌రెడ్డి ఫిదా



## జంబూ సవారిలో చాముండేశ్వరి అమ్మవారికి పుష్పాంజలి..

### కర్ణాటక సీఎం డీకే శివకుమార్ ఆహ్వానం మేరకు ఉత్సవాలకు హాజరు.. కేరళ సీఎం వీడీ సతీశన్‌తో కలిసి వేడుకల వీక్షణ





**మైసూరు, వెలుతురు, అక్టోబర్ 21:**

కర్ణాటక సంస్కృతి, సంప్రదాయాలు, చారిత్రక వైభవానికి ప్రతీకగా నిలిచే మైసూరు దసరా ఉత్సవాల్లో తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఆహ్వానం మేరకు బుధవారం మైసూరుకు చేరుకున్న ఆయన, దసరా వేడుకల్లో భాగంగా నిర్వహించిన చారిత్రక జంబూ సవారి ఊరేగింపును వీక్షించారు. బంగారు అంబారీలో కొలువుదీరిన చాముండేశ్వరి అమ్మవారిని దర్శించుకుని పుష్పాంజలి ఘటించారు. కేరళ ముఖ్యమంత్రి వీడీ సతీశన్‌తో పాటు పలువురు ప్రముఖులు, విదేశీ ప్రతినిధులతో కలిసి ఈ వేడుకల్లో పాల్గొన్నారు.

### భక్తి, సంప్రదాయాల సంగమం

మైసూరు దసరా ఉత్సవాల్లో అత్యంత ప్రధాన ఘట్టమైన జంబూసవారి అంబావిలాస్ రాజభవనం నుంచి వైభవంగా ప్రారంభమైంది. అందంగా అలంకరించిన ఏనుగుపై సుమారు 750 కిలోల బరువైన బంగారు అంబారీలో చాముండేశ్వరి అమ్మవారి ఉత్సవమూర్తిని ఊరేగించారు. ఈ దృశ్యాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆసక్తిగా తిలకించారు. కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ అమ్మవారికి పుష్పాంజలి ఘటించి ఊరేగింపును ప్రారంభించగా, ఇతర ప్రముఖులు కూడా అమ్మవారికి పుష్పాలు సమర్పించారు.

### కన్నడ సంస్కృతికి అద్దం పట్టిన ఊరేగింపు

జంబూ సవారిలో కన్నడ సంస్కృతి, జానపద కళారూపాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. జానపద కళాకారుల నృత్యాలు, సంగీత బృందాల ప్రదర్శనలు, సంప్రదాయ వేషధారణలు, వివిధ సాంస్కృతిక శకటాలు ఊరేగింపునకు మరింత శోభను చేకూర్చాయి. రాజరిక సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విశ్వాసాలు, కళా వైభవం కలగలిసిన ఈ వేడుకలను దేశవిదేశాల నుంచి వచ్చిన సందర్శకులు తిలకించారు.

### చాముండేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు

జంబూ సవారి వేడుకల్లో పాల్గొనడానికి ముందు సీఎం రేవంత్‌రెడ్డి మైసూరు ప్రజల ఆరాధ్య దైవమైన చాముండేశ్వరి అమ్మవారి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విజయదశమి పర్వదినాన అమ్మవారి దర్శనం చేసుకుని ఉత్సవాల్లో పాల్గొనడం విశేషంగా నిలిచింది. కర్ణాటక రాష్ట్ర పండుగగా ప్రసిద్ధి చెందిన 'నాడ హబ్బ' వేడుకలు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, భక్తి, చారిత్రక వారసత్వానికి ప్రతీకగా నిలుస్తాయి.

### దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రుల సందడి

మైసూరు దసరా వేడుకలకు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, కేరళ సీఎం వీడీ సతీశన్ హాజరు కావడంతో కార్యక్రమానికి ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడింది.

మైసూరు రాజవంశ వారసుడు, ఎంపీ యదువీర్ కృష్ణదత్త చామరాజ వడియార్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, విదేశీ ప్రతినిధులు వేడుకల్లో పాల్గొన్నారు. సంప్రదాయాల పరిరక్షణతో పాటు భారతీయ సాంస్కృతిక వైవిధ్యాన్ని చాటిచెప్పే మైసూరు దసరా ఉత్సవాలు మరోసారి దేశవ్యాప్తంగా ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

# యుద్ధానికి ముగింపు సంకేతాలు



(మొదటిపేజీ తరువాయి)

పుతిన్, అమెరికా రాయబారి స్టీవ్ విట్కాఫ్ మధ్య కీలక చర్చలు జరిగాయి. పుతిన్‌తో విట్కాఫ్ భేటీ కావడం ఇది తొమ్మిదోసారి. ఉక్రెయిన్ తరఫున కిరాయి సైనికుడిగా పోరాడాడనే ఆరోపణలతో 2022 ఏప్రిల్‌లో అరెస్టయి, దాదాపు ఏడేళ్ల జైలు శిక్ష అనుభవిస్తున్న 74 ఏళ్ల రిటైర్డ్ అమెరికన్ ఉపాధ్యాయుడు స్టీఫెన్ హబ్బర్డ్‌ను ఈ భేటీకి ముందే రష్యా విడుదల చేసింది. స్వయంగా ట్రంప్ చేసిన విజ్ఞప్తి మేరకు పుతిన్ ఈ నిర్ణయం తీసుకున్నారు. హబ్బర్డ్ ఇప్పటికే విమానాశ్రయానికి చేరుకున్నారని, విట్కాఫ్‌తో పాటే అమెరికాకు తిరిగి వెళ్తారని పుతిన్ ప్రకటించారు.

### ముందు ఉక్రెయిన్ నాయకులతో భేటీ

రష్యా పర్యటనకు ఒకరోజు ముందు నార్వే రాజధాని ఓస్లోలో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ, ఫిన్లాండ్, నార్వే దేశాధినేతలు, నాటో ప్రతినిధులతో విట్కాఫ్ భేటీ అయ్యారు. ఉక్రెయిన్‌కు భద్రతాపరమైన హామీలు, యుద్ధం తర్వాత ఆర్థిక పునర్నిర్మాణం, యూరప్ భద్రతా వ్యవస్థపై ఓస్లోలో కీలక చర్చలు జరిగాయి. అక్కడ కుదిరిన ప్రతిపాదనలను విట్కాఫ్ ఇప్పుడు పుతిన్ ముందు ఉంచారు. అయితే తూర్పు ఉక్రెయిన్‌లోని దొనెట్స్క్ ప్రాంతంపై పూర్తి ఆధిపత్యం, ఉక్రెయిన్‌కు నాటో సభ్యత్వం ఇవ్వకూడదనే డిమాండ్లపై పుతిన్ ఇంకా పట్టు వీడటం లేదు.

### ట్రంప్‌పై జెలెన్‌స్కీ ఫైర్

మరోవైపు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తీరుపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. 24 గంటల్లో యుద్ధం ఆపుతానని ఎన్నికల వేళ హామీ ఇచ్చిన ట్రంప్, ఇప్పుడు ఒప్పందం కుదుర్చుకోవాల్సిందేనని జెలెన్‌స్కీపై ఒత్తిడి పెంచారు. జెలెన్‌స్కీ కచ్చితంగా ఒప్పందానికి రావాల్సిందేనని అక్కడి ప్రజలు ఈ యుద్ధాన్ని ఇంకెంతో కాలం భరించే స్థితిలో లేరని ట్రంప్ అన్నారు. ఉక్రెయిన్ వెంటనే యుద్ధాన్ని ముగించకపోతే అత్యంత దారుణమైన పరిస్థితులను ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

ఇరాన్‌పై దాడుల తర్వాత అమెరికాలో ఇంధన ధరలు పెరగడంతో, నవంబర్లో మధ్యంతర ఎన్నికల నేపథ్యంలో ధరలను తగ్గించేందుకు ట్రంప్ ఇటీవల రష్యాతో డీజిల్ దిగుమతి ఒప్పందం చేసుకున్నారు. అప్పటి నుంచి అమెరికా-ఉక్రెయిన్ మధ్య దూరం పెరిగింది. రష్యా దాడులకు సంబంధించిన రియల్-టైమ్ నిఘా సమాచారాన్ని అమెరికా నిలిపివేస్తోందని, ఉక్రెయిన్ సైన్యం వాడుతున్న 'స్టార్‌లింక్' శాటిలైట్ సేవల వేగాన్ని ఎలాన్ మస్క్ తగ్గించారని వార్తలు వచ్చాయి. అయితే ఓస్లో చర్చల్లో ఈ సాంకేతిక, నిఘా సమస్యల పరిష్కారానికి అంగీకారం కుదిరిందని జెలెన్‌స్కీ తెలిపారు. స్టార్‌లింక్ సేవలను నిలిపివేయలేదని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో కూడా స్పష్టం చేశారు. మొత్తానికి అమెరికా, రష్యా, ఉక్రెయిన్ మధ్య నేరుగా త్రైపాక్షిక చర్చలకు బాటలు వేయడమే లక్ష్యంగా విట్కాఫ్ పర్యటన సాగుతోంది. పుతిన్, ట్రంప్‌లతో నేరుగా భేటీ అయి యుద్ధం ముగింపుపై చర్చించాలని జెలెన్‌స్కీ భావిస్తుండగా, తగిన ముందస్తు ఒప్పందాలు జరిగితేనే పుతిన్-జెలెన్‌స్కీ భేటీ సాధ్యమవుతుందని క్రెమ్లిన్ వర్గాలు చెబుతున్నాయి.

# కరీంనగర్ మార్క్‌ఫెడ్ గ్రౌండ్స్‌లో ఘనంగా రావణ దహనం..





**కరీంనగర్, వెలుతురు అక్టోబర్ 21:**

విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని కరీంనగర్‌లోని మార్క్‌ఫెడ్ గ్రౌండ్స్‌లో రాంలీలా కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన రావణ దహన కార్యక్రమంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పాల్గొన్నారు.

- రాంలీలా కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్
- చెడుపై మంచి సాధించిన విజయానికి విజయదశమి ప్రతీక
- మంత్రి పొన్నం ప్రభాకర్

ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరికీ విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. విజయదశమి అంటేనే విజయం, ధర్మం, చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక అని పేర్కొన్నారు. ఈ పర్వదినం ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలు, శాంతి, సౌభాగ్యాలను నింపాలని ఆకాంక్షించారు.

ఢిల్లీలో నిర్వహించే రాంలీలా కార్యక్రమం తరహాలో కరీంనగర్‌లోని మార్క్‌ఫెడ్ గ్రౌండ్స్‌లో కూడా రావణ దహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. పల్లెల్లోనూ విజయదశమి వేడుకలను ప్రజలు ఉత్సాహంగా జరుపుకుంటున్నారని తెలిపారు.

చెడుపై మంచి విజయం సాధించాలని, ప్రజలందరి జీవితాల్లో విజయాలు కలగాలని అమ్మవారిని ప్రార్థిస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ ఐకమత్యంతో, సోదరభావంతో పండుగలను జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, మాజీ సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# 2028 నాటికి ఖాళీలన్నీ భర్తీ!

(మొదటిపేజీ తరువాయి)

ప్రాణాలు కోల్పోయిన పోలీసు సిబ్బంది కుటుంబాలకు అందించే పరిహారాన్ని ప్రభుత్వం పెంచిందని సీఎం వివరించారు. కానిస్టేబుళ్లు, హెడ్ కానిస్టేబుళ్లు, ఏఎస్ఐలకు అందించే ఎక్స్‌గ్రేషియాను రూ.కోటి వరకు పెంచినట్లు తెలిపారు. ఎస్ఐలు, ఇన్‌స్పెక్టర్లకు రూ.1.25 కోట్లు, డీఎస్పీ, అదనపు ఎస్పీ స్థాయి అధికారులకు రూ.1.50 కోట్లు, ఎస్పీ, ఐపీఎస్ అధికారులకు రూ.2 కోట్ల పరిహారం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. అమరుల కుటుంబాల్లో అర్హులైన ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, ఇంటి స్థలం, ఉచిత విద్య, వైద్య సహాయం కల్పిస్తున్నామని చెప్పారు. భద్రతా సంక్షేమ నిధి నుంచి రూ.16 లక్షలు, సంక్షేమ నిధి నుంచి మరో రూ.8 లక్షలు అందించాలని నిర్ణయించినట్లు తెలిపారు.

### హోంగార్డులకు భరోసా

హోంగార్డుల కుటుంబాలకు ప్రస్తుతం అందిస్తున్న రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియాను రూ.10 లక్షలకు పెంచాలని డీజీపీని ఆదేశిస్తున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. హోంగార్డుల వైద్య పరీక్షలకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. పోలీసు సిబ్బంది పిల్లలకు నాణ్యమైన విద్య అందించేందుకు రంగారెడ్డి జిల్లా మంచిరేవులలో 44 ఎకరాల్లో యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌ను ప్రారంభించినట్లు వెల్లడించారు. పోలీసుల సంక్షేమం, వారి కుటుంబాల భవిష్యత్తు ప్రభుత్వానికి ముఖ్యమని స్పష్టం చేశారు.

### నేరాలపై ఉక్కుపాదం

సైబర్ నేరాలు, డ్రగ్స్ అక్రమ రవాణా, కల్తీ ఆహారం వంటి సమస్యలను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు సీఎం తెలిపారు. మాదక ద్రవ్యాల నియంత్రణలో ఈగల్ ఫోర్స్ పనితీరును అభినందించారు. కల్తీ ఆహార నియంత్రణకు టీజీ సేఫ్‌ను ప్రారంభించామని, మహిళల భద్రత కోసం షీ టీమ్స్ సేవలను కొనసాగిస్తున్నామని చెప్పారు. మహిళలకు అండగా నిలిచేందుకు స్టాండ్ విత్ హర్ కార్యక్రమాన్ని, అత్యవసర పరిస్థితుల్లో తక్షణ రక్షణకు స్పందన బృందాలను ప్రారంభించినట్లు వివరించారు. మహిళలు, చిన్నారులకు సంబంధించిన కేసుల్లో పోలీసులు సున్నితంగా వ్యవహరించాలని, బాధితులకు న్యాయం అందించడంలో జాప్యం జరగకూడదని ఆదేశించారు.

### ప్రజలకు భరోసా కల్పించాలి

రాష్ట్ర అభివృద్ధికి పెట్టుబడులతోపాటు శాంతిభద్రతలు అత్యంత కీలకమని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రజలు నిర్భయంగా జీవించినప్పుడే పరిశ్రమలు, ఐటీ, పర్యాటక రంగాలు అభివృద్ధి చెందుతాయని అన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్‌లో భాగంగా సమస్యలతో పోలీస్ స్టేషన్లకు వచ్చే సామాన్యులతో స్నేహపూర్వకంగా, నేరస్థులతో కఠినంగా వ్యవహరించాలని సూచించారు. పోలీసు సిబ్బందికి క్రమశిక్షణ బలమని, నిజాయితీ గౌరవమని పేర్కొంటూ ప్రజల భద్రతకు అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.

### అమరుల త్యాగాలు చిరస్మరణీయం

పోలీసు అమరవీరుల సంస్మరణ దినం ఎంతో భావోద్వేగభరితమైన రోజని రేవంత్‌రెడ్డి అన్నారు. దేశవ్యాప్తంగా ఈ ఏడాది విధి నిర్వహణలో 154 మంది పోలీసు సిబ్బంది ప్రాణాలు కోల్పోయారని పేర్కొంటూ వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అమరుల కుటుంబాలు ఒంటరివి కావని, తెలంగాణ ప్రభుత్వం, పోలీసు శాఖ, సమాజం వారికి అండగా ఉంటాయని భరోసా ఇచ్చారు. అమరుల త్యాగాలను గుర్తించి, వారి కుటుంబాల సంక్షేమానికి తోడ్పడటమే నిజమైన గౌరవమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఈ ఏడాది అమరులైన పోలీసుల కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందించారు.

# భారత్ ఖాతాలో 62 పతకాలు..

(మొదటిపేజీ తరువాయి)

సఫర్జాదే 12.30 సెకన్లతో రెండో స్థానంలో నిలిచింది. అంతకుముందు మహిళల 200 మీటర్ల టీ12 విభాగంలోనూ సిమ్రాన్ స్వర్ణం సాధించింది. కేవలం 24 గంటల వ్యవధిలో రెండు స్వర్ణాలు, రెండు గేమ్స్ రికార్డులు నమోదు చేసి తన ప్రతిభను చాటింది. పురుషుల హైజంప్ టీ44/64 విభాగంలో ప్రవీణ్ కుమార్ స్వర్ణం సాధించాడు. పురుషుల షాట్‌పుట్ ఎఫ్46 విభాగంలో సచిన్ ఖిలారీ పసిడి పతకాన్ని అందుకున్నాడు. పురుషుల షాట్‌పుట్ ఎఫ్53 విభాగంలో ఆయుశ్ వర్మ భారత్‌కు మరో స్వర్ణాన్ని అందించాడు. పురుషుల 100 మీటర్ల టీ46/47 సంయుక్త విభాగంలో దిలీప్ గవిట్ విజేతగా నిలిచాడు.



### రజతాలు, కాంస్యాలతోనూ మెరుపులు

పురుషుల హైజంప్ టీ44/64 విభాగంలో బంటి రజతం సాధించగా, మహిళల షాట్‌పుట్ ఎఫ్34 విభాగంలో భాగ్యశ్రీ జాదవ్ రెండో స్థానంలో నిలిచింది. పురుషుల షాట్‌పుట్ ఎఫ్46 విభాగంలో మహమ్మద్ యాసర్, పురుషుల జావెలిన్ త్రో ఎఫ్12/13 విభాగంలో మంజీత్ రజత పతకాలు గెలుచుకున్నారు. పురుషుల 100 మీటర్ల టీ35 విభాగంలో అనుభవ్ చౌధరి, షాట్‌పుట్ ఎఫ్46 విభాగంలో పర్వీన్, పురుషుల 100మీటర్ల టీ37 విభాగంలో రాకేశ్‌భాయ్ భట్ కాంస్య పతకాలు సాధించారు. పురుషుల 100 మీటర్ల టీ46/47 సంయుక్త విభాగంలో మహ్మద్ మోర్సింగనకత్ బాసిల్ 10.72సెకన్లతో రజతం గెలుచుకున్నాడు. ఈ విభాగంలో బాసిల్ కూడా గేమ్స్ రికార్డు నమోదు చేశాడు.

### ఆర్చరీ, స్విమ్మింగ్, పవర్‌లిఫ్టింగ్‌లోనూ పతకాలు

పారా ఆర్చరీలో చేతులు లేకుండానే విలువిద్యలో రాణిస్తున్న శీతల్ దేవి మహిళల డబుల్స్‌లో పాయల్ నాగ్‌తో కలిసి రజతం సాధించింది. ఫైనల్లో చైనా జోడీ చేతిలో ఓటమి ఎదురైనా పతకాన్ని సొంతం చేసుకుంది. పారా స్విమ్మింగ్‌లో దృష్టిలోపం ఉన్న రవి కార్తిక్ బుడిగినా మరో రజతాన్ని గెలుచుకున్నాడు. పురుషుల 100 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్ ఎస్13 విభాగంలో 1 నిమిషం 10.10 సెకన్లలో రేసును పూర్తి చేసి రెండో స్థానంలో నిలిచాడు. ఇదే పోటీల్లో హిమాంశు నందల్ పురుషుల బ్రెస్ట్‌స్ట్రోక్ ఎస్‌బీ13 విభాగంలో కాంస్య పతకం సాధించాడు. అతను 1 నిమిషం 20.72 సెకన్లలో లక్ష్యాన్ని చేరుకున్నాడు. పవర్‌లిఫ్టింగ్‌లో పోలియోతో బాధపడుతున్న కస్తూరి రాజమణి మహిళల 67 కిలోల విభాగంలో రజతం గెలుచుకుంది. ఇది ఆమె కెరీర్‌లోనే అత్యుత్తమ విజయాల్లో ఒకటిగా నిలిచింది. బ్యాడ్మింటన్‌లోనూ భారత్‌కు పతకాలు ఖాయమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. పురుషుల సింగిల్స్ ఎస్ఎల్4 విభాగంలో డిఫెండింగ్ ఛాంపియన్ సుహాస్ ఎల్వై, నవీన్ శివకుమార్, అభిజీత్ సఖూజా సెమీఫైనల్స్‌కు చేరుకున్నారు. దీంతో భారత్‌కు కనీసం మూడు పతకాలు ఖాయమయ్యాయి. ఆసియా పారా క్రీడల్లో భారత్ ఇప్పటివరకు సాధించిన 14 స్వర్ణాల్లో 13 అథ్లెటిక్స్ నుంచే రావడం విశేషం. రజతం 22, కాంస్యం 26 పతకాలతో భారత్ ఐదో స్థానంలో ఉంది.

# కల్తీ కోరల్లో భాగ్యనగరం!

(మొదటిపేజీ తరువాయి)

పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు.

### అనారోగ్యానికి ఆహ్వానం

కలుషితమైన లేదా కల్తీ ఆహారం తీసుకోవడం వల్ల వాంతులు, విరేచనాలు, కడుపునొప్పి వంటి సమస్యలు తలెత్తవచ్చు. ప్రమాదకర రసాయనాలు కలిసిన పదార్థాలను దీర్ఘకాలం వినియోగించడం వల్ల కాలేయం, మూత్రపిండాలపై ప్రభావం పడే అవకాశం ఉంది. అపరిశుభ్ర వంటశాలలు, కలుషిత నీరు, పదేపదే వాడే నూనెలు కూడా ఆహార సంబంధిత అనారోగ్యాలకు కారణమవుతాయి. పిల్లలు, వృద్ధులు, రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారిపై ఈ ముప్పు మరింత ఎక్కువగా ఉండొచ్చు.

### తనిఖీలతోనే సరిపోదు.. ప్రజల అప్రమత్తతా అవసరమే!

అమీర్‌పేట, మాదాపూర్, జూబ్లీహిల్స్, చార్మినార్ వంటి రద్దీ ప్రాంతాల్లోని హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాలు, బేకరీలు, స్వీట్ల దుకాణాల్లో పరిశుభ్రతపై నిరంతర నిఘా అవసరం. అక్టోబర్ 13న నిర్వహించిన తనిఖీల్లో 13రెస్టారెంట్లు, క్యాంటీన్లను పరిశీలించి, తీవ్రమైన పరిశుభ్రతా లోపాల నేపథ్యంలో నాలుగు ఆహార కేంద్రాల లైసెన్సులను నిలిపివేశారు. 16 ఆహార నమూనాలను పరీక్షల కోసం సేకరించారు. ఆహార భద్రతా నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతోపాటు, నమూనాల పరీక్ష ఫలితాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలి. వినియోగదారులు కూడా ప్యాకెట్లపై తయారీ తేదీ, గడువు, పదార్థాల వివరాలు, అనుమతి గుర్తులను పరిశీలించాలి. అసాధారణ రంగు, వాసన, రుచి ఉన్న ఆహారాన్ని తీసుకోకూడదు. అనుమానాస్పద విక్రయాలపై అధికారులకు ఫిర్యాదు చేయాలి. ప్రజల ప్రాణాల కంటే లాభాలే ముఖ్యమా? అన్న ప్రశ్నకు ఆహార వ్యాపారులు సమాధానం చెప్పాల్సిన సమయం వచ్చింది. కల్తీపై ఉక్కుపాదం, నిరంతర తనిఖీలు, వేగవంతమైన ప్రయోగశాల పరీక్షలు, ప్రజల్లో అవగాహన.. ఇవన్నీ సమన్వయంతో సాగితేనే భాగ్యనగర ప్రజల ఆహార భద్రతకు భరోసా లభిస్తుంది.



# పోలీస్ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

## టీపీసీసీ అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్

**హైదరాబాద్, వెలుతురు, అక్టోబర్ 21 :**

పోలీస్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా విధి నిర్వహణలో దేశం కోసం ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరులకు టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ఘన నివాళులర్పించారు.

ప్రజల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణ, సమాజంలో శాంతి స్థాపన కోసం పోలీసులు చేస్తున్న సేవలు అమూల్యమైనవని పేర్కొన్నారు.

ప్రజల ప్రాణ, ఆస్తుల రక్షణ కోసం పోలీసులు నిరంతరం అంకితభావంతో పనిచేస్తున్నారని, విధి నిర్వహణలో ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ ప్రజలకు భద్రత కల్పిస్తున్నారని తెలిపారు. దేశ భద్రత కోసం ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరుల సేవలు, ధైర్యసాహసాలు ఎప్పటికీ స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని పేర్కొన్నారు.

పోలీస్ అమరవీరుల కుటుంబాల త్యాగాలను సమాజం ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలని, వారి కుటుంబాలకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ప్రజల భద్రత కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధులు నిర్వర్తిస్తున్న పోలీసు సిబ్బంది సేవలను గౌరవించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పోలీస్ అమరవీరులందరికీ మరోసారి ఘన నివాళులర్పిస్తూ, వారి త్యాగాలు భావితరాలకు స్ఫూర్తిగా నిలవాలని మహేష్ కుమార్ గౌడ్ ఆకాంక్షించారు.

### సీఎం రేవంత్ రెడ్డికి దసరా శుభాకాంక్షలు తెలిపిన

## ప్రభుత్వ క్రియేటివ్ డైరెక్టర్ కొండా రాజు

**బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్ ఛాలెంజ్ 2026 విజయవంతంపై అభినందనలు తెలిపిన సీఎం**



**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 21:** తెలంగాణ ముఖ్య మంత్రి ఎ. రేవంత్ రెడ్డిని ప్రభుత్వ క్రియేటివ్ డైరెక్టర్ కొండా రాజు మర్యాదపూర్వకంగా కలిసి విజయదశమి దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్ ఛాలెంజ్ కార్యక్రమం నిర్వహణ, విజయవంతం గురించి ముఖ్యమంత్రి ఆరా తీశారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించినందుకు తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎఫ్‌డీసీ) చైర్మన్ దిల్ రాజు, ప్రభుత్వ క్రియేటివ్ డైరెక్టర్ కొండా రాజు, ఎఫ్‌డీసీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎం. ముకుంద రెడ్డిని సీఎం అభినందించారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్ ఛాలెంజ్‌కు సంబంధించిన అవార్డును కొండా రాజు అందజేశారు. ఈ సందర్భంగా సీఎం యువ ఫిల్మ్ మేకర్స్‌కు విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు.

## పాలపిట్టను విడుదల చేసిన ఘటనపై కేసు నమోదు



**ఉప్పల్, వెలుతురు, అక్టోబర్ 21:** దసరా వేడుకల్లో భాగంగా నిన్న రాత్రి ఉప్పల్ మినీ స్టేడియంలో పాలపిట్టను విడుదల చేసిన ఘటనపై అటవీ శాఖ అధికారులు కేసు నమోదు చేశారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో అధికారులు చర్యలు చేపట్టారు. ఈ ఘటనలో ఉప్పల్‌కు చెందిన ఈగ చంద్రశేఖర్, పి.పరమేశ్వర్‌రెడ్డి, మరికొందరి ప్రమేయం ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించినట్లు మేడ్చల్-మల్కాజ్ గిరి జిల్లా అటవీ అధికారి వేణుమాధవ్ తెలిపారు. దీంతో వన్యప్రాణి సంరక్షణ చట్టం--1972లోని సంబంధిత సెక్షన్లతో పాటు బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 35 కింద అక్టోబర్ 21న పీఓఆర్ నం. 16-03/2025-26తో కేసు నమోదు చేశారు. ప్రస్తుతం ఈ ఘటనపై విచారణ కొనసాగుతోందని, సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేసినట్లు అధికారులు తెలిపారు. విచారణ పూర్తయిన తర్వాత చట్టప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటామని, నిందితులను సంబంధిత మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరుస్తామన్నారు.

# దసరా వేదికను రాజకీయాలకు ఉపయోగించలేదు

- రాజకీయాలు మాట్లాడలేదు.. ఓట్లు అడగలేదు
- కానీ నా మనసులో ఉన్న మాటలను ప్రజలతో పంచుకుంటాను
- నన్ను కౌన్సిలర్ స్థాయి నుండి ఈ స్థాయి వరకు తీసుకొచ్చింది సంగారెడ్డి ప్రజలే..
- ఇంట్లో బిపి, షుగర్ తో బాధపడుతున్న తల్లిదండ్రులను కాపాడుకోండి..
- సంగారెడ్డి దసరా వేడుకల్లో జగ్గారెడ్డి కీలక వ్యాఖ్యలు





**సంగారెడ్డి, వెలుతురు, అక్టోబర్ 21:** "ప్రతి రోజూ దేవుడిని మొక్కే ముందే బీపీ, షుగర్ ఉన్నవారు వైద్యులు సూచించిన విధంగా మందులు వేసుకోవాలి. ఇంట్లో బీపీ, షుగర్‌తో బాధపడుతున్న తల్లిదండ్రులు ఉంటే వారు క్రమం తప్పకుండా మందులు తీసుకునేలా కుటుంబ సభ్యులు శ్రద్ధ పెట్టాలి" అని జగ్గారెడ్డి ప్రజలకు సూచించారు. వృద్ధాప్యంలో తల్లిదండ్రుల ఆరోగ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత కొడుకులు, కుమార్తెలు, కోడళ్లపై ఉందన్నారు. సంగారెడ్డి పట్టణంలోని అంబేద్కర్ స్టేడియంలో ఆధ్వర్యంలో నిర్వహించిన దసరా ఉత్సవాల్లో జగ్గారెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తూ కుటుంబ బంధాలు, పెద్దల ఆరోగ్యం, సంగారెడ్డి ప్రజలతో తనకున్న అనుబంధం గురించి భావోద్వేగంగా మాట్లాడారు.

**అంబరాన్నంటిన దసరా సంబురాలు**

సంగారెడ్డిలో దసరా ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఏటా అంబేద్కర్ స్టేడియం వేదికగా జగ్గారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించే దసరా వేడుకలు ఈసారి కూడా అత్యంత వైభవంగా సాగాయి. పట్టణంలోని రామమందిరంలో ప్రత్యేక భజన కార్యక్రమంతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. రామమందిరం భజన మండలి సభ్యులు, భక్తులతో కలిసి జగ్గారెడ్డి భజన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం సంప్రదాయబద్ధంగా శావను తీసుకుని రామమందిరం నుంచి అంబేద్కర్ స్టేడియం వరకు ఊరేగింపుగా తరలివచ్చారు. అంబేద్కర్ స్టేడియంలో దసరా ఉత్సవాల కోసం భారీ ఏర్పాట్లు చేశారు. వేదికపై మహేశ్వరశర్మ సిద్ధాంతి ఆధ్వర్యంలో జగ్గారెడ్డి కుటుంబ సభ్యులు సంప్రదాయబద్ధంగా జమ్మిపూజ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన రావణ దహన కార్యక్రమం ఉత్సవాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. భారీగా తరలివచ్చిన ప్రజలు రావణ దహనాన్ని ఆసక్తిగా తిలకించారు. ఆకాశంలో వెలుగులు విరజిమ్మిన బాణసంచా మెరుపులు, ఆకట్టుకునే డ్రోన్ల ప్రదర్శన ప్రేక్షకులను కనువిందు చేశాయి. ప్రముఖ సినీ నేపథ్య గాయకులచే ఏర్పాటు చేసిన సంగీత విభావరి ఆహుతులను మంత్ర ముగ్ధులను చేసింది.

**సంగారెడ్డి ప్రజలే నన్ను ఈ స్థాయికి తీసుకొచ్చారు**

ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ తన రాజకీయ ప్రస్థానాన్ని, సంగారెడ్డి ప్రజలతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. "నా దగ్గర చాలా డబ్బులు ఉన్నాయని అందరూ అనుకుంటారు. కానీ నాకు వచ్చిన డబ్బును ప్రతి ఏటా సంగారెడ్డి ప్రజల కోసం పండుగలు నిర్వహించడానికి ఖర్చు చేస్తున్నాను. నలభై ఏళ్ల క్రితం చిన్న వయసులో ఉన్నప్పుడు ఇదే మైదానంలో నా స్నేహితులతో కలిసి దసరా వేడుకల్లో పాల్గొన్నాను. ఆనాటి నుంచి ఈనాటి వరకు సంగారెడ్డితో నా అనుబంధం కొనసాగుతోంది. నన్ను కౌన్సిలర్ స్థాయి నుంచి ఈ స్థాయికి తీసుకొచ్చింది సంగారెడ్డి ప్రజలే" అని పేర్కొన్నారు. దసరా వేదికను తాను ఎన్నడూ రాజకీయాల కోసం ఉపయోగించుకోలేదన్నారు. "ఈ వేదికపై నుంచి నేను ఎప్పుడూ రాజకీయాలు మాట్లాడలేదు. ఓట్లు అడగలేదు. కానీ నా మనసులో ఉన్న మాటలను మాత్రం ప్రజలతో పంచుకుంటాను" అని చెప్పారు.

**సంగారెడ్డి ప్రజలంతా నా కుటుంబమే..**

"కుటుంబం అంటే కేవలం నా భార్య, పిల్లలు మాత్రమే కాదు. సంగారెడ్డి ప్రజలందరినీ నా కుటుంబ సభ్యులుగానే భావిస్తాను. అందుకే ప్రతి ఏటా అందరితో కలిసి పండుగలు జరుపుకుంటాను" అని జగ్గారెడ్డి అన్నారు. వయసు పెరిగేకొద్దీ తల్లిదండ్రుల ఆరోగ్యంపై పిల్లలు మరింత శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందని సూచించారు. ముఖ్యంగా బీపీ, షుగర్ వంటి దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న పెద్దలు వైద్యుల సూచనల మేరకు మందులు తీసుకునేలా చూడాలన్నారు. ఇంట్లో పెద్దల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని, వారికి అవసరమైన సంరక్షణ అందించాలని కోరారు. కొడుకులు, కుమార్తెలతో పాటు కోడళ్లు కూడా కుటుంబంలోని పెద్దల ఆరోగ్యంపై బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. కాళ్లు, చేతులు పడిపోయిన తర్వాత ఎన్ని కోట్లు ఖర్చు పెట్టినా ప్రయోజనం లేదన్నారు. పండుగలంటే కేవలం ఆటపాటలు, వినోదం మాత్రమే కాదని, కుటుంబ సభ్యుల మధ్య ప్రేమానురాగాలు, ఆప్యాయతలు పెంపొందించుకునే సందర్భాలని ఆయన వ్యాఖ్యల ద్వారా సందేశమిచ్చారు. ప్రజల ఆరోగ్యం, కుటుంబ బంధాల ప్రాధాన్యాన్ని వివరిస్తూ జగ్గారెడ్డి చేసిన ప్రసంగం దసరా వేడుకల్లో ప్రత్యేకంగా నిలిచింది.



## భారీగా హాజరైన నాయకులు, కార్యకర్తలు

**కొత్తపల్లి, వెలుతురు అక్టోబర్ 21:** టీడీపీ ఎంపీటీసీలు ప్రాతకోట రమేష్ (దుద్యాల ఎంపీటీసీ 1), ఈరగాళ్ల రాజు (దుద్యాల ఎంపీటీసీ 2) ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి గ్రామానికి చెందిన సుమారు 200 మంది టీడీపీ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. టీడీపీ సీనియర్ నాయకులు జి. మహమ్మద్ రఫీ, మల్లారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని పలు అంశాలపై చర్చించారు. గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడం, కార్యకర్తల మధ్య సమన్వయాన్ని పెంపొందించడం, పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం వంటి అంశాలకు ప్రాధాన్యత ఇచ్చారు. ఈ సమావేశానికి పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు హాజరుకావడంతో టీడీపీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది.

# ఎక్కిన కిక్కు

- బీర్ల అమ్మకాల్లో 41 శాతానికి పైగా పెరుగుదల
- 30.37 లక్షల కేసులకు చేరిన బీర్ల విక్రయాలు
- అమ్మకాలు 18.38 లక్షల కేసులకు పెరుగుదల
- అక్టోబర్ 19న రూ.303.40 కోట్ల విక్రయాలు




**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 21:** గత ఏడాదితో పోలిస్తే 37.02 శాతం వృద్ధి తెలంగాణలో దసరా పండుగ సీజన్‌లో మద్యం విక్రయాలు భారీగా పెరిగాయి. అక్టోబర్ 1 నుంచి 19 వరకు రాష్ట్రవ్యాప్తంగా రూ. 2,054.51 కోట్ల విలువైన మద్యం అమ్ముడైంది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే విక్రయాలు 37.02 శాతం పెరిగినట్లు ఎక్సైజ్ శాఖ గణాంకాలు వెల్లడించాయి. పండుగ వేళ బీర్లకు డిమాండ్ గణనీయంగా పెరగడం ఈసారి ప్రత్యేకంగా కనిపించింది. ఇండియన్ మేడ్ ఫారిన్ లిక్కర్ తో పోలిస్తే బీర్ల విక్రయాలు వేగంగా పెరిగాయి. గత ఏడాది అక్టోబర్ 1 నుంచి 19 వరకు 21.55 లక్షల కేసుల బీర్లు అమ్ముడవగా, ఈ ఏడాది ఆ సంఖ్య 30.37 లక్షల కేసులకు చేరింది. దీంతో బీర్ల అమ్మకాల్లో 41 శాతానికి పైగా వృద్ధి నమోదైంది. ఇక విక్రయాలు గత ఏడాది 14.16 లక్షల కేసులుగా ఉండగా, ఈసారి 18.38 లక్షల కేసులకు పెరిగాయి. అక్టోబర్ 19న రాష్ట్రంలో ఒక్కరోజే రూ. 303.40 కోట్ల విలువైన మద్యం విక్రయాలు జరిగాయి. పండుగ సీజన్ ప్రారంభంలో అమ్మకాలు నెమ్మదిగా సాగినా, రెండో వారం నుంచి వేగం పుంజుకు న్నాయి. అక్టోబం16 నాటికి మొత్తం విక్రయాల విలువ రూ. 1,527.85 కోట్లుగా ఉండగా, మరో మూడు రోజుల్లోనే రూ. 2,000 కోట్ల మార్కును దాటింది. అక్టోబర్ 19 వరకు నమోదైన గణాంకాల ఆధారంగానే ఈ వివరాలను ఎక్సైజ్ శాఖ వెల్లడించింది.

# పోలీసు అమరుల త్యాగాలు వెలకట్టలేనివి

- సంస్మరణ దినోత్సవంలో కలెక్టర్, సీ.పీ
- అమరుల కుటుంబాలకు అండగా నిలుస్తాం కారుణ్య నియామకాల ప్రక్రియ వేగవంతానికి కృషి
- విధి నిర్వహణలో అసువులు బాసిన అమరులకు ఘన నివాళులు




**నిజామాబాద్, వెలుతురు అక్టోబర్ 21:** శాంతి భద్రతల పరిరక్షణ కోసం అహరహం శ్రమిస్తూ అసువులు బాసిన పోలీసు అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివని, సమాజం ఎల్లవేళలా వారికి రుణపడి ఉంటుందని కలెక్టర్ ఇలా త్రిపాఠి, పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య అన్నారు. విధి నిర్వహణలో భాగంగా సంఘ విద్రోహ శక్తులతో పోరాడుతూ, అమరులైన పోలీసులను స్మరించుకోవడం, వారి కుటుంబాల త్యాగాలను గుర్తించడం ప్రతి ఒక్కరి కనీస బాధ్యత అని గుర్తు చేశారు. పోలీసు అమరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పోలీస్ కమిషనర్ సాయి చైతన్యతో కలిసి పోలీసు అమరవీరుల స్థూపం వద్ద పుష్పగుచ్ఛాలు సమర్పించి నివాళులర్పించారు. రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, శాంతి భద్రతల పరిరక్షణ విధుల్లో పోలీసులు అనునిత్యం నిమగ్నం అయి ఉంటారని అన్నారు. ఈ క్రమంలో ఎదురయ్యే అనేక సవాళ్లను తమ ప్రాణాలను పణంగా పెట్టి ధైర్యంగా ఎదుర్కొంటారని అన్నారు. ఈ నేపథ్యంలోనే గత సంవత్సరం నిజామాబాద్ జిల్లా కేంద్రంలో అసాంఘిక శక్తుల చేతిలో ప్రమోద్ కుమార్ అనే సీసీఎస్ కానిస్టేబుల్ వీర మరణం పొందారని ఆవేదన వ్యక్తం చేశారు. ముంబైలో తీవ్రవాదులు దాడి చేసిన సమయంలో వారిని ఎదుర్కొనేందుకు కానిస్టేబుల్ తుకారాం చూపిన ధైర్య సాహసాలు అనన్య సామాన్యమని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. పోలీసులు కేవలం శాంతి భద్రతల పరిరక్షణకే పరిమితం కాకుండా తప్పిపోయిన చిన్నారుల ఆచూకీ కనుగొని వారిని తల్లిదండ్రుల చెంతకు చేర్చడం, మహిళకు భద్రత కల్పించడం, అన్నివర్గాల వారికి భరోసాగా నిలవడం వంటి విధులను సమర్థవంతంగా నిర్వహిస్తున్నారని కొనియాడారు. పోలీసు అమరుల కుటుంబాలకు ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం ఎల్లవేళలా అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఇందులో భాగంగానే కారుణ్య నియామకాల ప్రక్రియను వేగవంతం చేస్తామని అన్నారు. పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య మాట్లాడుతూ, ఈ ఏడాది దేశవ్యాప్తంగా 154 మంది పోలీసులు అమరులయ్యారని అన్నారు. నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలో 1986 నుండి ఇప్పటివరకు 21 మంది పోలీసులు అసాంఘిక శక్తులతో పోరాడుతూ అసువులు బాశారని ఆవేదన వ్యక్తం చేశారు. శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయంగా తమ కర్తవ్య నిర్వహణలో ఎల్లవేళలా పోలీసులు ముందంజలో నిలుస్తున్నారని అన్నారు. అమరుల కుటుంబాలకు పోలీసు శాఖ ఎల్లవేళలా చేదోడువాదోడుగా ఉంటుందని భరోసా కల్పించారు. ఇప్పటికే 11 మందికి ఇంటి స్థలాలు కేటాయించడం జరిగిందని, మిగతా పది కుటుంబాలకు వారు కోరిన మేరకు కామారెడ్డి, మాక్లూర్, హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో స్థలాలు కేటాయించేలా రెవెన్యూ అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నామని తెలిపారు. అమరులైన పోలీసుల ప్రతి కుటుంబానికి స్థలం లభించే వరకు పట్టుదలతో పర్యవేక్షిస్తామని అన్నారు. అమరుల కుటుంబాలు తమ సాధకబాధకాలు తెలియజేసేందుకు వరుసలో వేచి ఉండాల్సిన అవసరం లేకుండా కమిషనరేట్ కార్యాలయంలో ప్రత్యేకంగా ఒక అధికారిని నియమిస్తామని తెలిపారు. అంతేకాకుండా స్టేషన్ హౌజ్ ఆఫీసర్లు అమరుల కుటుంబాలను స్వయంగా కలిసి వారి అవసరాలను గుర్తిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలో విధి నిర్వహణలో అమరులైన పోలీసుల కుటుంబీకులకు జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ శుభం నగ్రాలే, ఏ.సి.పి (ఎ.ఆర్) కృష్ణ, నిజామాబాద్, ఆర్మూర్, బోధన్, సిసిఎస్, ట్రాఫిక్, సి.టి.సి ఏసీపీలు, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్, సీఐలు, ఎస్.ఐలు, పోలీసు సిబ్బంది, అమరవీరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని ప్రపంచానికి

# చాటేలా గ్లోబల్ సమ్మిట్‌లో కళా ప్రదర్శనలు

- డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026
- సమ్మిట్ ప్రారంభోత్సవం, కల్చరల్ కార్నివాల్, ప్రచార కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాలి : రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు



**హైదరాబాద్, వెలుతురు, అక్టోబర్ 21:** తెలంగాణ గొప్ప సాంస్కృతిక, కళా వారసత్వాన్ని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో చాటిచెప్పేలా డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్?2026 సందర్భంగా జానపద, శాస్త్రీయ సంగీత, నృత్య కార్యక్రమాలతో పాటు వివిధ సాంస్కృతిక కళారూపాల ప్రదర్శనలను విస్తృతంగా ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్?2026 నిర్వహణకు చేపట్టాల్సిన ఏర్పాట్లపై బుధవారం సంబంధిత ఉన్నతాధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సమ్మిట్ నిర్వహణ, అతిథులకు స్వాగతం, సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రచార వ్యూహాలు తదితర అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయి ప్రముఖ పారిశ్రామికవేత్తలు, ప్రతినిధులు హాజరుకానున్న ఈ సమ్మిట్ ద్వారా తెలంగాణ పెట్టుబడుల అవకాశాలతో పాటు రాష్ట్ర చారిత్రక, సాంస్కృతిక వైభవాన్ని ప్రపంచానికి పరిచయం చేయాలని సీఎస్ సూచించారు. సమ్మిట్ ప్రారంభోత్సవం సందర్భంగా అతిథులకు ఘన స్వాగతం పలికేలా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన సంప్రదాయ కళారూపాలతో ప్రత్యేక ప్రదర్శనలు ఏర్పాటు చేయాలన్నారు. సమ్మిట్‌లో భాగంగా డిసెంబర్ 7 నుంచి 9 వరకు నిర్వహించనున్న రక్షా ఎక్స్‌పో చివరి రోజైన డిసెంబర్ 9న ఏర్పాటు చేయనున్న ఎయిర్ షోను వీక్షించేందుకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యే అవకాశం ఉన్నందున, ఆ రోజున తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని ప్రతిబింబించేలా ప్రత్యేక కల్చరల్ కార్నివాల్ నిర్వహించాలని ఆదేశించారు.

సమ్మిట్‌కు విస్తృత ప్రచారం కల్పించాలి

ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు కర్టెన్ రైజర్ కార్యక్రమాలను ఈ నెల 24న హైదరాబాద్‌లో, 29న న్యూఢిల్లీలో ఘనంగా నిర్వహించాలని సీఎస్ సూచించారు. సమ్మిట్, రక్షా ఎక్స్‌పోలకు సంబంధించిన సమాచారాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఢిల్లీ, ముంబై, బెంగళూరు వంటి ప్రధాన నగరాల్లోని అంతర్జాతీయ విమానాశ్రయాల్లో ఆకర్షణీయమైన హోర్డింగులు ఏర్పాటు చేయాలన్నారు. న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌తో పాటు ఇతర ప్రముఖ ప్రాంతాల్లోనూ ప్రచార హోర్డింగులు ఏర్పాటు చేయాలని, హైదరాబాద్‌లో శంషాబాద్ విమానాశ్రయానికి వెళ్లే మార్గంతో పాటు నగరంలోని ప్రధాన రహదారులు, ప్రముఖ ప్రాంతాలు, స్టార్ హోటళ్ల వద్ద వెంటనే హోర్డింగులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. జాతీయ స్థాయి ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాతో పాటు సోషల్ మీడియా వేదికల ద్వారా సమ్మిట్‌కు విస్తృత ప్రచారం కల్పించాలని తెలిపారు. సినీ ప్రముఖులు, ఇతర సెలబ్రిటీల భాగస్వామ్యంతో ప్రత్యేక షార్ట్ ఫిల్మ్‌లు రూపొందించి, సమ్మిట్ ప్రాధాన్యతను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్, ముఖ్య కార్యదర్శి శిఖా గోయల్, కార్యదర్శులు హరిచందన, శశాంక, ముకుంద్ రెడ్డి, అజిత్ రెడ్డి, ముఖ్యమంత్రి కార్యాలయ సీపీఆర్ఓ మల్సూర్, డిజిటల్ విభాగం డైరెక్టర్ కర్రీ శ్రీరామ్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఖిల్లా రామాలయానికి రోప్ వే మంజూరు



**నిజామాబాద్, వెలుతురు అక్టోబర్ 21 :** ఎంతో ఘన చరిత్ర కలిగిన ఇందూరు ఖిల్లా రామాలయానికి రోప్ వే మంజూరైనట్లు అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... చత్రపతి శివాజీ గురువు సమర్థ రామదాసు నిర్మించిన చారిత్రాత్మక కట్టడం ఖిల్లా రామాలయం అన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో దాశరథి కృష్ణమాచార్యులు జైలు శిక్షణ అనుభవిస్తూ "తెలంగాణ నాకోటి రతనాల వీణ " అని రాసిన గొప్ప చరిత్ర కలిగిన ఖిల్లా రామాలయానికి రోప్ వే మంజూరు కావడం సంతోషకరమన్నారు. పర్యాటక స్థలంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. సుమారు రూ. 35 కోట్ల నిధులతో రోప్ వే నిర్మాణం కానుందని, ఇందుకోసం డీపీఆర్ సిద్ధం చేస్తున్నారని పేర్కొన్నారు. గతంలో పాలించిన పాలకులు రామాలయ అభివృద్ధిని మరిచారన్నారు. మోదీ ప్రభుత్వం చారిత్రక కట్టడాలపై ప్రత్యేక దృష్టి వహిస్తుందని తెలిపారు. ఇందులో భాగంగానే పర్వతమాల పథకానికి శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ తో కలిసి ఖిల్లా రామాలయ అభివృద్ధి కొరకు గతంలో కేంద్ర మంత్రుల దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. దీంతో రోప్ వే మంజూరైనట్లు స్పష్టం చేశారు. కేంద్రమంత్రి నితిన్ ఘట్కరితోపాటు రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి ఖిల్లా రామాలయ అభివృద్ధి పై అనేక సార్లు లేఖలు అందజేయడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా రాష్ట్రప్రభుత్వం ఇటీవల రోడ్లు భవనాల శాఖ అధికారులను, రోప్ వే కంపెనీ ప్రతినిధులను పంపడం సంతోషకరమన్నారు. అర్బన్ నియోజకవర్గ అభివృద్ధి తన లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో నిలిచిపోయిన పనులపై కూడా అనేకసార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు గుర్తు చేశారు. రాష్ట్రంలో డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఒక్కటి కూడా రాని నియోజకవర్గం ఇందూరు ఒకటేనని చెప్పారు. సమస్యను మంత్రి పొంగిలేటి దృష్టికి తీసుకెళ్లి మంజూరు చేయాలని కోరినట్లు పేర్కొన్నారు. దీంతో ఇటీవల అర్బన్ లోని సౌత్ మండల అర్హులకు ఇళ్లను కేటాయించాలని గుర్తు చేశారు. అలాగే స్థలం లేని వారికి హైదరాబాద్ మాదిరిగా టవర్లు నిర్మించి ఇవ్వాలని చెప్పినట్లు తెలిపారు. ప్రధానంగా స్పెషల్ ఫండ్ కోసం ప్రభుత్వానికి అనేకసార్లు లీగల్ రాసిన స్పందించడం లేదన్నారు. చివరికి పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లినా లాభం లేకుండా పోయిందన్నారు. స్పెషల్ ఫండ్ కేటాయిస్తే నియోజకవర్గ అభివృద్ధి సులువుగా అవుతుందని తెలిపారు. ఇందూరులో కాషాయ జెండా గెలుపును ఓర్చుకోలేక నిధులు విడుదల చేయడం లేదని విమర్శించారు. అవసరపు మాటలు మాట్లాడటమే తప్ప అభివృద్ధి కొరకు కాంగ్రెస్ ఆలోచించడం లేదన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నాగోల్ల లక్ష్మీనారాయణ, కార్పొరేటర్లు ఎర్రం సుధీర్, జగదీష్ కులకర్ణి, మఠం పవన్, రాము, విజయ మల్లేష్ యాదవ్, ప్రసూన శ్రీనివాస్ రెడ్డి, జ్యోతి మురళి, సుమిత్ర కిషోర్, బంటు ప్రీతి ప్రవీణ్, మహిళా మోర్చ అధ్యక్షురాలు వనిత, యువ మోర్చ అధ్యక్షుడు వంశీ, యువ మోర్చ రాష్ట్ర సహ కోశాధికారి విజయ్, ఎస్సీ మోర్చ పురుషోత్తం, వీరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీటీసీ ఎన్నికల బరిలో తొలిరోజు అభ్యర్థులెవరూ లేరు

**బేతంచెర్ల, వెలుతురు అక్టోబర్ 21::** ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైనా బేతంచెర్ల మండలంలో తొలిరోజు అభ్యర్థుల నుంచి స్పందన కరువైంది. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నామినేషన్ల స్వీకరణకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేసినప్పటికీ, ఒక్క అభ్యర్థి కూడా నామినేషన్ దాఖలు చేయలేదు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను రిటర్నింగ్ ఆఫీసర్ బషీరున్నిసా బేగం, అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ ఫజల్ రహిమాన్, ఎక్స్‌పెండిచర్ అబ్జర్వర్ సునీల్ కుమార్, పర్యవేక్షిస్తూ ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా వివరాలు వెల్లడించారు. తొలిరోజు నామినేషన్లు లేకపోవడంతో తదుపరి. రెండు రోజుల్లో అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయవచ్చునని తెలిపారు.

## ఫ్యాన్సీ పేర్ల మాటున

# విద్యా దోపిడీకి అడ్డుకట్ట ఎప్పుడు?

**విద్య వ్యాపారం కాదు.. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడే అవకాశం అంతకన్నా కాదు. కానీ రాష్ట్రంలో ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల వ్యవహారశైలి చూస్తే విద్యను సేవగా కాకుండా లాభార్జనకు అనువైన వ్యాపారంగా మార్చిన పరిస్థితి స్పష్టంగా కనిపిస్తోంది. పాఠశాలలకు ఆకర్షణీయమైన పేర్లు పెట్టి, ఆ పేర్ల వెనుక ప్రత్యేక విద్యాప్రమాణాలు, అంతర్జాతీయ స్థాయి బోధన, సాంకేతిక విద్య, పోటీ పరీక్షల శిక్షణ వంటి భ్రమలను తల్లిదండ్రుల్లో కల్పించి భారీగా ఫీజులు వసూలు చేస్తున్న యాజమాన్యాలపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. మరింత ఆందోళన కలిగించే విషయం ఏమిటంటే నిబంధనలను ఉల్లంఘిస్తూ ఇలాంటి పేర్లను బహిరంగంగా ఉపయోగిస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాల్సిన విద్యాశాఖ అధికారులు ప్రేక్షక పాత్రకు పరిమితమవుతున్నారు. రాష్ట్రంలో వేలాది ప్రైవేట్ పాఠశాలలు కొనసాగుతున్నాయి.**




వీటిలో అనేక పాఠశాలలు తమ అసలు రికార్డుల్లో ఒక పేరుతో నమోదై ఉన్నప్పటికీ, ప్రజలకు కనిపించే బోర్డులు, ప్రవేశ ద్వారాలు, పాఠశాల బస్సులు, గోడలపై ప్రకటనలు, కరపత్రాలు, ప్రచార సామగ్రి తదితరాల్లో 'ఇంటర్నేషనల్', 'వరల్డ్', 'టెక్నో', 'ఈ-టెక్నో', 'మోడల్', 'కాన్సెప్ట్', 'స్పేస్', 'ఐఐటీ', 'ఒలింపియాడ్' వంటి ఆకర్షణీయమైన పదాలను జోడించుకుంటు న్నాయి. ఇవి కేవలం పేర్లు కావని, తల్లిదండ్రుల మానసిక స్థితిని ప్రభావితం చేసే వాణిజ్య ప్రచార సాధనాలుగా మారుతున్నాయనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. విద్యాహక్కు చట్టం, రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన సంబంధిత ఉత్తర్వులు, ముఖ్యంగా జీవో నంబర్ 91 ప్రకారం పాఠశాలల పేర్ల విషయంలో నిర్దిష్ట నిబంధనలు ఉన్నప్పుడు వాటిని అమలు చేయాల్సిన బాధ్యత యాజమాన్యాలపై మాత్రమే కాదు, వాటిని పర్యవేక్షించే ప్రభుత్వ యంత్రాంగంపైనా ఉంటుంది. పాఠశాలకు అనుమతి ఒక పేరుతో తీసుకుని, ప్రజల్లో మరో ఆకర్షణీయమైన పేరుతో ప్రచారం చేయడం నిబంధనల స్ఫూర్తికేవిరుద్ధం. అధికారిక రికార్డుల్లో 'ప్రైవేట్ స్కూల్'గా ఉండి, బయట మాత్రం 'ఇంటర్నేషనల్ స్కూల్', 'వరల్డ్ స్కూల్', 'టెక్నో స్కూల్' వంటి పేర్లతో ప్రచారం చేసుకోవడం ద్వారా తల్లిదం డ్రుల్లో తప్పుడు అభిప్రాయం కలిగిస్తే దానిని సాధారణ మైన పేరుమార్పుగా చూడలేం. ఇది వినియోగదారు డిని తప్పుదోవ పట్టించే ప్రచారంగా కూడా పరిశీలిం చాల్సిన అవసరం ఉంది. ఒక పాఠశాల తన పేరు చివర 'ఇంటర్నేషనల్' అని పెట్టుకున్నంత మాత్రాన అది అంతర్జాతీయ ప్రమాణాల పాఠశాల అయిపోదు. 'ఐఐటీ', 'ఒలింపియాడ్' వంటి పదాలను ఉపయోగించి నంత మాత్రాన అక్కడి విద్యార్థులకు ఐఐటీ స్థాయి శిక్షణ అందుతున్నట్లు కాదు. 'టెక్నో' అనే పదం జోడించినంత మాత్రాన ఆధునిక సాంకేతిక విద్య అందుతున్నదనే హామీ ఉండదు. అయినప్పటికీ ఇలాంటి పేర్లను చూసి తల్లిదండ్రులు తమ పిల్లలకు మెరుగైన విద్య అందుతుందని భావించి అధిక ఫీజులు చెల్లించే పరిస్థితి ఏర్పడుతోంది. ఈ భ్రమను సృష్టించడమే కొంతమంది కార్పొరేట్ విద్యాసంస్థల మార్కెటింగ్ వ్యూహంగా మారితే దాన్ని నియంత్రించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తు కోసం తమ ఆర్థిక స్థోమతకు మించి ఖర్చు చేయడానికి సిద్ధపడుతు న్నారు. ఈ భావోద్వేగాన్ని ప్రైవేట్ విద్యాసంస్థలు వ్యాపార ప్రయోజనాలకు ఉపయోగించుకోవడం సమర్థనీయం కాదు. పాఠశాల పేరు గొప్పగా ఉండటం కంటే అక్కడి ఉపాధ్యాయుల నాణ్యత, విద్యార్థి-ఉపాధ్యాయ నిష్పత్తి, బోధనా విధానం, మౌలిక సదుపాయాలు, భద్రతా ప్రమాణాలు, గుర్తింపు, అనుమతులు, విద్యా ఫలితాలు వంటి అంశాలే ముఖ్యమైనవి. కానీ మార్కెట్ పోటీ పెరుగుతున్న కొద్దీ విద్యా ప్రమాణాల కంటే పేర్లకే ప్రాధాన్యం పెరగడం ఆందోళనకరం. ఇక్కడ అసలు ప్రశ్న ప్రైవేట్ పాఠశాలలు ఇలాంటి పేర్లు ఎందుకు పెట్టుకుంటున్నాయనే దానికంటే, నిబంధనలకు విరుద్ధంగా బోర్డులు పెట్టుకుంటున్న విషయం అధికారుల కళ్లముందే జరుగుతున్నా ఎందుకు చర్యలు ఉండటం లేదన్నదే. జిల్లాల స్థాయిలో జిల్లా విద్యాశాఖ అధికారులు, మండల స్థాయిలో మండల విద్యాధికారులు పాఠశాలల తనిఖీలు నిర్వహించాల్సి ఉంటుంది. నిబంధనలు ఉల్లంఘిస్తున్నట్లు తేలితే నోటీసులు జారీ చేయడం, వివరణ కోరడం, అక్రమ బోర్డులను తొలగించడం, అవసరమైతే గుర్తింపు నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు తీసుకోవడం వంటి అధికారిక ప్రక్రియలు ఉండాలి. కానీ సంవత్సరాల తరబడి నిబంధనలకు విరుద్ధంగా బోర్డులు కొనసాగుతున్నా యంటే పర్యవేక్షణ వ్యవస్థలోనే తీవ్రమైన లోపం ఉందని అర్థం. గతంలో ఇలాంటి ఫ్యాన్సీ పేర్లను తొలగించేం దుకు అధికారులు చర్యలు తీసుకున్న సందర్భాలు ఉన్నాయి. కొన్ని చోట్ల పేర్లపై నలుపు రంగు పూయించడం, బోర్డులు తొలగించడం వంటి చర్యలు చేపట్టారు. అయితే కొంతకాలం తర్వాత అదే పేర్లు తిరిగి ప్రత్యక్షమవుతున్నాయంటే సమస్య మూలాన్ని అధికారులు పరిష్కరించలేకపోయారని స్పష్టమవు తోంది. ఒకసారి నిబంధన ఉల్లంఘించిన పాఠశాలకు చర్య తీసుకుని, కొంతకాలం తర్వాత మళ్లీ అదే ఉల్లంఘనకు అవకాశం ఇవ్వడం వల్ల చట్టం పట్ల గౌరవం ఏర్పడదు. పైగా నిబంధనలను పాటించే పాఠశాలల యాజమాన్యాలకు కూడా ఇది అన్యాయం. చట్టం ఉన్నంత మాత్రాన సరిపోదు. దాని అమలు జరిగేలా చూడాలి. ప్రభుత్వం రూపొందించిన నిబంధనలను అమలు చేయకుండా వదిలేస్తే అవి కాగితాలకే పరిమితమవుతాయి. ముఖ్యంగా విద్యారంగం వంటి సున్నితమైన రంగంలో ప్రభుత్వ పర్యవేక్షణ బలహీనపడితే దాని ప్రభావం నేరుగా విద్యార్థులు, తల్లిదండ్రులపై పడుతుంది. అందువల్ల నిబంధనలకు విరుద్ధంగా పేర్లు, బోర్డులు, ప్రచార ప్రకటనలు ఉపయోగిస్తున్న ప్రతి పాఠశాలపై జిల్లా వారీగా సమగ్ర తనిఖీలు నిర్వహించాలి. ప్రభుత్వం ముందుగా రాష్ట్రంలోని అన్ని ప్రైవేట్ పాఠశాలల అధికారిక పేర్లు, గుర్తింపు వివరాలు, అనుమతులు, నిర్వహణ స్థితి వంటి సమాచారాన్ని డిజిటల్ రూపంలో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి. పాఠశాల అధికారిక రికార్డుల్లో ఉన్న పేరు, ప్రజలకు కనిపించే పేరు ఒకటేనా కాదా అనే విషయాన్ని పరిశీలించాలి. నిబంధనలకు విరుద్ధంగా అదనపు పదాలు ఉపయోగిస్తున్న పాఠశాలలకు ముందుగా నోటీసులు జారీ చేసి, నిర్ణీతగడువులో బోర్డులు, బస్సులు, ప్రకటనలు, వెబ్సైట్లు, సోషల్ మీడియా ప్రచారం సహా అన్ని వేదికల నుంచి అనధికార పేర్లను తొలగించేలా ఆదేశించాలి. ఆదేశాలను పాటించని యాజమాన్యాలపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలి. అంతేకాదు, ఫ్యాన్సీ పేర్లను ఉపయోగించి తల్లిదండ్రుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్నారా అనే అంశాన్ని కూడా ప్రభుత్వం పరిశీలించాలి. ఒక పాఠశాల ఏ పేరుతో నమోదు అయి ఉంది? ఏ పేరుతో ప్రచారం చేసుకుంటోంది? ఏ సేవలను అందిస్తామని చెబుతోంది? వాస్తవంగా ఏ సేవలను అందిస్తోంది? వాటికి అనుగుణంగానే ఫీజులు వసూలు చేస్తున్నదా? అనే అంశాలపై సమగ్ర విచారణ అవసరం. తప్పుడు లేదా అతిశయోక్తి ప్రచారం ద్వారా తల్లిదండ్రులను ఆకర్షించి ఆర్థికంగా దోచుకుంటున్నట్లు తేలితే సంబంధిత చట్టాల ప్రకారం చర్యలు తీసుకోవాలి. పాఠశాల అనేది కేవలం భవనం కాదు. అది ఒక తరం భవిష్యత్తును నిర్మించే సంస్థ. అందుకే విద్యాసంస్థల విషయంలో ప్రభుత్వం నియంత్రణ సంస్థగా మాత్రమే కాకుండా ప్రజల హక్కులను పరిరక్షించే సంరక్షకుడిగా వ్యవహరించాలి. తల్లిదండ్రుల అజ్ఞానాన్ని, పిల్లల భవిష్యత్తుపై వారి ఆందోళనను వ్యాపార ప్రయోజనాలకు ఉపయోగించుకునే పరిస్థితిని ప్రభుత్వం అనుమతించకూడదు. విద్యాశాఖ ఉన్నతాధికారులు ఇకనైనా జిల్లా వారీగా ప్రత్యేక తనిఖీ బృందాలను ఏర్పాటు చేసి నిబంధనలకు విరుద్ధమైన పాఠశాల పేర్లపై చర్యలు ప్రారంభించాలి. అనధికార బోర్డులను తొలగించాలి. నిబంధనలు ఉల్లంఘించిన యాజమాన్యాల వివరాలను ప్రజలకు వెల్లడించాలి. అదే సమయంలో విధులను నిర్లక్ష్యం చేసిన అధికారుల బాధ్యతను కూడా నిర్ధారించాలి. ఎందుకంటే అక్రమాన్ని చేసే యాజమాన్యాలపై చర్యలు తీసుకోవడం ఎంత ముఖ్యమో, అక్రమాన్ని చూసి కూడా పట్టించుకోని అధికారులను జవాబుదారులుగా నిలపడం అంతే ముఖ్యం. ప్రభుత్వం చట్టాలు చేయడం మాత్రమే తన బాధ్యతగా భావించకూడదు. వాటిని అమలు చేయడం కూడా ప్రభుత్వ రాజ్యాంగబద్ధమైన పరిపాలనాబాధ్యత. విద్యాహక్కు చట్టం లక్ష్యం ప్రతి చిన్నారికి నాణ్యమైన, సమానమైన విద్య అందించడం. ఆ లక్ష్యాన్ని పక్కనపెట్టి విద్యను మార్కెట్ వస్తువుగా మార్చే ధోరణికి అడ్డుకట్ట వేయాలి. పాఠశాల పేరు చివర 'ఇంటర్నేషనల్' ఉందా, 'వరల్డ్' ఉందా, 'టెక్నో' ఉందా అన్నది విద్యా నాణ్యతకు ప్రమాణం కాదని సమాజానికి తెలియజేయాల్సిన బాధ్యత కూడా ప్రభుత్వానిదే. నిబంధనలు ఉల్లంఘిస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవడం ఏ ఒక్క విద్యార్థి సంఘం డిమాండ్కో, ఏ ఒక్క తల్లిదండ్రుల ఫిర్యాదుకో పరిమితం కాకూడదు. ఇది విద్యా వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం, చట్టపాలనకు సంబంధించిన ప్రశ్న. ప్రభుత్వం తక్షణమే స్పందించి రాష్ట్ర వ్యాప్తంగా తనిఖీలు నిర్వహించి, అక్రమ ఫ్యాన్సీ పేర్లను తొలగించి, తల్లిదండ్రులను తప్పుదోవ పట్టించే ప్రచారానికి ముగింపు పలకాలి. లేకపోతే చట్టాలు ఒకవైపు, వాటిని బేఖాతరు చేసే కార్పొరేట్ విద్యా వ్యాపారం మరోవైపు అన్న పరిస్థితి మరింత బల పడుతుంది. విద్యను వ్యాపార దోపిడీ నుంచి కాపాడటం, విద్యా ర్థుల హక్కులను పరిరక్షించడం, తల్లిదండ్రులకు న్యాయం చేయడం ప్రభుత్వానికి ఉన్న బాధ్యత. ఆ బాధ్యత నుంచి పాలకులు తప్పిం చుకునే వీలు లేదు అనేది గుర్తు ఎరుగాలి.



-మన్నారం నాగరాజు
సామాజిక రాజకీయ విశ్లేషకులు

---

#### పర్యావరణంలో మార్పులు -

## నీటిని జాగ్రత్తగా వినియోగించండి!

**-నీటిని కాపాడుకోవడం ప్రతిఒక్కరి బాధ్యత... స్వచ్ఛమైన నీటిని భవిష్యత్తు తరాలకు అందించడం ప్రతిఒక్కరి కర్తవ్యం**

ప్రకృతి మనకు అందించిన అమూల్యమైన వరాల్లో నీరు అత్యంత ప్రధానమైనది. గాలి, నీరు, ఆహారం లేకుండా జీవజాతుల మనుగడ సాధ్యం కాదు. భూమిపై జీవం కొనసాగడానికి నీరు ప్రాణాధారం. మనిషి దైనందిన జీవితంలో తాగడానికి, వంట చేసుకోవడానికి, స్నానం చేయడానికి, శుభ్రత పాటించడానికి నీరు అవసరం. వ్యవసాయం, పరిశ్రమలు, పశుపోషణ, విద్యుత్ ఉత్పత్తి వంటి అనేక రంగాలు కూడా నీటిపైనే ఆధారపడి ఉన్నాయి. ఇంతటి ప్రాధాన్యం ఉన్న నీటిని నిర్లక్ష్యంగా వినియోగిస్తే భవిష్యత్తులో తీవ్రమైన నీటి కొరతను ఎదుర్కోవాల్సి వస్తుంది. అందుకే పర్యావరణంలో చోటుచేసుకుంటున్న మార్పులను అర్థం చేసుకొని నీటి సంరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలి. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా వాతావరణంలో అనేక మార్పులు చోటుచేసుకుంటున్నాయి. భూతాపం పెరగడం, అడవులు తగ్గిపోవడం, పట్టణీకరణ విస్తరించడం, ప్రకృతి వనరుల దుర్వినియోగం వంటి అంశాలు పర్యావరణ సమతుల్యతపై ప్రభావం చూపుతున్నాయి. ఫలితంగా కొన్ని ప్రాంతాల్లో అతివృష్టి, మరికొన్ని ప్రాంతాల్లో అనావృష్టి, ఇంకొన్ని ప్రాంతాల్లో అసాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. వర్షపాతం సమయానికి కురవకపోవడం, కురిసినా తక్కువ సమయంలో అధికంగా కురిసి వరదలకు దారితీయడం వంటి పరిస్థితులు వ్యవసాయంతో పాటు ప్రజల జీవన విధానాన్ని కూడా ప్రభావితం చేస్తున్నాయి. ఎల్నినో వంటి వాతావరణ దృగ్విషయాలు ప్రపంచంలోని అనేక ప్రాంతాల్లో వర్షపాతంపై ప్రభావం చూపగలవు. అయితే ప్రతి కరువు పరిస్థితికి ఎల్నినో ఒక్కటే కారణం కాదు. స్థానిక వాతావరణ పరిస్థితులు, వర్షపాతం పంపిణీ, భూగర్భజలాల అధిక వినియోగం, నీటి నిర్వహణలో లోపాలు కూడా నీటి కొరతకు కారణమవుతాయి. వర్షాలు అనుకూలంగా కురవనప్పుడు చెరువులు, కుంటలు, జలాశయాలు పూర్తిస్థాయిలో నిండవు. భూగర్భజలాల పునరుద్ధరణ తగ్గిపోతుంది. బోరు బావుల్లో నీటిమట్టం పడిపోతుంది. ఇలాంటి పరిస్థితులు కొనసాగితే తాగునీటిని పొందడం కూడా కష్టంగా మారుతుంది. నీటి కొరత అనేది కేవలం ఒక ప్రాంతానికి సంబంధించిన సమస్య కాదు. ఇది కుటుంబాల ఆర్థిక పరిస్థితి నుంచి దేశ ఆహార భద్రత వరకు ప్రభావం చూపగలదు. గ్రామాల్లో బావులు, బోర్లు ఎండిపోతే ప్రజలు దూర ప్రాంతాల నుంచి నీటిని తెచ్చుకోవాల్సి వస్తుంది. పట్టణాల్లో నీటి సరఫరా పరిమితమైతే ట్యాంకర్లపై ఆధారపడాల్సి వస్తుంది. దీంతో కుటుంబాలపై అదనపు ఆర్థిక భారం పడుతుంది. తగినంత నీరు అందుబాటులో లేకపోతే వ్యక్తిగత పరిశుభ్రత, పారిశుద్ధ్యం దెబ్బతింటాయి. పాఠశాలలు, ఆసుపత్రులు, ప్రజా సంస్థలు కూడా ఇబ్బందులను ఎదుర్కొంటాయి. ముఖ్యంగా పేద కుటుంబాలు, వృద్ధులు, చిన్నపిల్లలు, గ్రామీణ ప్రాంత ప్రజలు నీటి కొరత వల్ల ఎక్కువగా ప్రభావితమవుతారు. అందువల్ల నీటి సంరక్షణను వ్యక్తిగత అలవాటుగా మాత్రమే కాకుండా సామాజిక బాధ్యతగా గుర్తించాలి. వ్యవసాయ రంగంలో నీటి వినియోగం గణనీయంగా ఉంటుంది. వర్షాలు సరిగా కురవని సమయంలో అధిక నీరు అవసరమయ్యే పంటలను సాగు చేయడం రైతులకు ఆర్థికంగా నష్టాన్ని కలిగించవచ్చు. అందువల్ల రైతులు స్థానిక వర్షపాతం, నేల స్వభావం, నీటి లభ్యత, మార్కెట్ పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని పంటల ఎంపికలో తగిన మార్పులు చేసుకోవాలి. నీటి లభ్యత తక్కువగా ఉన్న ప్రాంతాల్లో స్థానిక పరిస్థితులకు అనుకూలమైన చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు, ఇతర తక్కువ నీటితో సాగు చేయగల పంటలను వ్యవసాయ నిపుణుల సూచనలతో పరిశీలించాలి. వరి వంటి అధిక నీటి అవసరం ఉన్న పంటలను సాగు చేసే ప్రాంతాల్లో సాధ్యమైన చోట నీటి పొదుపు పద్ధతులను అనుసరించాలి. బిందు సేద్యం, తుంపర సేద్యం వంటి ఆధునిక పద్ధతులను ప్రోత్సహించాలి. వర్షపు నీటిని పొలాల్లో నిల్వ చేయడం, వ్యవసాయ కుంటలు ఏర్పాటు చేయడం, నేలలో తేమను కాపాడే పద్ధతులను పాటించడం ద్వారా నీటి వినియోగాన్ని తగ్గించవచ్చు. రైతులకు వాతావరణ సమాచారం, పంటల సలహాలు, నీటి నిర్వహణపై అవగాహన కల్పించడంలో ప్రభుత్వ శాఖలు, వ్యవసాయ నిపుణులు, స్వచ్ఛంద సంస్థలు కీలక పాత్ర పోషించాలి. నీటి సంరక్షణ అనేది ప్రభుత్వాలు, రైతులు మాత్రమే చేయాల్సిన పని కాదు. ప్రతి ఇంట్లో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలి. పళ్లు తోముకునేటప్పుడు కుళాయిని నిరంతరం తెరిచి ఉంచకూడదు. స్నానం చేసేటప్పుడు అవసరానికి మించి నీటిని వృథా చేయకూడదు. నీటి కుళాయిలు, పైపుల్లో లీకేజీలు ఉంటే వెంటనే మరమ్మతులు చేయించాలి. కూరగాయలు, పండ్లు కడిగిన నీటిని సాధ్యమైన చోట మొక్కలకు ఉపయోగించ వచ్చు. బట్టలు ఉతికేటప్పుడు అవసరమైనంత నీటినే వినియోగించాలి. ఇంటి ప్రాంగణాన్ని శుభ్రం చేయడా నికి ప్రతిసారీ పైపులతో అధికంగా నీటిని పారబోయకుండా బకెట్ వంటి ప్రత్యామ్నాయాలను ఉపయో గించాలి. వాహనాలను తరచుగా పైపులతో కడగడం వల్ల అధిక నీరు వృథా అవుతుంది. పరిశ్రమలు ఉత్పత్తి ప్రక్రియల్లో నీటిని విస్తృతంగా ఉపయోగిస్తాయి. నీటి కొరత ఉన్న సమయంలో పరిశ్రమలు కూడా బాధ్యతాయుతమైన విధానాలను అనుసరించాలి. నీటి వినియోగాన్ని క్రమం తప్పకుండా పరిశీలించడం, లీకేజీలను అరికట్టడం, సాధ్యమైన చోట శుద్ధి చేసిన నీటిని తిరిగి వినియోగించడం, వర్షపు నీటి సేకరణ వ్యవస్థలను ఏర్పాటు చేయడం వంటి చర్యలు చేపట్టాలి.



-వై.సంజీవకుమార్,
ఫౌండర్ ప్రెసిడెంట్,
స్కై ఫౌండేషన్, 9393613555

---



#### ఎలనినో పాడుగాను

## పంటచేను బోరు బావి ఎండిపోయె

సాగునీరు సాగపాయె
వరిమడుల చుట్టూ రైతు
పదే పదే కలియతిరిగి
కనుగుడ్ల నీళ్లు తిరిగే
కాల్వపొంట నీరు రాక
దిగాలుగా పైరెమో రైతు మొఖం చూడవట్టే
గాసం లేక బండెడ్లు గోసరిల్లుతుంటే దుఃఖరి
ల్లుతు రైతు గొడ్డు గోదానమ్మేసి గుడ్డి దీప మోలే
రైతు దిగాలుతో దీనమా
యే ఎలనినోనీ ఎత్తుకు
పోను ఏమి కాల మొ
చ్చేరా రైతన్నల బతుకు
లు రందిపాలు చేసేరా



-శేఖర్ పగిళ్ల జర్నలిస్ట్

### ఒళ్లంతా స్వార్థమే !

చెట్టును నమ్మితే..
జీవితాంతం ఇస్తూనే ఉంటుంది
అణువణువూ త్యాగం చేస్తుంది
దానికి తీసుకోవడం తెలియదు !
మనిషిని నమ్మితే..
బతుకంతా లాక్కుంటూనే ఉంటాడు
వాడి ఒళ్లంతా స్వార్థ దుర్గంధాలే
ఇవ్వడం వాడి డిక్షనరీలో లేదు సుమా !

కుక్క ఒళ్లంతా విశ్వాస సుగంధమే
నరుడి దేహం అంతా నరక దుర్వాసనే
కుక్కకు తిండి పెడితే చాలు..
శునకం ప్రాణ త్యాగానికి సిద్ధపడుతుంది
మనిషికి ఎంత ఇచ్చినా సరిపోదు
నడవంత్రపు నరుడు వెన్నుపోటుకైనా సిద్ధమే
!

ఇవ్వడమే తెలుసు గోమాతకు..
గోవు బతుకు ఆసాంతం ఆదర్శం
పాలు, పేడ, మూత్రం అన్నీ అమూల్యమే
చనిపోయి కూడా తోలును ఇస్తుంది
మనిషికి ఈ సద్గుణాలు ఎక్కడివి
దూడకు కూడా గుక్కెడు పాలు వదలక..
అసురుల వారసుడినని రుజువు చేస్తున్నాడు !

-మధుపాళీ
9949700037

---

#### అణచివేతకు వ్యతిరేకంగా

## అగ్నిజ్వాలగా మారిన కొమురం భీం



**కొమురం భీం జయంతి - అక్టోబర్ 22:** తెలంగాణ చరిత్ర పుటల్లో శాశ్వతంగా వెలుగొందే ఒక గొప్ప త్యాగి పేరు - కొమురం భీం. ఆయన పేరు గిరిజనులలో గౌరవానికి, ధైర్యానికి, స్వాతంత్ర్య స్ఫూర్తికి ప్రతీక. భీం జీవితం ఒక మనిషి న్యాయం కోసం, స్వాభిమాన జీవితం కోసం, అణచివేతకు వ్యతిరేకంగా ఎంతటి అగ్నిజ్వాలగా మారగలడో చూపించిన సజీవ ఉదాహరణ. ఆయన ఆలోచ నలు, చర్యలు, త్యాగం -- ఇవన్నీ కలిపి తెలంగాణ ఆదివాసీ చరిత్రను సజీవంగా నిలిపిన ఆధ్యాత్మిక, సామాజిక, రాజకీయ చిహ్నాలు. 1901లో నేటి తెలంగాణ రాష్ట్రంలోని అసిఫాబాద్ జిల్లాలోని సంకేపల్లి గ్రామంలో గోండు తెగకు చెందిన కొమురం చీకా, సోంబాయ్ దంపతులకు జన్మించిన భీం బాల్యం నుంచే ప్రకృతితో మమేకమై పెరిగాడు. ఆ కొండలు, అడవులు, జలపాతాలు అతని స్నేహితులు; పచ్చదనం అతని ఊపిరి. కానీ ఆ పచ్చని అడవుల్లోని గిరిజనుల జీవితం మాత్రం నలుపు నీడలతో నిండింది. నిజాం పాలన కింద గిరిజనులు అనేక రకాల దోపిడీలకు గురయ్యారు. పటేల్లు, పట్వారీలు, దొరలు, పోలీసులు కలిసి వారి భూములు స్వాధీనం చేసుకొని, పన్నులు విధించి, బలవంతపు కూలిగా మార్చేశారు. "మన అడవులు మనవే" అన్న మాట చెప్పే స్వేచ్ఛ కూడా లేకుండా పోయింది. ఆ అణచివేత, ఆ అవమానం భీం మనసులో ఆగ్రహపు అగ్నిని రగిలించింది. భీం సాధారణ గిరిజనుడు కాదు; ఆలోచనలో విప్లవకారుడు. గిరిజనుల జీవితం ప్రకృతితో ముడిపడి ఉందని గుర్తించాడు ---. నీరు -- అడవి -- భూమి (జల్, జంగల్, జమీన్) ఇవి లేకపోతే గిరిజన జీవితం ఉండదని ఆయన చెప్పాడు. ఈ మూడు అంశాలే ఆయన ఉద్యమానికి మూల మంత్రం. "జల్ జంగల్ జమీన్ మన హక్కు, మన ప్రాణం" అని ఆయన ఉద్ఘాటించినప్పుడు ఆ నినాదం అడవుల గుండెల్లో ప్రతిధ్వనించింది. గిరిజనుల హక్కుల కోసం ఆయన ప్రారంభించిన పోరాటం కేవలం స్థానిక తిరుగుబాటు కాదు; అది భారతదేశంలో ఆదివాసీ స్వాభిమానం కోసం మొదటి వ్యవస్థీకృత ఉద్యమంగా నిలిచింది. 1920వ దశకంలో భీం బాంబాయ్, నాగపూర్ ప్రాంతాలకు వెళ్లి కార్మికుల జీవితాన్ని గమనించాడు. ఆ ప్రాంతాల్లో కొనసాగుతున్న కార్మిక ఉద్యమాలు, సామాజిక న్యాయపోరాటాలు ఆయనకు స్ఫూర్తినిచ్చాయి. తిరిగి తన ప్రాంతానికి చేరి, గిరిజన యువకులను సమీకరించి, వారికి శిక్షణ ఇచ్చి, ఆయుధాలను సేకరించి, నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా సాయుధ తిరుగుబాటుకు నాంది పలికాడు. ఆయన దళాలు అడవుల్లో దాగి, పన్నులు వసూలు చేసే అధికారులపై దాడులు చేశాయి. గిరిజన పల్లెల్లో ఆయన మాటలు ప్రజల మనసుల్లో మంటలు రేపాయి --- "మన బతుకు మనదే, మన భూమి మనదే, మన అడవులు మనవే."ఆ కాలంలో నిజాం రాజ్యంలోని పాలనా యంత్రాంగం గిరిజన ప్రాంతాలను సొంత ఆస్తులుగా మార్చుకొని, ప్రజలను బానిసలుగా ఉపయోగించేది. కొమురం భీం ఈ అన్యాయాన్ని నిలువరించేందుకు గిరిజనులలో అవగాహన పెంచాడు. భూస్వాములు, పోలీసు అధికారులు, పటేల్లు, పట్వారీలు గిరిజనులను బెదిరించినా భీం వెనుకడుగు వేయలేదు. ఆయన ధైర్యం, వాక్చాతుర్యం, నాయకత్వం వల్ల గిరిజన ప్రాంతం అంతా ఒక్కసారిగా చైతన్యంతో నిండిపోయింది. భీం నాయకత్వంలో గిరిజనులు మొదటిసారిగా తమ హక్కులను తెలుసుకున్నారు, వాటి కోసం పోరాడే శక్తిని సంపాదించారు. 1940లో అసిఫాబాద్ సమీపంలోని పాటగూడ గ్రామం ఆయన చివరి యుద్ధభూమిగా మారింది. నిజాం దళాలు ఆయన దళాన్ని చుట్టుముట్టాయి. భీం చివరి శ్వాస వరకు పోరాడి, గుండెల్లో బుల్లెట్లు తగిలినా తలవంచలేదు. ఆయన రక్తం భూమిని తడిపిన ఆ క్షణం గిరిజన చరిత్రలో అజరామరమైన ఘడియగా నిలిచింది. భీం వీరమరణం తర్వాత ఆయన పేరు గిరిజనుల గుండెల్లో ఒక జ్యోతిగా వెలిగింది. ఆ జ్యోతి ఎన్నటికీ ఆరిపోలేదు. కొమురం భీం స్ఫూర్తితోనే తర్వాత గూడెం పోరాటాలు, గిరిజన హక్కుల ఉద్యమాలు ఉద్భవించాయి. ఆయన చూపిన మార్గం తెలంగాణా ప్రజా ఉద్యమానికి పునాది వేసింది. ఆయన స్ఫూర్తి గిరిజన సమాజంలోనే కాదు, సర్వసాధారణ ప్రజల్లోనూ సమానత్వం, స్వాభిమానం, న్యాయం అనే విలువలను నాటింది. ఆయన చూపిన "జల్--జంగల్--జమీన్"సిద్ధాంతం నేటికీ పర్యావరణ పరిరక్షణ, భూహక్కుల రక్షణ ఉద్యమాలకు మార్గదర్శ కంగా ఉంది.

-రామ కిష్టయ్య సంగన భట్ల
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

---

# ప్రపంచ మీడియా కళ్లలో భారత్.. ఏం కనిపిస్తోంది?



ప్రజాస్వామ్య దేశ ప్రతిష్ఠను నిర్ణయించేది ప్రపంచ వేదికలపై వినిపించే ప్రశంసలు మాత్రమే కాదు.. విమర్శలు ఎదురైనప్పుడు ఆ దేశం స్పందించే తీరు కూడా! ఎన్నికల విశ్వసనీయత, పౌరుల నిరసన హక్కు, పోలీసుల చర్యలు, జర్నలిస్టుల భద్రత వంటి అంశాలు ఇప్పుడు భారత్ గురించి అంతర్జాతీయ మీడియా చర్చిస్తున్న ప్రధాన విషయాల్లో చోటు చేసుకుంటున్నాయి. ది గార్డియన్, అసోసియేటెడ్ ప్రెస్, రాయిటర్స్, అల్ జజీరా, యూరోన్యూస్ వంటి వార్తా సంస్థలు దేశంలో చోటుచేసుకుంటున్న పరిణామాలను తమ కథనాల్లో ప్రస్తావిస్తున్నాయి. ఈ పరిణామాలను పరిశీలించేటప్పుడు విదేశీ మీడియా రాసిన ప్రతి అంశాన్ని సంపూర్ణ సత్యంగా స్వీకరించడం ఎంత తప్పో, వాటిలో లేవనెత్తిన సందేహాలను కేవలం విదేశీ విమర్శలుగా కొట్టిపారేయడం కూడా అంతే సరికాదు. కథనాల వెనుక ఉన్న ఆధారాలు, సంబంధిత పక్షాల వాదనలు, అధికారిక వివరణలను పరిశీలించడం ద్వారానే వాస్తవాలకు దగ్గరవగలం. అంతర్జాతీయ మీడియా దృష్టిలో భారత్ ఎలా కనిపిస్తోందన్న దానికంటే, ఆ కథనాలు లేవనెత్తుతున్న అంశాలకు దేశంలోని ప్రజాస్వామ్య సంస్థలు ఎలా సమాధానమి స్తున్నాయన్నదే అసలు చర్చ.

**ప్రపంచ వార్తల్లో ఎన్నికల విశ్వసనీయత!**

ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు ఉండే విశ్వాసమే ప్రజాస్వామ్యానికి కీలక బలం. ఓటర్ల జాబితాల ప్రత్యేక సవరణ ప్రక్రియపై వివిధ రాజకీయ పక్షాలు, పౌర సంఘాలు వ్యక్తం చేస్తున్న అభ్యంతరాలు అంతర్జాతీయ మీడియా దృష్టిని ఆకర్షించాయి. ఓటర్ల జాబితాల్లో భారీ మార్పులు చోటుచేసుకున్నట్లు కొన్ని నివేదికలు ప్రస్తావించినప్పటికీ, తొలగింపుల సంఖ్య, వాటికి కారణాలు, సంబంధిత రాష్ట్రాలు లేదా ప్రాంతాలు, ప్రక్రియ జరిగిన కాల వ్యవధి వంటి వివరాలను అధికారిక గణాంకాలతో సరిపోల్చి చూడాలి. మరణించినవారు, చిరునామాలు మారినవారు, పునరావృత నమోదులు, అర్హత లేని నమోదులను తొలగించడం ఎన్నికల జాబితాల నిర్వహణలో భాగమే. అయితే, అర్హులైన పౌరుల పేర్లు పొరపాటున తొలగిపోకుండా చూడటం కూడా ఎన్నికల యంత్రాంగం బాధ్యత. ఎన్నికల సంఘం చేపట్టే ప్రక్షాళన ప్రక్రియ పారదర్శకంగా సాగుతోందా, అభ్యంతరాలు తెలిపేందుకు ప్రజలకు తగిన అవకాశం లభిస్తోందా, తప్పుగా తొలగించిన పేర్లను తిరిగి చేర్చేందుకు సమర్థవంతమైన వ్యవస్థ ఉందా అనే అంశాలు కీలకం. ఎన్నికల సంఘం వివరణలు, అధికారిక గణాంకాలు, సంబంధిత పక్షాల వాదనలను కలిపి పరిశీలించినప్పుడే ఈ వ్యవహారంపై సమగ్ర అవగాహన ఏర్పడుతుంది. ఓటర్ల జాబితా ప్రక్షాళన లక్ష్యం విశ్వసనీయతను పెంచడమే అయితే, ఆ ప్రక్రియపై ప్రజలకు నమ్మకం కల్పించడం కూడా దానిలో అంతర్భాగం కావాలి.

**నిరసనల సెగ.. పోలీస్ యాక్షన్‌పై అంతర్జాతీయ ఫోకస్?**

ప్రజాస్వామ్యంలో నిరసనలు ప్రజల అసంతృప్తిని వ్యక్తం చేసే రాజ్యాంగబద్ధ మార్గాల్లో ఒకటి. ఎన్నికల ప్రక్రియపై అభ్యంతరాలు వ్యక్తమైనప్పుడు నిరసనలు జరగడం, వాటిని నియంత్రించేందుకు పోలీసులు భద్రతా చర్యలు చేపట్టడం సహజంగానే ప్రజా చర్చకు దారితీస్తాయి. ఢిల్లీలో జరిగిన నిరసనలకు సంబంధించిన బారికేడ్లు, భద్రతా ఏర్పాట్లు, నిరసనకారులను అదుపులోకి తీసుకున్న ఘటనలు అంతర్జాతీయ మీడియా కథనాల్లో ప్రస్తావనకు వచ్చాయి. అసోసియేటెడ్ ప్రెస్ దృశ్య కథనాల ద్వారా నిరసనల పరిస్థితులను చూపించగా, ఇతర వార్తా సంస్థలు వాటి నేపథ్యం, రాజకీయ పక్షాల అభ్యంతరాలు, పోలీసుల చర్యలపై వ్యక్తమైన ఆరోపణలను వివరించాయి. అయితే, ఒక ఘటనకు సంబంధించిన దృశ్యాలు మాత్రమే మొత్తం పరిస్థితిని వివరించలేవు. నిరసనల స్వభావం, పోలీసుల చర్యలకు దారితీసిన పరిస్థితులు, నిరసనకారుల వాదనలు, అధికారిక వివరణలు, అందుబాటులో ఉన్న ఆధారాలు సమగ్రంగా పరిశీలించాలి. శాంతిభద్రతలను కాపాడటం పోలీసుల బాధ్యతే అయినప్పటికీ, ఆ బాధ్యత నిర్వహణలో పౌరుల హక్కులకు భంగం కలగకుండా చూడటం కూడా అంతే అవసరం. న్యాయస్థానాలు సంబంధిత అంశాలపై వివరణలు కోరినా, విచారణ చేపట్టినా వాటిని తుది తీర్పుగా భావించకూడదు. న్యాయపరిశీలనలో ఉన్న అంశాలపై తుది నిర్ధారణకు ముందు న్యాయస్థానాల ఉత్తర్వులు, అధికారిక సమాధానాలు, అందుబాటులో ఉన్న ఆధారాలను పరిగణనలోకి తీసుకోవాలి. ప్రజాస్వామ్య వ్యవస్థలో చట్ట అమలుకు ఎంత ప్రాధాన్యం ఉందో, పౌర హక్కుల పరిరక్షణకు కూడా అంతే ప్రాధాన్యం ఉంది.

**జర్నలిస్టుల నిర్బంధ ఆరోపణలు.. మీడియా స్వేచ్ఛపై ఆందోళన!**

ప్రజలకు సమాచారం అందించేందుకు క్షేత్రస్థాయిలో పనిచేసే జర్నలిస్టుల భద్రత ప్రజాస్వామ్య ఆరోగ్యాన్ని ప్రతిబింబించే అంశాల్లో ఒకటి. నిరసనలను కవర్ చేసే సమయంలో జర్నలిస్టులను అదుపులోకి తీసుకున్నారని, వారితో దురుసుగా వ్యవహరించారని, వారి ఫోన్లను స్వాధీనం చేసుకున్నారని వచ్చిన ఆరోపణలు మీడియా స్వేచ్ఛపై చర్చకు దారితీస్తాయి. ఈ అంశాలకు సంబంధించి రాయిటర్స్ ప్రచురించినట్లు పేర్కొన్న కథనంలోని తేదీ, వివరాలు, సంబంధిత వ్యక్తుల వాంగ్మూలాలు, అధికారుల స్పందనలను అసలు నివేదికతో సరిపోల్చి నిర్ధారించాలి. ఆరోపణలు తీవ్రమైనవే అయినప్పటికీ, వాటిని విచారణకు ముందే నిర్ధారిత వాస్తవాలుగా ప్రకటించడం సముచితం కాదు. అదే సమయంలో ఆరోపణలు వచ్చాయనే కారణంతో వాటిని విస్మరించడం కూడా బాధ్యతాయుతమైన వైఖరి కాదు. ఒకే వార్తా కథనాన్ని ఇతర సంస్థలు తిరిగి ప్రచురించినంత మాత్రాన వాటన్నింటినీ స్వతంత్రంగా నిర్ధారించిన నివేదికలుగా పరిగణించలేం. ప్రతి కథనంలో ఆధారాలు, ప్రత్యక్ష సాక్ష్యాలు, సంబంధిత పక్షాల స్పందనలు ఎంతవరకు ఉన్నాయో పరిశీలించాలి. జర్నలిస్టులు చట్టాలకు అతీతులు కారు. అయితే, చట్ట అమలు పేరుతో వారి వృత్తిపరమైన విధులకు అనవసరమైన ఆటంకాలు కలగకూడదు. వార్తలను సేకరించడం, అధికారిక వాదనలను పరిశీలించడం, ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన అంశాలను వెలుగులోకి తీసుకురావడం మీడియా బాధ్యత. ఆ బాధ్యతను స్వేచ్ఛగా, భద్రంగా నిర్వర్తించేందుకు అనుకూల వాతావరణం కల్పించడం ప్రభుత్వ యంత్రాంగం బాధ్యత. ఆరోపణలు ఎదురైన సందర్భాల్లో నిష్పక్షపాత విచారణ, ఆధారాల పరిశీలన, పారదర్శకమైన అధికారిక స్పందన ప్రజల్లో విశ్వాసాన్ని పెంచుతాయి.

**ప్రపంచం ఏమంటోంది కాదు.. భారత్ స్పందనే ముఖ్యం!**

అంతర్జాతీయ మీడియా భారత్ గురించి ఏం రాస్తోందన్నది పరిశీలించాల్సిన అంశమే. కానీ, ఒక దేశ ప్రతిష్ఠను కేవలం విదేశీ వార్తా సంస్థల కథనాల ఆధారంగా నిర్ణయించలేం. అదే సమయంలో అంతర్జాతీయ విమర్శలను జాతీయ గౌరవానికి వ్యతిరేకంగా భావించి పూర్తిగా తోసిపుచ్చడం వల్ల కూడా సమస్యలు పరిష్కారం కావు. వార్తా కథనాల్లోని ఆధారాలు, వాస్తవ నిర్ధారణ పద్ధతులు, సంబంధిత పక్షాల వాదనలు, అధికారిక స్పందనలకు ఇచ్చిన స్థానం ఆధారంగా వాటి విశ్వసనీయతను అంచనా వేయాలి. ఎన్నికల ప్రక్రియపై సందేహాలు వ్యక్తమైతే వాటికి గణాంకాలతో సమాధానం ఇవ్వాలి. నిరసనల సమయంలో హక్కుల ఉల్లంఘన జరిగిందనే ఆరోపణలు వస్తే వాటిని నిష్పక్షపాతంగా పరిశీలించాలి. జర్నలిస్టుల భద్రతపై ఆందోళనలు తలెత్తితే సంబంధిత అధికారులు స్పష్టత ఇవ్వాలి. ప్రజాస్వామ్య సంస్థల విశ్వసనీయతను కాపాడటం అంటే విమర్శలకు తలుపులు మూయడం కాదు.. వాస్తవాల ఆధారంగా సమాధానాలు ఇచ్చి, అవసరమైన చోట తప్పులను సరిదిద్దుకోవడం. అంతర్జాతీయ మీడియా కథనాలను విమర్శనాత్మకంగా పరిశీలించడం ఎంత అవసరమో, వాటిలో లేవనెత్తిన సమంజసమైన సందేహాలకు పారదర్శకంగా స్పందిం చడం కూడా అంతే ముఖ్యం. ప్రపంచ మీడియా భారత్ గురించి ఏమి రాస్తోందన్నది ఒక్కటే ముఖ్యం కాదు. ఆ కథనాలు లేవనెత్తిన సందేహాలకు దేశం ఎంత పారదర్శకంగా సమాధానమిస్తోంది, పౌరుల హక్కులను ఎంత నిబద్ధతతో కాపాడుతోంది, ప్రజాస్వా మ్య సంస్థలపై విశ్వాసాన్ని నిలబెట్టేందుకు ఎంత బాధ్యతాయుతంగా వ్యవహరిస్తోంది అన్నదే అంతర్జాతీయ వేదికపై భారత్ ప్రతిష్ఠ ను నిర్ణయించే కీలక అంశం. ప్రజాస్వామ్య బలం విమర్శలు వినిపించకపోవడంలో లేదు.. విమర్శలను ఆధారాలతో పరిశీలించి, వాస్తవాలతో సమాధానమిచ్చే సామర్థ్యంలో ఉంది.



-వ్యాసకర్త:
ఫిరోజ్ ఖాన్
సీనియర్ ఫ్రీలాన్స్ జర్నలిస్ట్,
9640466464

## విధినిర్వహణలో అమరులైన పోలీసుల త్యాగాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకం

### జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే



చందుర్తి మండలం లింగంపేట అమరవీరుల స్తూపం వద్ద పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం నిర్వహించి, నివాళులర్పించిన జిల్లా ఎస్పీ పోలీస్ అమరుల త్యాగాన్ని స్మరిస్తూ, వారి కుటుంబ సభ్యులను ఎస్పీ మహేష్ బి. గితే పరామర్శ రాజన్నసిరిసిల్ల శాంతి భద్రతల పరిరక్షణకై విధి నిర్వహణలో అమరులైన పోలీసుల త్యాగాలు అందరికీ స్ఫూర్తిదాయకమని జిల్లా ఎస్పీ మహేష్ బి గితే పేర్కొన్నారు. జిల్లాలోని చందుర్తి మండలం లింగంపేట గ్రామ శివారులో ఉన్న పోలీస్ అమరవీరుల స్తూపం వద్ద పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం (ఫ్లాగ్ డే) నిర్వహించి, అమరవీరుల కుటుంబ సభ్యులు, పోలీస్ అధికారులతో కలిసి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. అనంతరం సాయుధ పోలీసులు "శోక్ శ్రస్త్" నిర్వహించి, మరణించిన పోలీసు అమరవీరులకు పోలీసు అధికారులు, సిబ్బంది అమరవీరుల కుటుంబ సభ్యులు రెండు నిమిషాలు మౌనం పాటించి గత ఏడాది నుండి ఇప్పటి వరకు దేశంలో విధి నిర్వహణలో మరణించిన 154 మంది పోలీస్ అమరవీరుల పేర్లను చదివి వినిపించారు. ఈసందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ..... శాంతి భద్రతల పరిరక్షణకై సవాళ్లను ధీటుగా ఎదురించి, ప్రాణాలను సైతం త్యాగం చేసి, విధి నిర్వహణలో అమరులైన పోలీసుల త్యాగాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణకై ప్రాణత్యాగాలు చేసిన పోలీస్ అమరవీరులు ప్రజల గుండెల్లో చిరస్మరణీయంగా నిలిచిపోతారని పేర్కొన్నారు. జిల్లాలో అంతర్గత భద్రత పరిరక్షణ విధుల్లో 08 మందికి పైగా పోలీసులు అసువులు బాసారని, వారి త్యాగఫలం వల్లే గతం కంటే ప్రస్తుత పరిస్థితి మెరుగ్గా ఉందని, పోలీసుల త్యాగనిరతిని నిరంతరం మననం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అమరవీరుల త్యాగాలను స్మరించుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని, విధి నిర్వహణలో భాగంగా ఎన్నో జఠిలమైన సవాళ్లు ఎదురవుతున్నా అమరవీరులు అందించిన స్ఫూర్తితో ప్రజల భద్రత, రక్షణ చర్యల్లో భాగంగా శాంతి భద్రతల పరిరక్షణ కోసం ముందుకు సాగుతున్నామని అన్నారు. దేశ సరిహద్దుల్లోని ఆక్సాయ్ చిన్ ప్రాంతంలో పహారా కాస్తున్న సిఆర్పిఎఫ్ పోలీసులను 1959లో ఇదే రోజున చైనా దేశానికి చెందిన సైనికులు హతమార్చారని, అప్పటినుండి వారి త్యాగాలను స్మరిస్తూ అక్టోబర్ 21న పోలీసు అమరవీరుల దినం జరుపుకోవడం జరుగుతున్నదని పేర్కొన్నారు. ఈకార్యక్రమానికి హాజరైన అమరవీరుల కుటుంబాల సభ్యులతో మాట్లాడి వారి కుటుంబ పరిస్థితులు, వారి యొక్క సమస్యలను ఎస్పీ ఆరా తీశారు. వారు విన్నవించిన సమస్యలను సాధ్యమైనంత తొందరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చి అమరవీరుల కుటుంబాలకు జ్ఞాపికలను అందజేశారు. పోలీస్ అమరవీరులను స్మరిస్తూ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఈరోజు నుండి 31 తేదీ వరకు రక్తదాన శిబిరాలు, సైకిల్ ర్యాలీ, క్యాండిల్ ర్యాలీ, రన్, ఓపెన్ హౌస్, వ్యాసరచన పోటీలు, ఫోటో, వీడియో పోటీలు నిర్వహించడం జరుగుతుందని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అమరవీరుల కుటుంబ సభ్యులు, డిఎస్పీ లు నాగేంద్రచారి, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, సిఐ లు, ఆర్ఐ లు,ఎస్ఐ లు, ఆర్ఎస్ఐ లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## పోలీసు అమరుల త్యాగాలు వెలకట్టలేనివి

### సంస్మరణ దినోత్సవంలో కలెక్టర్



మెదక్ విధి నిర్వహణలో అసువులు బాసిన అమరులకు ఘన నివాళులు జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ శాంతి భద్రతల పరిరక్షణ కోసం అహర్నిశలు శ్రమిస్తూ అసువులు బాసిన పోలీసు అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివని, సమాజం ఎల్లవేళలా వారికి రుణపడి ఉంటుందని ×కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. బుధవారం అక్టోబర్ 21 పోలీసు అమరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా మెదక్ ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డివి శ్రీనివాసరావు, తో కలిసి ×కలెక్టర్ ప్రతిమా సింగ్ పాల్గొన్నారు. ముందుగా పోలీసు అమరవీరుల స్థూపం వద్ద పుష్పగుచ్చాలు సమర్పించి నివాళులర్పించారు. రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా... విధులను నిర్వహిస్తూ అమరులైన పోలీసులను స్మరించుకోవడం, వారి త్యాగాలను గుర్తించడం ప్రతి ఒక్కరి కనీస బాధ్యత అని కలెక్టర్ గుర్తు చేశారు. విరామం లేకుండా అనునిత్యం పోలీసులు శాంతి భద్రతల పరిరక్షణే కాకుండా జిల్లా లో జరిగే వివిధ అభివృద్ధి కార్యక్రమాలలో అలాగే.... అకాల వర్షం వచ్చినప్పుడు... ప్రకృతి విపత్తులు తలెత్తినప్పుడు తదితర సందర్భాల్లోప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీస్ అధికారులు భాగస్వామ్యం అవుతున్నారన్నారు ప్రతి రోజు ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ తమ ప్రాణాలను పణంగా పెట్టి ధైర్యంగా ముందుకు వెళ్లే పోలీస్ అధికారులు స్ఫూర్తిదయాకమన్నారు పోలీస్ అమరుల త్యాగాలను వృధా కానివ్వకుండా, వారి స్ఫూర్తితో మరింత బాధ్యతాయుతంగా శాంతి భద్రతల పరిరక్షణ ధ్యేయం గా విధుల్లో నిమగ్నం కావాలని పిలుపునిచ్చారు. జిల్లా లో శాంతిభద్రతలు నెలకొని ఉన్నప్పుడే అభివృద్ధి సాధ్యపడుతుందన్నారుప్రస్తుత సమాజంలో మారుతున్న నేర స్వరూపానికి అనుగుణంగా పోలీసులు సైతం ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటూ... అతి తక్కువ వ్యవధిలో ఎంతో చాకచక్యంగా సైబర్ నేరాలను ఛేదిస్తూ, నేరస్థులను పట్టుకుంటున్నారన్నారు అమరవీరుల కుటుంబాలకు గిఫ్ట్ ప్యాక్ లు కలెక్టర్ ,ఎస్పీఅందించారువ్యాచారచన పోటీలలో ప్రతిభ కనపరిచిన వారికి బహుమతులు ప్రధానం చేశారు ఈ కార్యక్రమం లో జిల్లా ఎస్పీడీవి శ్రీనివాసరావు అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ ,సిఐలు, ఎస్హెచ్ఓ, తదితరులు పాల్గొన్నారు

## దుద్యాల టీడీపీ కార్యకర్తల సమావేశం..

### భారీగా హాజరైన నాయకులు, కార్యకర్తలు

కొత్తపల్లి :: టీడీపీ ఎంపీటీసీలు ప్రాతకోట రమేష్ (దుద్యాల ఎంపీటీసీ 1), ఈరగాళ్ల రాజు (దుద్యాల ఎంపీటీసీ?2) ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి గ్రామానికి చెందిన సుమారు 200 మంది టీడీపీ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. టీడీపీ సీనియర్ నాయకులు జి. మహమ్మద్ రఫీ, మల్లారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని పలు అంశాలపై చర్చించారు. గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడం, కార్యకర్తల మధ్య సమన్వయాన్ని పెంపొందించడం, పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం వంటి అంశాలకు ప్రాధాన్యత ఇచ్చారు. ఈ సమావేశానికి పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు హాజరుకావడంతో దుద్యాలలో టీడీపీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది.

## కొనరావుపేట పోలీస్ స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ



రాజన్న సిరిసిల్ల జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు పోలీస్ స్టేషన్ల పనితీరును మరింత మెరుగుపరిచే దిశగా బుధవారం రోజున కొనరావుపేట పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేసుల పురోగతి, పెండింగ్ దర్యాప్తులు, స్టేషన్ రికార్డులు, సిబ్బంది హాజరు, రౌడీషీటర్లు మరియు నేరస్తులపై నిఘా అంశాలను సమీక్షించి, ప్రజలకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ...వివిధ సమస్యలతో పోలీస్ స్టేషన్ కి వచ్చే బాధితులకు సత్వర న్యాయం అందేలా బాధ్యతగా మెలగాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని, విధినిర్వహణలో అలసత్వం వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఆదేశించారు. పోలీస్ స్టేషన్లో వర్టికల్స్ వారీగా విధులు నిర్వర్తించే సిబ్బందిని ఒక్కొక్కరిగా వారి పనితీరు గురించి పరిశీలించారు. ఆధునిక సాంకేతిక వ్యవస్థపై అధికారులు సిబ్బంది అవగాహన కలిగి ఉండాలని, స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, ఆన్‌లైన్ మోసాలు, నకిలీ లింకులు, ఓటీపీ మోసాలు, డిజిటల్ అరెస్టుల వంటి సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పిస్తూ అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు విజిబుల్ పోలీసింగ్ లో భాగంగా ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలని, గ్రామీణ ప్రాంతాల్లో రాత్రి సమయాల్లో. పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని,డయల్ 112 కు కాల్ రాగానే పెట్రోలింగ్, బ్లూ కోల్ట్స్ సిబ్బంది తక్షణమే స్పందించి సంఘటనా స్థలానికి చేరుకొని బాధితులకు అండగా నిలవాలని సూచించారు. ఎస్పీ వెంట సిఐ రవికుమార్, ఎస్.ఐ రామ్మోహన్, సిబ్బంది ఉన్నారు.



## ఘనంగా జమ్మి పూజ

-కమాన్ పూర్ శ్రీ దుర్గా నవరాత్రి ఉత్సవాలు, విజయదశమి దసరా పండుగను పురస్కరించుకొని సింగరేణి ఆర్ జి-3 ఓసీ1 గనిలోని ఉద్యోగులందరూ బాగుండాలని, గనిలో ఎలాంటి ప్రమాదం జరగకుండా, అన్ని పనులు సక్రమంగా జరుగుతూ అధిక ఉత్పత్తి సాధించి, సింగరేణిలో అత్యున్నత పేరు సాధించాలని కోరుకుంటూ గని మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆనవాయితీ ప్రకారం గని మేనేజర్ రావుల పాపయ్య , ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన శమీ పూజ కార్యక్రమంలో ఐ ఎన్ టి య సి కేంద్ర కార్యదర్శి గడ్డం తిరుపతి - భాగ్యలక్ష్మి దంపతులు పాల్గొన్నారు. జమ్మి చెట్టుకు ప్రత్యేక పూజ నిర్వహించి, ఉద్యోగులతో కలిసి జమ్మి ఆకును పంచుకుంటూ ఒకరికొకరు దసరా శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా మైసమ్మ తల్లి కృపతో గనిలో పనిచేస్తున్న ఉద్యోగులందరూ సకల ఆయురారోగ్యాలతో ప్రమాదరహిత ఉత్పత్తిని సాధించి, గనికి మంచి పేరు రావాలని వేడుకున్నారు.

## తక్కల్ల పల్లి హై స్కూల్‌లో సరస్వతి విగ్రహం ఏర్పాటుకు భూమి పూజ



జగిత్యాల జిల్లా మల్యాల మండలంలోని తక్కలపల్లి గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థి, ప్రముఖ వ్యాపారి కటకం సత్యనారాయణ తను చదువుకున్న తకలపల్లి గ్రామంలోని ప్రభుత్వ జడ్పీ హైస్కూల్ లో శ్రీ సరస్వతి మాత విగ్రహం నెలకొల్పేందుకు గాను విజయదశమి సందర్భంగా భూమి పూజ నిర్వహించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తాను చదువుకున్న పాఠశాల అభివృద్ధికి తన వంతు చదువుల మాత శ్రీ సరస్వతి ఆలయం నిర్మాణ పనులను పూర్తిచేసి వచ్చే వసంత పంచమి రోజు ప్రారంభిస్తామని తెలిపారు, ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చీకట్ల లత , జెడ్ పి హై స్కూల్ హెడ్మాస్టర్, ప్రముఖ న్యాయవాది ముద్ గంటి జనార్ధన్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, సత్యం రెడ్డి, హనుమంత రెడ్డి , దండు అశోక్ , పాలకుర్తి లక్ష్మణ్, రంజిత్ పాల్గొన్నారు.

## పోలీసు అమరుల త్యాగాలు వెలకట్టలేనివి

జామాబాద్, అక్టోబర్ 21 :
శాంతి భద్రతల పరిరక్షణ కోసం అహరహం శ్రమిస్తూ అసువులు బాసిన పోలీసు అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివని, సమాజం ఎల్లవేళలా వారికి రుణపడి ఉంటుందని కలెక్టర్ ఇలా త్రిపాఠి, పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య అన్నారు. విధి నిర్వహణలో భాగంగా సంఘ విద్రోహ శక్తులతో పోరాడుతూ, అమరులైన పోలీసులను స్మరించుకోవడం, వారి కుటుంబాల త్యాగాలను గుర్తించడం ప్రతి ఒక్కరి కనీస బాధ్యత అని గుర్తు చేశారు. పోలీసు అమరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పోలీస్ కమిషనర్ సాయి చైతన్యతో కలిసి పోలీసు అమరవీరుల స్థూపం వద్ద పుష్పగుచ్చాలు సమర్పించి నివాళులర్పించారు. రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, శాంతి భద్రతల పరిరక్షణ విధుల్లో పోలీసులు అనునిత్యం నిమగ్నం అయి ఉంటారని అన్నారు. ఈ క్రమంలో ఎదురయ్యే అనేక సవాళ్లను తమ ప్రాణాలను పణంగా పెట్టి ధైర్యంగా ఎదుర్కొంటారని అన్నారు. ఈ నేపథ్యంలోనే గత సంవత్సరం నిజామాబాద్ జిల్లా కేంద్రంలో అసాంఘిక శక్తుల చేతిలో ప్రమోద్ కుమార్ అనే సీసీఎస్ కానిస్టేబుల్ వీర మరణం పొందారని ఆవేదన వ్యక్తం చేశారు. ముంబైలో తీవ్రవాదులు దాడి చేసిన సమయంలో వారిని ఎదుర్కొనేందుకు కానిస్టేబుల్ తుకారాం చూపిన ధైర్య సాహసాలు అనన్య సామాన్యమని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. పోలీసులు కేవలం శాంతి భద్రతల పరిరక్షణకే పరిమితం కాకుండా తప్పిపోయిన చిన్నారుల ఆచూకీ కనుగొని వారిని తల్లిదండ్రుల చెంతకు చేర్చడం, మహిళకు భద్రత కల్పించడం, అన్ని వర్గాల వారికి భరోసాగా నిలవడం వంటి విధులను సమర్థవంతంగా నిర్వహిస్తున్నారని కొనియాడారు. పోలీసు అమరుల కుటుంబాలకు ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం ఎల్లవేళలా అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఇందులో భాగంగానే కారుణ్య నియామకాల ప్రక్రియను వేగవంతం చేస్తామని అన్నారు. పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య మాట్లాడుతూ, ఈ ఏడాది దేశవ్యాప్తంగా 154 మంది పోలీసులు అమరులయ్యారని అన్నారు. నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలో 1986 నుండి




ఇప్పటివరకు 21 మంది పోలీసులు అసాంఘిక శక్తులతో పోరాడుతూ అసువులు బాశారని ఆవేదన వ్యక్తం చేశారు. శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయంగా తమ కర్తవ్య నిర్వహణలో ఎల్లవేళలా పోలీసులు ముందంజలో నిలుస్తున్నారని అన్నారు. అమరుల కుటుంబాలకు పోలీసు శాఖ ఎల్లవేళలా చేదోడువాదోడుగా ఉంటుందని భరోసా కల్పించారు. ఇప్పటికే 11 మందికి ఇంటి స్థలాలు కేటాయించడం జరిగిందని, మిగతా పది కుటుంబాలకు వారు కోరిన మేరకు కామారెడ్డి, మాక్లూర్, హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో స్థలాలు కేటాయించేలా రెవెన్యూ అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నామని తెలిపారు. అమరులైన పోలీసుల ప్రతి కుటుంబానికి స్థలం లభించే వరకు పట్టుదలతో పర్యవేక్షిస్తామని అన్నారు. అమరుల కుటుంబాలు తమ సాధకబాధకాలు తెలియజేసేందుకు వరుసలో వేచి ఉండాల్సిన అవసరం లేకుండా కమిషనరేట్ కార్యాలయంలో ప్రత్యేకంగా ఒక అధికారిని నియమిస్తామని తెలిపారు. అంతేకాకుండా స్టేషన్ హౌజ్ ఆఫీసర్లు అమరుల కుటుంబాలను స్వయంగా కలిసి వారి అవసరాలను గుర్తిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలో విధి నిర్వహణలో అమరులైన పోలీసుల కుటుంబీకులకు జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ శుభం నగ్రాలే, ఏ.సి.పి (ఎ.ఆర్) కృష్ణ, నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ , సిసిఎస్, ట్రాఫిక్, సి.టి.సి ఏసీపీలు, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్, సీఐలు, ఎస్.ఐలు , పోలీసు సిబ్బంది, అమరవీరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు

## పండుగ పూట గొడ్డుకారంతో భోజనం

నాగర్‌కర్నూల్ జిల్లా ఆధ్వర్యంలో ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె తొమ్మిదో రోజుకు చేరుకుంది. కరీ పండుగ రోజున కూడా ఉద్యోగులు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఆందోళన కొనసాగించారు. ఇందులో భాగంగా మౌనదీక్ష చేపట్టి, నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. మధ్యాహ్న భోజన సమయంలో గొడ్డుకారంతో భోజనం చేస్తూ తమ ఆవేదనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎన్‌హెచ్‌ఎం జేఏసీ నాగర్‌కర్నూల్ జిల్లా ప్రధాన కార్యదర్శి దామగట్ల కుమార్ మాట్లాడుతూ.. ప్రజలకు నిరంతరం వైద్య సేవలు అందిస్తున్న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం సానుకూల దృక్పథంతో పరిశీలించి పరిష్కరించాలని కోరారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులందరినీ ఎలాంటి షరతులు లేకుండా క్రమబద్ధీకరించాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు కుటుంబ సభ్యులతో కలిసి పండుగలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకుంటుండగా, ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు మాత్రం ఉద్యోగ భద్రత, భవిష్యత్తుపై ఆందోళనతో పండుగను నిరాశతో గడపాల్సి వస్తోందని దామగట్ల కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగుల కుటుంబాలు కూడా ఈ పరిస్థితుల వల్ల మానసిక ఆవేదనకు గురవుతున్నాయని పేర్కొన్నారు. పండుగ రోజున కూడా నిరసన కార్యక్రమాలు చేపట్టాల్సి రావడం ఉద్యోగుల సమస్యల తీవ్రతను తెలియజేస్తోందన్నారు. ప్రభుత్వం ఇకనైనా మౌనం వీడి ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు న్యాయం చేయాలని దామగట్ల కుమార్ విజ్ఞప్తి చేశారు. ఎన్నో ఏళ్లుగా ప్రజారోగ్య సేవల్లో భాగస్వాములవుతున్న ఉద్యోగుల సేవలను గుర్తించి, వారి కుటుంబాలకు భరోసా కల్పించాలని కోరారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులందరినీ ఎలాంటి షరతులు లేకుండా క్రమబద్ధీకరించి, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని స్పష్టం చేశారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి డిమాండ్లను పరిష్కరించే వరకు ప్రజా స్వామ్య బద్ధంగా పోరాటాన్ని కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్నవారు: ఎన్‌హెచ్‌ఎం జేఏసీ జిల్లా గౌరవ అధ్యక్షుడు శ్రీనివాసులు పాల్గొన్నారు.

## ఖిల్లా రామాలయానికి రోప్ వే మంజూరు



- తొందర్లో డీపీఆర్ సిద్ధం
- నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం
- అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ

**నిజామాబాద్ అక్టోబర్ 21**
ఎంతో ఘన చరిత్ర కలిగిన ఇందూరు ఖిల్లా రామాలయానికి రోప్ వే మంజూరైనట్లు అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... చత్రపతి శివాజీ గురువు సమర్థ రామదాసు నిర్మించిన చారిత్రాత్మక కట్టడం ఖిల్లా రామాలయం అన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో దాశరథి కృష్ణమాచార్యులు జైలు శిక్షణ అనుభవిస్తూ "తెలంగాణ నాకోటి రతనాల వీణ " అని రాసిన గొప్ప చరిత్ర కలిగిన ఖిల్లా రామాలయానికి రోప్ వే మంజూరు కావడం సంతోషకరమన్నారు. పర్యాటక స్థలంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. సుమారు రూ. 35 కోట్ల నిధులతో రోప్ వే నిర్మాణం కానుందని, ఇందుకోసం డీపీఆర్ సిద్ధం చేస్తున్నారని పేర్కొన్నారు. గతంలో పాలించిన పాలకులు రామాలయ అభివృద్ధిని మరిచారన్నారు. మోదీ ప్రభుత్వం చారిత్రక కట్టడాలపై ప్రత్యేక దృష్టి వహిస్తుందని తెలిపారు. ఇందులో భాగంగానే పర్వతమాల పథకానికి శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ తో కలిసి ఖిల్లా రామాలయ అభివృద్ధి కొరకు గతంలో కేంద్ర మంత్రుల దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. దీంతో రోప్ వే మంజూరైనట్లు స్పష్టం చేశారు. కేంద్రమంత్రి నితిన్ ఘట్కరితోపాటు రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి ఖిల్లా రామాలయ అభివృద్ధి పై అనేక సార్లు లేఖలు అందజేయడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల రోడ్లు భవనాల శాఖ అధికారులను, రోప్ వే కంపెనీ ప్రతినిధులను పంపడం సంతోషకరమన్నారు. అర్బన్ నియోజకవర్గ అభివృద్ధి తన లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో నిలిచిపోయిన పనులపై కూడా అనేకసార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు గుర్తు చేశారు. రాష్ట్రంలో డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఒక్కటి కూడా రాని నియోజకవర్గం ఇందూరు ఒకటేనని చెప్పారు. సమస్యను మంత్రి పొంగిలేటి దృష్టికి తీసుకెళ్లి మంజూరు చేయాలని కోరినట్లు పేర్కొన్నారు. దీంతో ఇటీవల అర్బన్ లోని సౌత్ మండల అర్హులకు ఇళ్లను కేటాయించాలని గుర్తు చేశారు. అలాగే స్థలం లేని వారికి హైదరాబాద్ మాదిరిగా టవర్లు నిర్మించి ఇవ్వాలని చెప్పినట్లు తెలిపారు. ప్రధానంగా స్పెషల్ ఫండ్ కోసం ప్రభుత్వానికి అనేకసార్లు లీగల్ రాసిన స్పందించడం లేదన్నారు. చివరికి పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లినా లాభం లేకుండా పోయిందన్నారు. స్పెషల్ ఫండ్ కేటాయిస్తే నియోజకవర్గ అభివృద్ధి సులువుగా అవుతుందని తెలిపారు. ఇందూరులో కాషాయ జెండా గెలుపును ఓర్చుకోలేక నిధులు విడుదల చేయడం లేదని విమర్శించారు. అవసరపు మాటలు మాట్లాడటమే తప్ప అభివృద్ధి కొరకు కాంగ్రెస్ ఆలోచించడం లేదన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నాగోల్ల లక్ష్మీనారాయణ, కార్పొరేటర్లు ఎర్రం సుధీర్, జగదీష్ కులకర్ణి, మఠం పవన్, రాము, విజయ మల్లేష్ యాదవ్, ప్రసూన శ్రీనివాస్ రెడ్డి, జ్యోతి మురళి, సుమిత్ర కిషోర్, బంటు ప్రీతి ప్రవీణ్, మహిళా మోర్చ అధ్యక్షురాలు వనిత, యువ మోర్చ అధ్యక్షుడు వంశీ, యువ మోర్చ రాష్ట్ర సహ కోశాధికారి విజయ్, ఎస్సీ మోర్చ పురుషోత్తం, వీరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## విషాదంలోనూ వెలుగుల దానం

- సాంబయ్య నేత్రాలతో ఇద్దరికి చూపు
- కుటుంబ సభ్యుల ఉదారతతో నేత్రదానం

### సదాశయ ఫౌండేషన్ చొరవతో

### హైదరాబాద్‌కు నేత్రాల తరలింపు



విషాదంలోనూ మానవత్వాన్ని చాటుతూ వైనాల సాంబయ్య కుటుంబ సభ్యులు ఆదర్శంగా నిలిచారు. పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండలం జూలపల్లి గ్రామానికి చెందిన వ్యవసాయమార్కెట్ కమిటీ ఛైర్మన్ వైనాల రాజు తండ్రి, రిటైర్డ్ సింగరేణి కార్మికుడు వైనాల సాంబయ్య (72) మృతి చెందగా.. ఆయన నేత్రాలను దానం చేసేందుకు కుటుంబ సభ్యులు ముందుకొచ్చారు. దీంతో చూపునకు దూరమైన మరో ఇద్దరి జీవితాల్లో వెలుగులు నింపే అవకాశం కలిగింది. బుధవారం సాంబయ్య మృతి చెందడంతో కుటుంబంలో విషాదం నెలకొంది. అయినప్పటికీ, సదాశయ ఫౌండేషన్ సూచన మేరకు ఆయన నేత్రాలను దానం చేసేందుకు కుటుంబ సభ్యులు అంగీకరించారు. మృతుని కొడుకులు, కోడళ్ళు వ్యవసాయమార్కెట్ కమిటీ ఛైర్మన్ వైనాల రాజు?అనిత, వైనాల వినోద్?సుమాంజలి, కూతురు, అల్లుడు జంగా లావణ్య ? సతీష్, మనుమలు రుద్ర మహంతి, హార్థిక్ జస్వంత్, మనుమరాండ్లు హారిక ప్రియదర్శిని, ఆత్రిక అంగీకారంతో నేత్రదానం ప్రక్రియ చేపట్టారు. వాసన్ ఐ బ్యాంక్ టెక్నీషియన్ మిల్కూరి చందు నేత్రాలను సేకరించి సకాలంలో హైదరాబాద్‌కు తరలించారు. పలువురి అభినందనలు ఈ కార్యక్రమంలో కమాన్‌పూర్ లయన్స్ క్లబ్ సభ్యులు సొప్పరి సంతోష్, జబ్బార్ ఖాన్, ఉపసర్పంచి చొప్పరి శేఖర్, గడ్డం మధునయ్య, బుస తిరుపతి, మద్దూరి ఓదెలు, మారవేణ ముత్యాలు, అనావేన సదయ్య, బండి శంకర్, ఇరుగు రాళ్ల కుమార్, దాసరి వెంకటస్వామి, గోనె కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు. విషాద సమయంలోనూ నేత్రదానానికి ముందుకొచ్చిన కుటుంబ సభ్యులను కమాన్‌పూర్ లయన్స్ క్లబ్ ఛైర్మన్ సాన రామకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి నల్లబెల్లి శంకర్, సదాశయ ఫౌండేషన్ అధ్యక్షుడు శ్రవణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, ప్రతినిధులు నూక రమేష్, లగిశెట్టి చంద్రమౌళి, అనంతరాములు, భీష్మాచారి, కే.ఎస్.వాసు, ప్రవీణ్, ధీటి వెంకటస్వామి, రాజమౌళి తదితరులు అభినందించారు. సాంబయ్య మృతిపట్ల ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## ఆస్ట్రేలియాలో ఘనంగా బతుకమ్మ వేడుకలు

### మల్లారెడ్డి విశ్వవిద్యాపీఠ్ వైస్ చైర్మన్ డా. సి. హెచ్. ప్రీతి రెడ్డి హాజరు

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ ఆస్ట్రేలియాలో ఘనంగా జరిగింది. నిర్వాహకుల సమాచారం ప్రకారం, ఈ వేడుకల్లో సుమారు 8,000 నుంచి 10,000 మంది పాల్గొన్నారు. మల్లారెడ్డి విశ్వవిద్యాపీఠ్ వైస్ చైర్మన్ డా. చి. ప్రీతి రెడ్డి ఈ వేడుకలకు హాజరుకావడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సాధారణంగా సుమారు 2,000 మంది పాల్గొనే ఈ వేడుకలకు ఈసారి భారీ సంఖ్యలో ప్రజలు హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు. విదేశీ గడ్డపై తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబిం బించేలా నిర్వహించిన ఈ వేడుకలు ఆస్ట్రేలియాలోని తెలంగాణ ప్రజలను ఒక్కచోట చేర్చాయి. బతుకమ్మ పండుగ విశిష్టతను, తెలంగాణ ప్రజల సాంస్కృతిక గుర్తింపును అంతర్జాతీయ వేదికపై చాటిచెప్పాయి .తెలంగాణ సంప్రదాయాలను భావితరాలకు అందించడంతో పాటు, విదేశాల్లో నివసిస్తున్న తెలంగాణ ప్రజల మధ్య సాంస్కృతిక అనుబంధాన్ని బలోపేతం చేయడంలో ఇలాంటి వేడుకలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల వైభవాన్ని ప్రపంచానికి పరిచయం చేస్తూ, బతుకమ్మ పండుగ అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణ ప్రజలను ఒక్కతాటి పైకి తీసుకొస్తోంది.



## భక్తిశ్రద్ధలతో ఘనంగా విజయదశమి వేడుకలు

**గుండాల,అక్టోబర్,21(వెలుతురు):**
విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని మంగళవారం మండల వ్యాప్తంగా గ్రామ సర్పంచ్లు , గ్రామ పెద్దల ఆధ్వర్యంలో విజయదశమి వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ముందుగా బొడ్రాయి వద్ద అ-ర్చకులు సంప్రదాయబద్ధంగా పూజా కార్యక్రమాలు చేపట్టి ఆలయంలో భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కుటుంబసభ్యులతో కలిసి ఆలయానికి చేరుకున్న భక్తులు స్వామివారి ఆశీస్సులు పొందారు. అనంతరం జమ్మి చెట్టు వద్ద పూజలు చేసి కులమతాలకు అ-తీతంగా పరస్పరం జమ్మి ఆకులు పంచుకుంటూ ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పండుగ సందర్భంగా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే విజయదశమి పండుగ ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, శాంతిసౌభాగ్యాలు నింపాలని భక్తులు ప్రార్థించారు. పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు.

## కనకదుర్గమ్మ శోభాయాత్రలో భక్తులకు పులిహోర పంపిణీ



**మునుగోడు, అక్టోబర్ 21 ( వెలుతురు):**
శ్రీ కనకదుర్గమ్మ నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా అమ్మవారి శోభాయాత్రలో భక్తులకు మునుగోడు మాజీ ఎంపీటీసీ-1 బొడ్డు శ్రావణి నాగరాజు గౌడ్ పులిహోర పంపిణీ చేశారు. మునుగోడు మండల కేంద్రంలోని చండూరు రోడ్డులో ఉన్న కనకదుర్గమ్మ, లక్ష్మీదేవిగూడెంలోని అమ్మవారి శోభాయాత్రలో భక్తులకు అన్నప్రసాదం అందజేశారు. ఈ సందర్భంగా బొడ్డు శ్రావణి నాగరాజు గౌడ్ మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా అమ్మవారి శోభాయాత్రలో పాల్గొన్న భక్తులకు పులిహోర పంపిణీ చేయడం సంతోషంగా ఉందన్నారు. అమ్మవారి కృపాకటాక్షాలతో ప్రజలందరికీ మేలు జరగాలని, ప్రతి ఒక్కరూ సుఖశాంతులతో జీవించాలని కోరుకున్నట్లు తెలిపారు.

# విద్యుత్ కోతలతో పంటలు ఎండిపోతున్నాయి

### మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి





**మునుగోడు, అక్టోబర్ 21 (వెలుతురు ):**
విద్యుత్ సరఫరాలో అంతరాయాలతో రైతుల పంటలు ఎండిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి విమర్శించారు. రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వమే వారి సమస్యల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. పెండింగ్‌లో ఉన్న సాగు, తాగునీటి ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. బుధవారం మునుగోడు మండలంలోని సింగారం, ఊకొండి, గంగోరిగూడెం గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఎండిపోయిన వరి పంటలను పరిశీలించారు. సాగునీటికి అవసరమైన విద్యుత్ సక్రమంగా అందక పంటలు దెబ్బతింటున్నాయని రైతులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. తాగునీటి సరఫరాకు సైతం విద్యుత్ సమస్య ఇబ్బందిగా మారిందని తెలిపారు. ఊకొండి గ్రామంలో ట్యాంకర్లతో తాగునీరు సరఫరా చేయాల్సిన పరిస్థితి నెలకొందని, ఇది ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని కూసుకుంట్ల అన్నారు. తక్షణమే ప్రైవేట్ బోర్లను లీజుకు తీసుకుని ప్రజలకు నీరు అందించాలని సూచించారు. బోర్లకు విద్యుత్ సరఫరా కోసం లైన్, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాట్లను పరిశీలించారు. విద్యుత్ శాఖ డీఈ విద్యాసాగర్‌తో ఫోన్‌లో మాట్లాడి ట్రాన్స్‌ఫార్మర్ షిఫ్టింగ్ పనులను వెంటనే పూర్తి చేసి నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకోవాలని కోరారు. అవసరమైతే పనుల ఖర్చును తానే భరిస్తానని హామీ ఇచ్చారు. మునుగోడు నియోజకవర్గంలో సాగు, తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని, లేనిపక్షంలో రైతులు, ప్రజలను సమీకరించి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని కూసుకుంట్ల హెచ్చరించారు. అంతకుముందు గంగోరిగూడెంలో దేవి నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఊకొండి గ్రామంలో తెలంగాణ ఉద్యమకారుడు మేడి చంద్రస్వామి తల్లి మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు మందుల సత్యం, సంయుక్త కార్యదర్శి మాదనబోయిన పరమేష్ యాదవ్, నాయకులు పోలగోని సైదులు గౌడ్,ఈద శరత్ బాబు,జంగిలి సాంబయ్య,దోటి కరుణాకర్, బండారు వెంకన్న,బోయ లింగస్వామి ,బోయపర్తి సురేందర్,సింగం సైదులు,జిల్లా సుఖేందర్, గుర్రాల సురేష్,బండారు శ్రీనివాస్,మేక నవీన్ రెడ్డి,మహేందర్ రెడ్డి, పందుల సురేష్,కట్ట రమేష్, కట్లకుంట మల్లేష్,చశీదపాక రామకృష్ణ, గంధం రవి, నేరటి నరసింహ, గురజాల శ్రవణ్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసు అమరవీరుల త్యాగం వెలకట్టలేనిది

- విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరులకు ఘన నివాళులు
- బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్





**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 21:**
సమాజంలో శాంతిభద్రతలను పరిరక్షిస్తూ, ప్రజల ప్రాణాలకు, ఆస్తులకు రక్షణ కల్పించే క్రమంలో విధి నిర్వహణలో తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడి అమరులైన పోలీసుల త్యాగం వెలకట్టలేనిదని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజల భద్రత కోసం నిరంతరం విధులు నిర్వహిస్తూ, ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటున్న పోలీసుల సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. విధి నిర్వహణలో ప్రాణాలను అర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలు సమాజానికి ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకమని అన్నారు. ప్రజలు ప్రశాంతమైన వాతావరణంలో జీవించేందుకు, సమాజంలో శాంతిభద్రతలు కొనసాగేందుకు పోలీసులు చేస్తున్న సేవలను ప్రతి ఒక్కరూ గుర్తించాలని కోరారు. పోలీసు అమరవీరుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలవాలని, వారి సంక్షేమానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దేశం కోసం, ప్రజల రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన పోలీసు అమరవీరుల సేవలను ఎన్నటికీ మరువలేమని, వారి త్యాగాలకు యావత్ సమాజం రుణపడి ఉంటుందని జాజుల లింగం గౌడ్ పేర్కొన్నారు

# 29వ డివిజన్‌లో ఘనంగా శమీపూజ, రామలీలా ఉత్సవాలు





**కరీంనగర్ వెలుతురు అక్టోబర్ 21:**
నగరంలోని 29వ డివిజన్ కిసాన్ నగర్‌లో కార్పొరేటర్ సోమ్మిడి వేణు ఆధ్వర్యంలో శమీపూజ, రామలీలా ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కరీంనగర్ నగరపాలక సంస్థ మేయర్ కొలగాని శ్రీనివాస్, కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం హాజరై శమీపూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ.. తొమ్మిది రోజులపాటు అమ్మవారి ఆశీస్సులు పొందిన ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఉత్సవాలను అద్భుతంగా నిర్వహించిన కార్పొరేటర్ సోమ్మిడి వేణును ప్రత్యేకంగా





అభినందించారు. అనంతరం శమీవృక్షానికి పూజలు నిర్వహించి, కొబ్బరికాయ కొట్టి జమ్మి పూజను ప్రారంభించారు. రాత్రి విద్యుత్ దీపాల వెలుగులు, టపాసుల మోతల మధ్య నిర్వహించిన రామలీలా కార్యక్రమం ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది. మహిళలు బతుకమ్మ పాటలు, కోలాట గీతాలకు నృత్యాలు చేస్తూ వేడుకలకు మరింత శోభను తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్‌కు చెందిన మహిళలు, వృద్ధులు, ఉద్యోగులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేశారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ కార్పొరేటర్ సోమ్మిడి వేణు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## హైకోర్టు న్యాయవాది ఎంఏ రహీంకు ఘన సన్మానం

- రెడ్‌క్రాస్ సొసైటీలో కీలక బాధ్యతలు..
- మీడియా మిత్రుల అభినందనలు





**గుండాల, అక్టోబర్ 21 (వెలుతురు):**
యాదాద్రి భువనగిరి జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ డైరెక్టర్‌గా, జిల్లా కోశాధికారిగా ఎన్నికైన ప్రముఖ హైకోర్టు న్యాయవాది ఎంఏ రహీంను గుండాల మండల కేంద్రంలో మీడియా మిత్రులు శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించి అభినందించారు. న్యాయవాదిగా ప్రజలకు సేవలందిస్తూ, సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్న రహీంకు కీలక బాధ్యతలు దక్కడం సంతోషకరమని జర్నలిస్టులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా రహీం మాట్లాడుతూ, తనను సన్మానించిన మీడియా మిత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా పేదలకు, ఆపదలో ఉన్నవారికి సేవలందించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు యండి ఖలీల్, మలిపెద్ది ప్రభాకర్ రెడ్డి, ఆవుల సురేందర్, సిరిపురం దశరథ, బొమ్మగాని రాజు గౌడ్, సూదగాని హరికృష్ణ గౌడ్, చిలుకూరి మోహన్, పులి నరసయ్య, పురుగుల చిన్న మల్లేష్, సోమనారాయణ, అంబాదాస్, స్వామి, యండి ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు.

## ఎత్తిపోతల పథకాల నుంచి నీరు విడుదల చేయాలి: మాజీ ఎమ్మెల్యే



నడిగూడెం: సాగర్ ఎడమ కాలువపై ఉన్న ఎత్తిపోతల పథకాల ద్వారా సాగునీటి విడుదలలో జాప్యం కారణంగా లిఫ్టుల పరిధిలో సాగవుతున్న పంటలు ఎండిపోతున్నాయని కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ విమర్శించారు. నడిగూడెం మండల పరిధిలోని సాగర్ ఎడమ కాలువపై ఉన్న ఎల్34, ఎల్35, ఎల్36 ఎత్తిపోతల పథకాల ద్వారా తక్షణమే నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు బీఆర్ఎస్ నాయకులు, రైతులతో కలిసి బుధవారం మండల కేంద్రంలోని నీటిపారుదల శాఖ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లయ్య యాదవ్ మాట్లాడుతూ.. ఎత్తిపోతల పథకాల పరిధిలో సాగు చేస్తున్న పంటలకు నీరందక ఎండిపోయే పరిస్థితి నెలకొందన్నారు. అప్పులు చేసి పంటలు సాగు చేసిన రైతులకు సకాలంలో సాగునీరు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నప్పటికీ పట్టించుకోవడంలేదని ఆరోపించారు. మండలంలోని ఆయకట్టు రైతులు నీటి కోసం ఎదురుచూస్తుంటే, నీటిని పాలేరు ప్రాంతానికి తరలిస్తున్నారని విమర్శించారు. స్థానిక రైతుల అవసరాలను పట్టించుకోకుండా నీటిని తరలించడం అన్యాయమన్నారు. అధికారులు తక్షణమే స్పందించి ఎత్తిపోతల పథకాల ద్వారా నీటిని విడుదల చేసి, చెరువులు నింపి పంటలను కాపాడాలని కోరారు. అనంతరం నీటిపారుదల శాఖ డీఈకి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నల్గొండ--ఖమ్మం--వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డి, పార్టీ మండల సమన్వయ కమిటీ సభ్యుడు అనంతుల ఆంజనేయులు, నాయకులు ఉపేందర్, మేకల వీరబాబు , సంపతి వీరబాబు, వెంకటేశ్వర్లు, జోగయ్య, జలీల్, రఫీ తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం: జిల్లా కలెక్టర్, ఎస్పీ



అక్టోబర్ 21 పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నల్లగొండ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. దేశ రక్షణ కోసం, ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణ కోసం విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరులకు జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ ఐఏఎస్, జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్‌తో పాటు అమరవీరుల కుటుంబ సభ్యులు, అధికారులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ ఐఏఎస్ మాట్లాడుతూ, ప్రజలు ప్రశాంతంగా జీవించేందుకు పోలీస్ శాఖ అందిస్తున్న సేవలు ఎంతో కీలకమని, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు అనేక సవాళ్లను ఎదుర్కొంటూ నిరంతరం విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు.
విధి నిర్వహణలో ప్రాణాలను త్యాగం చేసిన పోలీస్ అమరవీరుల ధైర్యం, కర్తవ్యనిష్ఠ, అంకితభావం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని పేర్కొన్నారు. నేరాల నియంత్రణ, మహిళలు, బాలల భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణ, సైబర్ నేరాలపై అవగాహన, మాదకద్రవ్యాల నిర్మూలనకు పోలీసులు చేస్తున్న కృషి అభినందనీయమని తెలిపారు. అమరవీరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని యువత దేశభక్తి, క్రమశిక్షణ, సేవాభావాన్ని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్ మాట్లాడుతూ, పోలీస్ విధి కేవలం ఉద్యోగం మాత్రమే కాదని, ప్రజల పట్ల బాధ్యత, దేశం పట్ల నిబద్ధతతో కూడిన పవిత్రమైన కర్తవ్యమని అన్నారు. 1959 అక్టోబర్ 21న లడఖ్‌లోని హాట్ స్ప్రింగ్స్ ప్రాంతంలో చైనా సైనికుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన పది మంది సీఆర్‌పీఎఫ్ సిబ్బంది వీరమరణానికి గుర్తుగా ప్రతి సంవత్సరం పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. నల్లగొండ జిల్లాలో విధి నిర్వహణలో ఇప్పటివరకు 15 మంది పోలీస్ అధికారులు, సిబ్బంది అమరులయ్యారని, దేశవ్యాప్తంగా ఈ ఏడాది 154 మంది పోలీస్ అధికారులు, సిబ్బంది విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేశారని ఎస్పీ తెలిపారు.
ప్రజల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణ కోసం అమరులైన పోలీసుల త్యాగాలు ఎప్పటికీ మరచిపోలేనివని, వారి సేవా స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా దేశం కోసం ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరులందరికీ ఘనంగా నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులకు గౌరవాభివందనాలు తెలియజేశారు. అమరవీరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రజల భద్రత, సమాజ శ్రేయస్సు కోసం ప్రతి ఒక్కరూ నిబద్ధతతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రమేష్, డీఎస్పీ కె. శివరాం రెడ్డి, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాస్, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, పోలీస్ అధికారులు, సిబ్బంది, పోలీస్ అమరవీరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



## శాంతి, సామరస్యాలతో ముందుకు సాగుదాం: శాసనసభ్యులు కూనంనేని

చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక విజయదశమి అని కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని కొత్తగూడెం పట్టణ పరిధిలోని రైటర్ బస్తీతో పాటు రామవరంలోని అంబేద్కర్ చమన్ వద్ద సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక జమ్మి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం సంప్రదాయబద్ధంగా రావణాసురుడి దిష్టిబొమ్మ దహన (రావణ వధ) ఘట్టాన్ని లాంఛనంగా ప్రారంభించారు. బాణసంచా వెలుగుల నడుమ రావణ వధను వీక్షించేందుకు భారీగా తరలివచ్చిన అశేష జనవాహినిని ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. సమాజంలో నెలకొన్న అసమానతలు, అన్యాయాలు, చెడు ఆలోచనలను అంతమొందించి ధర్మమార్గాన్ని అనుసరించడమే దసరా పండుగ ఇచ్చే అసలైన సందేశమని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమం, ప్రాంతీయ అభివృద్ధి ధ్యేయంగా ప్రజలంతా కలసికట్టుగా ముందుకు సాగాలని ఆయన ఆకాంక్షించారు. నియోజకవర్గ ప్రజలకు, కార్మికులకు దసరా శుభాకాంక్షలు తెలుపుతూ శాంతియుత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్, సింగరేణి గుర్తింపు సంఘం నాయకులు వంగ వెంకట్, రమణమూర్తి, జె గట్టయ్య, కంచర్ల జమలయ్య, మునిగడప వెంకటేశ్వర్లు, మునిగడప పద్మ, ధర్మ రాజు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సంతోషమే లక్ష్యంగా దసరా వేడుకలు



కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో షబ్బీర్ అలీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావాన్ని రైతులు, వ్యాపారులు, ప్రజలందరూ అధిగమించి సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. దసరా పండుగను కుటుంబ సమేతంగా మీతో జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. 1990లో మర్రి చెన్నారెడ్డి ప్రభుత్వంలో తాను మంత్రిగా ఉన్నప్పుడు పి.టి. ఠాగూర్ ఆధ్వర్యంలో ఈ వేడుకలను ప్రారంభించానని, అప్పటి నుంచి ప్రతి ఏటా పాల్గొంటున్నానని తెలిపారు. ఠాగూర్ లేకపోయినా ఆయన కుమారుడు పి.టి. రాజ్ కుమార్ కొనసాగిస్తున్నారని, కరోనా కారణంగా ఐదేళ్లు నిర్వహించలేకపోయామని చెప్పారు. కామారెడ్డి ప్రజలకు సంతోషకరమైన పండుగను జరుపుకోవాలనే ఉద్దేశం తప్ప రాజకీయాలు లేవని, ఓట్లు లేవని, ఇప్పుడు ఏమీ లేవని, కేవలం ప్రజల ఆశీర్వాదం, సంతోషం కోసమే ఈ రాజకీయాలకు దూరంగా, రాజకీయాలకు అతీతంగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రాకర్స్, లేజర్ షో, డీజే, రావణ దహనంతో వేడుకలను నిర్వహించామన్నారు.
కామారెడ్డికి రెండేళ్ల క్రితం 3 ఎంఎల్‌డీ గోదావరి నీరు వస్తే, ఇప్పుడు 12 ఎంఎల్‌డీ సరఫరా అవుతోందని, వచ్చే ఏడాది గోదావరి పుష్కరాలకు ప్రజలు దూరం వెళ్లకుండా గోదావరినే ఇంటికి తీసుకొచ్చానని అన్నారు. ఇందిరాగాంధీ స్టేడియంలో తెలంగాణలో ఎక్కడా లేని విధంగా డే-నైట్ లైట్లను వచ్చే నెలలో ప్రారంభిస్తామని, ఇక్కడ వందలాది మంది విద్యార్థులు ఆర్మీ, పోలీసు ఉద్యోగాలకు శారీరక శిక్షణ పొందుతున్నారని తెలిపారు. పక్కనే రూ. 8 కోట్లతో ఇండోర్ స్టేడియం నిర్మాణం జరుగుతోందన్నారు. విద్యార్థులు మొబైల్, మత్తు పదార్థాలకు అలవాటు పడకుండా తల్లిదండ్రులు క్రీడల్లో ప్రోత్సహించాలని సూచించారు.
అనంతరం లేజర్ షో, బాణసంచా ప్రదర్శన, రావణ దహనాన్ని వీక్షించారు. ఏర్పాట్లకు కృషి చేసిన అధికారులకు, హాజరైన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్, అదనపు కలెక్టర్ గిరి, డీఎస్పీ మధుసూదన్ రెడ్డి, కౌన్సిలర్లు, వివిధ శాఖల అధికారులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## 'నేషనల్ హెల్త్ మిషన్ సిబ్బంది సమస్యలను పరిష్కరిస్తాం': ఎమ్మెల్యే



నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ఆరోగ్య విభాగంలో సేవలందిస్తున్న వైద్యులు, వివిధ కేడర్ల సిబ్బందికి వేతన సవరణ (పిఆర్సి) అమలు చేయడంతోపాటు, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ బుధవారం ఎమ్మెల్యే సంజయ్ కుమార్ కు వారి కార్యాలయంలో ఎన్హెచ్ఎం ఉద్యోగులు మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. . గతంలో యుపిఎ ప్రభుత్వ హయాంలో అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ దేశ ప్రజలందరికీ మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతో ఎన్‌హెచ్‌ఎం విధానాన్ని ప్రారంభించారని గుర్తుచేశారు. జగిత్యాల జిల్లా ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో సిబ్బంది తమ సహకారాన్ని కొనసాగించాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉద్యోగులందరికీ ప్రతి నెలా 1, 2 తేదీల్లోనే వేతనాలు చెల్లిస్తున్నామని ఆయన తెలిపారు. రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ, ఎన్‌హెచ్‌ఎం సిబ్బంది డిమాండ్లను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరియు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి తగిన కృషి చేస్తానని హామీ ఇచ్చారు.



ఫ్లెక్సీలు చింపినంత మాత్రాన నాయకత్వాన్ని ఆపలేరు... ఫోటోలు తొలగించినంత మాత్రాన ప్రజల్లో ఉన్న గుర్తింపును చెరపలేరు!
ఎవరు చేశారో తెలియదు... తెలుసుకోవాలనే ప్రయత్నం చేస్తాను. కానీ ఎవరి మీదా ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయను.
నా రాజకీయ ప్రయాణం ఫ్లెక్సీల మీద ఆధారపడలేదు... ప్రజల అభిమానం, నమ్మకం, ఆశీర్వాదాల మీద ఆధారపడి ఉంది.
నా సమాధానం మాటల్లో కాదు... నా పనిలో ఉంటుంది!

**ఆకుబత్తిని విజయ్ కుమార్**
**ఉపసర్పంచ్, కేశవపట్నం**



## చెడుపై మంచి సాధించిన విజయమే విజయదశమి: ఎమ్మెల్యే

చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా నిలిచేది విజయదశమి అని మానకొండూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. దసరా వేడుకలను పురస్కరించుకొని తిమ్మాపూర్ మండలం ఎల్ఎండి కాలనీలోని రాంలీలా మైదానంలో రాంలీలా కమిటీ చైర్మన్ కుంట రాజేందర్ రెడ్డి, స్థానిక సర్పంచ్ పొన్నాల సంపత్ ఆధ్వర్యంలో నిర్వహించిన రావణ దహన కార్యక్రమానికి టీఎన్జిఓల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ తో కలిసి హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలు సుఖ సంతోషాలతో ఉండేందుకు ప్రజా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి కవ్వంపల్లి అనురాధ, మాజీ వైస్ ఎంపీపీ పొన్నాల భూలక్ష్మి, ఉప సర్పంచ్ కేతిరెడ్డి ఎల్లారెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు, రాంలీలా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# విజయదశమి వేడుకల్లో అలయ్-బలయ్ సందడి!

- ఆత్మీయంగా కలుసుకున్న కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు
- సెట్విన్ చైర్మన్ ఎన్. గిరిధర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు డా. సిద్ధం ఉజ్వల్‌రెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు



**జహీరాబాద్ వెలుతురు అక్టోబరు 21:**
విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని జహీరాబాద్ పట్టణంలోని ఆదర్శనగర్ కాలనీలో బుధవారం అలయ్--బలయ్ కార్యక్రమాన్ని ఘనంగా, ఆత్మీయ వాతావరణంలో నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ ఎన్. గిరిధర్‌రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డా. సిద్ధం ఉజ్వల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉజ్వల్‌రెడ్డి నివాసంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జహీరాబాద్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నాయకులు ఒకరినొకరు ఆత్మీయంగా ఆలింగనం చేసుకుంటూ విజయదశమి శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. సంప్రదాయబద్ధంగా నిర్వహించిన అలయ్--బలయ్ కార్యక్రమం పార్టీ శ్రేణుల మధ్య స్నేహభావాన్ని, ఐక్యతను చాటిచెప్పింది. పండుగ నేపథ్యంలో నాయకులు, కార్యకర్తలు పరస్పరం కలుసుకుని తమ ఆనందాన్ని పంచుకున్నారు. రాజకీయాలకు అతీతంగా ఆత్మీయ పలకరింపులతో పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమం కాంగ్రెస్ శ్రేణుల కలయికకు, పరస్పర స్నేహసంబంధాల బలోపేతానికి వేదికగా నిలిచింది. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్, సీడీసీ చైర్మన్, జహీరాబాద్, కోహీర్ మున్సిపల్ చైర్మన్లు, నియోజకవర్గంలోని వివిధ మండలాలు, పట్టణాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, సర్పంచులు, కౌన్సిలర్లు, సీనియర్ నాయకులు, మాజీ ఎంపీపీలు, మాజీ జెడ్పీటీసీలు, మాజీ సొసైటీ చైర్మన్లు, మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# యాసిడ్ తాగి యువకుడు మృతి

**నర్సాపూర్‌లో ఘటన.. కేసు నమోదు చేసి దర్యాప్తు**

**నర్సాపూర్, వెలుతురు అక్టోబర్ 21:**
మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన ఉప్పలపు సాయికిరణ్ (26) యాసిడ్ తాగి మృతి చెందిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. దసరా పండుగ సందర్భంగా మంగళవారం జమ్మి కార్యక్రమానికి వెళ్లి తిరిగి వచ్చిన సాయికిరణ్ తలకు గాయంతో ఇంటికి చేరుకున్నాడు. గ్రామంలోని కల్లు దుకాణం వద్ద బోయిన మహేష్‌తో జరిగిన గొడవలో తన తలకు గాయమైందని కుటుంబ సభ్యులకు తెలిపాడు. దీంతో కుటుంబ సభ్యులు అతడిని నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, వైద్యులు చికిత్స చేసి నాలుగు కుట్లు వేశారు. బుధవారం గొడవ విషయమై గ్రామ పెద్దలతో మాట్లాడేందుకు సాయికిరణ్ వెళ్లాడు.



అయితే మరుసటి రోజు మాట్లాడుకుందామని గ్రామ పెద్దలు చెప్పినట్లు కుటుంబ సభ్యులకు తెలిపాడు. అనంతరం గ్రామ పెద్దలు మాట్లాడేందుకు రాకపోవడంతో మనస్తాపానికి గురైన సాయికిరణ్.. బుధవారం ఉదయం సుమారు 11.30 గంటల సమయంలో బాత్రూంలో యాసిడ్ తాగినట్లు తన తల్లికి చెప్పాడు. వెంటనే కుటుంబ సభ్యులు గ్రామంలోని ఆర్ఎంపీ వైద్యుడిని పిలిపించారు. అయితే వైద్యుడు వచ్చే సమయానికి సాయికిరణ్ మధ్యాహ్నం సుమారు 12.30 గంటలకు మృతి చెందాడు. మృతుడి తల్లి ఉప్పలపు బాలమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నర్సాపూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఏ. రంజిత్ కుమార్ తెలిపారు.

# తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలి

**ఎమ్మెల్యే మాణిక్‌రావుకు యువ నాయకుడు సునంద్ జోసెఫ్ వినతి**



**జహీరాబాద్ వెలుతురు అక్టోబర్ 21:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంతో పాటు కొత్తూర్ (బి) గ్రామంలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని తెలంగాణ యువ నాయకుడు, ఉస్మానియా యూనివర్సిటీ యువ నాయకుడు సునంద్ జోసెఫ్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావును కోరారు. ఈ మేరకు జహీరాబాద్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో మాణిక్‌రావును కలిసి ఆయా ప్రాంతాల్లో నెలకొన్న తాగునీటి సమస్యలపై చర్చించి వినతిపత్రం అందజేశారు. రానున్న వేసవిలో ఎండల తీవ్రత పెరిగి నీటి కొరత, కరువు పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని సునంద్ జోసెఫ్ కోరారు. ప్రజలకు తాగునీటి కోసం ఇబ్బందులు కలగకుండా అవసరమైన ముందస్తు ప్రణాళికలు రూపొందించి, నీటి సరఫరా సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా జహీరాబాద్ పట్టణంతో పాటు కొత్తూర్ (బి) గ్రామ ప్రజల తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కొత్తూర్ (బి) మాజీ సర్పంచ్ శంకరప్ప అల్లుడైన సునంద్ జోసెఫ్ చేసిన విజ్ఞప్తిపై ఎమ్మెల్యే మాణిక్‌రావు సానుకూలంగా స్పందించారు. రానున్న వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలపై దృష్టి సారించాలన్న విజ్ఞప్తితో ప్రజల్లో ఆశాభావం వ్యక్తమవుతోంది.

# దసరా వేడుకల్లో ఎమ్మెల్యే మాణిక్‌రావు అలయ్ బలయ్

**బీఆర్ఎస్ నాయకులు, ప్రజలతో ఆత్మీయ సమ్మేళనం**



**జహీరాబాద్ వెలుతురుఅక్టోబర్ 21:**
దసరా పండుగను పురస్కరించుకుని జహీరాబాద్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో అలయ్ బలయ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు, కౌన్సిలర్లు, వివిధ గ్రామాల సర్పంచులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, గ్రామ కమిటీ అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు పరస్పరం ఆత్మీయంగా పలకరించుకుంటూ దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

**సోదరభావం, ఐక్యతకు ప్రతీక అలయ్ బలయ్**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాణిక్‌రావు మాట్లాడుతూ.. దసరా పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని అన్నారు. అలయ్ బలయ్ కార్యక్రమం ప్రజల మధ్య సోదరభావం, ఐక్యత, ఆత్మీయతను పెంపొందిస్తుందని పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ కలిసి మెలిసి ఉండాలని, పండుగలు ప్రజల మధ్య ప్రేమాభిమానాలను మరింత బలోపేతం చేస్తాయని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలతో నిరంతరం మమేకమవుతూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రజలతో సత్సంబంధాలను కొనసాగిస్తూ, వారి అవసరాలను గుర్తించి సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని సూచించారు. జహీరాబాద్ నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ ఎమ్మెల్యే మాణిక్‌రావు దసరా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమం పండుగ వాతావరణంలో నాయకులు, కార్యకర్తలు, ప్రజల ఆత్మీయ కలయికకు వేదికగా నిలిచింది.

# కౌడిపలిలో ఘనంగా దసరా ఉత్సవాలు

**పాలపిట్టను చూసి, జంబి కొట్టి, లంకా దహనం చేసిన సర్పంచ్ చంద్రం కృష్ణ గౌడ్**

**కౌడిపల్లి వెలుతురు అక్టోబర్ 21:**
కౌడిపల్లి మండల కేంద్రంలో ఈరోజు సర్పంచ్ చంద్రం కృష్ణ గౌడ్ ఆధ్వర్యంలో దసరా ఉత్సవాలు







ఘనంగా జరిగాయి. గ్రామంలోని పిల్లలు, పెద్దలు, మహిళలు ఉదయం నుండే నూతన వస్త్రాలు ధరించి పాలపిట్టను చూసి హనుమాన్ ఆలయంలో, రామాలయంలో దర్శనము చేసుకొని, గ్రామానికి తూర్పు దిశగా ఏర్పాటు చేసిన జంబీ వృక్షాన్ని కొట్టడానికి గ్రామ సర్పంచ్ తో పాటు గ్రామ ప్రజలు వెళ్లి జంబి కొట్టడం జరిగింది. తర్వాత సర్పంచ్ ఏర్పాటు చేసిన రామాయణ లఘు నాటకాన్ని ప్రదర్శించారు. గ్రామ ప్రజలందరూ నాటకాన్ని తిలకించి ముగ్దులయ్యారు. నాటకంలో భాగంగా ఆంజనేయ నాటక దారి అక్కడ ఏర్పాటు చేసిన రావణాసురుని విగ్రహాన్ని దహనం చేశారు. తదనంతరం ఇక్కడ ఏర్పాటుచేసిన డీజే చెప్పులతో మహిళలందరూ కూడా బతుకమ్మ ఆడుతూ సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్వేతా మల్లికార్జున్ గౌడ్, వార్డు సభ్యులు రెడ్డి మాధవి మహేష్, గౌడ చర్ల ప్రశాంత్, మురళి, లక్ష్మి శరత్, రాజిరెడ్డి, దేవేందర్, హరీష్, మక్బూల్, సందీప్ కుమార్, బొంతమ్మ సంగప్ప, రమేష్, నాయకులు పుండరీకంగౌడ్, దుర్గాగౌడ్, భూమయ్య పటేల్, పోల నవీన్ కుమార్, మాటూరు శాఖయ్య, బుజరంపేట మల్లేశం, మంత్రి ఆంజనేయులు,, సత్యం, దుర్గ గౌడ్, రమేష్, కిషోర్ గౌడ్, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# కౌడిపల్లిలో శ్రీకరి జ్యువెలర్స్ ఆధ్వర్యంలో బట్టల పంపిణీ

- ముఖ్య అతిథిగా హాజరైన సర్పంచ్ చంద్రం కృష్ణ గౌడ్
- పాల్గొన్న పంచాయతీ పాలకవర్గం.
- గ్రామానికి సేవలు అందించడంలో గ్రామపంచాయతీ కార్మికులదే ముఖ్యపాత్ర



**కౌడిపల్లి వెలుతురు అక్టోబర్ 21:**
మెదక్ జిల్లా మండల కేంద్రమైన కౌడిపల్లి లో విజయదశమి సందర్భంగా గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద, గ్రామపంచాయతీ ద్వారా గ్రామానికి నిరంతరం ఎనలేని సేవలందిస్తున్న సఫాయివారికి శ్రీకరి జ్యువెలర్స్ ఢ పాన్ బ్రోకర్స్ ప్రొప్రైటర్ నాగరాజు చారి, సహకారంతో మెదక్ జిల్లా సర్పంచ్ ల ఫోరం ఉపాధ్యక్షులు, కౌడిపల్లి సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు,కౌడిపల్లి సర్పంచ్ చంద్రం కృష్ణ గౌడ్, చేతుల మీదుగా దసరా పండగను పురస్కరించుకొని కొత్త బట్టల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ చంద్రం కృష్ణ గౌడ్ మాట్లాడుతూ నాగరాజు చారి, గత ఎనిమిది ఏళ్లుగా జర్నలిస్టుగా పనిచేస్తూ ప్రస్తుతం (జనంసాక్షి) విలేఖరిగా కౌడిపల్లి మండలానికి ఆయన అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. వార్తలు రాసే సమయంలో నిజాన్ని నిర్భయంగా రాయడంలో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారని అన్నారు. అంతేకాక ఇటు వృత్తి వ్యాపారంలో తను నిరంతరం కష్టపడుతూ కుటుంబాన్ని పోషిస్తూ ఇలా సామాజిక సేవలు చేయడం గర్వించదగ్గ విషయం అన్నారు. అనంతరం నాగరాజు చారి, మాట్లాడుతూ నాకు రాజకీయాలతో సంబంధం లేకుండా నేను పుట్టిన ఊరికి సామాజిక సేవలు చేయడం నా మనసుకు ఎంతో తృప్తిని కలిగిస్తుందన్నారు. అందరూ బాగుండాలి అందులో నేనుండాలి అనే ఉద్దేశ్యమే తప్ప ఎలాంటి పదవులు ఆశించనన్నారు. గ్రామానికి సేవ చేసే గుణం ఉండాలే తప్ప పదవులతో పనేముందన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్వేతా గౌడ్, వార్డు సభ్యులు, రాజీవ్ రెడ్డి, మంగళపర్తి సందీప్, చల్ల బొంతమ్మ సంగప్ప, గుడ్డంల లక్ష్మి శరత్, గౌడ్చర్ల ప్రశాంత్, సింగూరి దేవేందర్, రమేష్, రెడ్డి మాధవి మహేష్, హరీష్, కారోబార్ ఎల్లం, దార అనిల్, నాసర్ ఖాన్, తోపాటు పాలకవర్గం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# హుస్నాబాద్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం

- మంత్రి పొన్నం ప్రభాకర్
- ఎల్లమ్మ చెరువు వద్ద రాంలీలా కార్యక్రమంలో రావణ దహనంలో పాల్గొన్న మంత్రి
- విద్య, వైద్యం, మౌలిక వసతులు, పర్యాటక రంగాల అభివృద్ధికి ప్రాధాన్యత



**హుస్నాబాద్, వెలుతురు అక్టోబర్ 21:**
రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు విజయదశమి పండుగను అంగరంగ వైభవంగా జరుపుకుంటున్నారని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి, హుస్నాబాద్ ఎమ్మెల్యే పొన్నం ప్రభాకర్ అన్నారు. విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు వద్ద నిర్వహించిన రాంలీలా కార్యక్రమంలో పాల్గొని రావణ దహనం కార్యక్రమాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా ప్రజలందరికీ విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. విజయదశమి చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక అని, ఈ పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, విజయాలు తీసుకురావాలని మంత్రి ఆకాంక్షించారు. ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, వారి ఆశీస్సులు, సహకారంతో హుస్నాబాద్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి సమస్యలను పరిష్కరిస్తూ, ఈ ప్రాంత ప్రజలకు మరింత గౌరవం తీసుకువచ్చే విధంగా పనిచేయడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో విద్యారంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నామని మంత్రి తెలిపారు. శాతవాహన యూనివర్సిటీల ఇంటిగ్రేటెడ్ విద్యాసంస్థలు, తెలంగాణ పబ్లిక్ స్కూల్, ప్రభుత్వ పాఠశాలల ద్వారా విద్యావకాశాలను విస్తరించి, గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యమని పేర్కొన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలు ఉన్నత విద్యను అభ్యసించి, భవిష్యత్తులో వివిధ రంగాల్లో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడానికి హుస్నాబాద్ ప్రాంతంలో వైద్య మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని మంత్రి తెలిపారు. 250 పడకల ఆసుపత్రి, పీజీ వైద్య కళాశాల వంటి సదుపాయాల అభివృద్ధితో ఈ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని రహదారులు, ఇతర మౌలిక వసతులను అభివృద్ధి చేస్తూ ప్రజలకు మెరుగైన సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని మంత్రి తెలిపారు. హుస్నాబాద్ ప్రజలకు ప్రత్యేక గుర్తింపుగా నిలుస్తున్న ఎల్లమ్మ చెరువును మరింత సుందరీకరించి, అర్బన్ ఫారెస్ట్ పార్క్ అవసరమైన అభివృద్ధి పనులు పూర్తి చేసి, ఆకర్షణీయమైన పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. వ్యవసాయం, పారిశ్రామిక రంగాలతో పాటు ఇతర అభివృద్ధి కార్యక్రమాల ద్వారా హుస్నాబాద్ నియోజకవర్గానికి మరిన్ని అవకాశాలు తీసుకురావడమే లక్ష్యమని స్పష్టం చేశారు. విజయదశమి స్ఫూర్తితో ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, యువజన సంఘాలు, ప్రజలందరూ సమష్టిగా ముందుకు వచ్చి నియోజకవర్గ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని మంత్రి పిలుపునిచ్చారు. ప్రజల ఆశీస్సులు, సహకారంతో హుస్నాబాద్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి, వైస్ చైర్‌పర్సన్ చిత్తారి పద్మ, కౌన్సిలర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, నిర్వాహకులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.



# కరీంనగర్ జిల్లా అభివృద్ధికి సమష్టిగా కృషి చేస్తాం

**మంత్రి పొన్నం ప్రభాకర్**



**కరీంనగర్, వెలుతురు అక్టోబర్ 21:**
విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని కరీంనగర్‌లోని చారిత్రాత్మక, పురాతన గిద్దె పెరుమాళ్ స్వామి ఆలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌తో పాటు ఇతర ప్రజాప్రతినిధులు కలిసి శమీ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. విజయదశమి పర్వదినం సందర్భంగా సర్వేజనా సుఖినోభవంతు అనే ఆకాంక్షతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, ప్రతి ఒక్కరికీ విజయం చేకూరాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. వివిధ హోదాల్లో ప్రజలకు సేవ చేస్తున్న ప్రజాప్రతినిధులందరికీ ప్రజాసేవలో మరింత శక్తిని, సామర్థ్యాన్ని ప్రసాదించాలని, ప్రజల సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేసేలా ఆశీర్వదించాలని భగవంతుడిని కోరుకున్నట్లు చెప్పారు. ప్రస్తుత ప్రకృతి పరిస్థితుల నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లాకు చారిత్రాత్మకమైన గుర్తింపు ఉందని, విద్య, వైద్యం, క్రీడలు, మహిళా సాధికారత, మౌలిక సదుపాయాలు, ఇతర అభివృద్ధి రంగాల్లో జిల్లా మరింత ప్రగతి సాధించేలా ప్రజాప్రతినిధులందరం సమష్టిగా కృషి చేస్తామని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో కరీంనగర్ ఉమ్మడి జిల్లా అగ్రభాగాన నిలిచేలా ప్రతి ఒక్కరూ ఐక్యంగా పనిచేయాలని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా జిల్లాకు మరింత పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని ఆకాంక్షించారు. విజయదశమి స్ఫూర్తితో ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం చేపట్టే ప్రతి కార్యక్రమంలో విజయం సాధించాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ మంత్రి పొన్నం ప్రభాకర్ విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు.





## చర్లపల్లి స్టేషన్‌లో తాగునీటి నమూనాల పరీక్షలు.. అన్నీ సురక్షితం

సికింద్రాబాద్: రైల్వే ప్రయాణికులకు నాణ్యమైన, సురక్షితమైన తాగునీటిని అందించడమే లక్ష్యంగా దక్షిణ మధ్య రైల్వే చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా సికింద్రాబాద్ డివిజన్ పరిధిలోని చర్లపల్లి రైల్వే స్టేషన్‌లో నీటి నాణ్యతను క్రమం తప్పకుండా పరిశీలిస్తోంది. ఈ నెల 12 నుంచి 18వ తేదీ వరకు సేకరించిన 50 నీటి నమూనాల పరీక్షా ఫలితాలు సంతృప్తికరంగా ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. వీటిలో 42 నమూనాలను క్లోరిన్ అవశేషాల స్థాయిల కోసం పరీక్షించగా, అన్నీ నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నట్లు తేలింది. మరో 8 నమూనాలకు నిర్వహించిన బాక్టీరియాలజీ పరీక్షల్లోనూ ఎలాంటి కలుషిత లక్షణాలు బయటపడలేదు. ముఖ్యంగా ఈ.కోలి బ్యాక్టీరియా ఉన్నట్లు ఏ నమూనాలోనూ గుర్తించలేదు. నీటి సరఫరా వ్యవస్థలో భాగంగా భూగర్భ జల వనరులు, పురపాలక సంస్థల ద్వారా అందుతున్న నీరు, నిల్వ కేంద్రాలు, క్లోరినేషన్ విధానాలను అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తున్నారు. నీటిలో క్లోరిన్ స్థాయిలను రోజువారీగా పరిశీలించడంతో పాటు, బ్యాక్టీరియా కలుషితాన్ని గుర్తించేందుకు క్రమం తప్పకుండా పరీక్షలు నిర్వహిస్తున్నారు. ప్రయాణికులకు అందించే తాగునీరు నిర్దేశిత ఆరోగ్య ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ అధికారులకు సూచించారు.

# అమరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకోవాలి: సైబరాబాద్ సీపీ డా. యం. రమేశ్

**సైబరాబాద్ వెలుతురు అక్టోబర్ 21:**
జాతి సేవకు పునరంకితం కావాలి, అమరవీరులకు ఘనంగా నివాళులు.
సైబరాబాద్: పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం (అక్టోబర్ 21, 2026) సందర్భంగా అమరవీరుల సేవలను స్మరిస్తూ సైబరాబాద్ సీపీ డా. యం. రమేశ్, సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లోని అమరవీరుల స్మారక స్థూపానికి ఘనంగా నివాళులర్పించారు. ముందుగా ఆయన గౌరవ వందనాన్ని స్వీకరించి అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీ గారు మాట్లాడుతూ... వీరులారా... మీ త్యాగం వృథా కానివ్వం! మీ ఆశయాలను మా గుండెల్లో పదిలంగా నిలుపుకుంటాం! దేశం కోసం ప్రాణాలర్పించిన అమరవీరులకు మరణం లేదు, వారి త్యాగాలకు అంతం లేదు, వారి కీర్తికి చెరుపు లేదు! సరిహద్దులో సైనికుడి తుపాకీ గర్జన, సమాజంలో పోలీసు ధైర్యపు అడుగు... ఇవే భారత భద్రతకు రెండు బలమైన స్తంభాలు! యూనిఫాం ధరించడం ఒక గౌరవం, ఆ యూనిఫాం గౌరవాన్ని కాపాడటం ఒక బాధ్యత, దేశం కోసం ప్రాణాలర్పించడం అత్యున్నత త్యాగం. వీరుల త్యాగం మనకు చరిత్ర, వారి ధైర్యం మనకు స్ఫూర్తి, వారి దేశభక్తి మనకు మార్గదర్శకం! అమరులైన, భారతమాత ముద్దుబిడ్డలారా, మీ సేవలకు శతకోటి వందనాలు! మీ త్యాగాలకు యావత్ భారతజాతి రుణపడి ఉంటుంది. చివరిగా ఒక్క మాట, దేశం కోసం పోరాడిన వీరులను గౌరవిద్దాం, దేశం కోసం ప్రాణాలర్పించిన అమరవీరులను స్మరించుకుందాం, వారి కుటుంబాలకు అండగా నిలుద్దాం, మన దేశ ఐక్యతను, సమగ్రతను కాపాడుదాం. ప్రజల కోసం పని చేసే పోలీసులకు సహకారం అందించేందుకు ప్రజలు ముందుకు రావాలన్నారు. కొత్తగా పోలీసు బాధ్యత నిర్వర్తించడానికి ముందుకు రాబోతున్నవారికి విధి నిర్వహణలో స్ఫూర్తిని, నూతనోత్తేజాన్ని నింపడమే పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవం జరుపుకోవడంలోని ప్రధాన ఉద్దేశమన్నారు. పోలీసులు విధి నిర్వహణలో క్రమశిక్షణతో పని చేయాలన్నారు. ఈ ఏడాది దేశవ్యాప్తంగా దాదాపు 154 మంది పోలీసులు విధి నిర్వహణలో అమరులయ్యారని జోహార్లు తెలిపారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. అమరుల మరణం వారి కుటుంబసభ్యులకు తీరని లోటని, చనిపోయిన పోలీసుల ఆత్మకు శాంతి కలగాలని తెలిపారు. ప్రభుత్వం పోలీసు అమరుల కుటుంబాలను అన్ని విధాలా ఆదుకుంటుందన్నారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో ప్రాణత్యాగం



చేసిన పోలీస్ అమరవీరులు ఫహీముద్దీన్, కె. హన్మంత్ రెడ్డి, టి. ఈశ్వర్ రావు కుటుంబ సభ్యులను పోలీస్ కమిషనర్ గారు శాలువాలతో సత్కరించి, సమాజ శాంతిభద్రతల పరిరక్షణ కోసం అమరులైన పోలీసుల సేవలు, త్యాగాలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ప్రజలకు 24 గంటలు అందుబాటులో ఉండే డిపార్ట్‌మెంట్ పోలీసులు.. కాబట్టి పోలీసులకు ఎప్పుడూ సహకరించాలన్నారు. దేశంలోని టెర్రరిజం, ఎక్స్‌ట్రీమిజాన్ని అణచివేసి, శాంతి భద్రతలను కాపాడడం కోసం ఎంతో మంది పోలీసులు ప్రాణత్యాగాలను చేశారని గుర్తు చేశారు. 1959 ఇండో–చైనా సరిహద్దులో చైనా దురాక్రమణను భారత సైన్యం సమర్థవంతంగా తిప్పికొట్టిందన్నారు. ఈ యుద్ధంలో ఎంతో మంది సైనికులు అమరులయ్యారన్నారు. అలాగే 1959 అక్టోబర్ 21న లడఖ్ సరిహద్దులో కాపలాగా ఉన్న 10 మంది సిఆర్‌పిఎఫ్ జవాన్లు చైనా సైన్యంతో వీరోచితంగా పోరాడి ప్రాణాలర్పించారని తెలిపారు. అనంతరం, పోలీసు వారి త్యాగాలను గుర్తు చేసుకుంటూ పోలీస్ అమరవీరులకు రెండు నిమిషాలు శ్రద్ధాంజలి ఘటించారు. ఆ తర్వాత ఒక్కొక్కరిగా వచ్చి అందరూ అమరవీరుల స్థూపానికి నివాళులర్పించారు. అనంతరం ఈ సంవత్సరం అమరులైన వారి పేర్లను/రోల్ ఆఫ్ హానర్‌ను సీఏఆర్ హెడ్ క్వార్టర్స్ డీసీపీ సంజీవ్ చదివారు. అనంతరం సైబరాబాద్ పోలీస్ సిబ్బంది, సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ రక్తదాన శిబిరంలో సీపీ డా. యం. రమేష్‌తో పాటు పలువురు అధికారులు, సిబ్బంది రక్తదానం





చేశారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ సంస్థకు 87 యూనిట్లు, ఎన్టీఆర్ ట్రస్ట్‌కు 73 యూనిట్ల రక్తాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. యం. రమేష్, అడ్మిన్ డీసీపీ అన్నపూర్ణ, కూకట్‌పల్లి డీసీపీ రితీరాజ్, క్రైమ్స్ డీసీపీ పుష్పా, శేరిలింగంపల్లి డీసీపీ చింతమనేని శ్రీనివాస్, కుత్బుల్లాపూర్ డీసీపీ కోటిరెడ్డి, వుమెన్ అండ్ చిల్డ్రన్ సేఫ్టీ వింగ్ డీసీపీ సృజన, సీఏఆర్ హెడ్ క్వార్టర్స్ డీసీపీ సంజీవ్, ఇతర ఉన్నత అధికారులు, హెడ్ క్వార్టర్స్ సిబ్బంది, లా అండ్ ఆర్డర్ ఇన్ స్పెక్టర్లు, ట్రాఫిక్ సిబ్బంది, ఆర్ఐలు తదితరులు పాల్గొన్నారు.

# జూపల్లి కృష్ణారావు సవాల్‌కు నిరంజన్‌రెడ్డి సిద్ధం

- పాలమూరు--రంగారెడ్డి పనులు ఎందుకు ఆపారు?
- కాలువల టెండర్లు ఎందుకు రద్దు చేశారు?
- ప్యాకేజీ--3లో అడ్డంకిగా ఉన్న మట్టి తొలగిస్తే నీరు పారే అవకాశం
- రైతుల ప్రయోజనాల కోసం అవసరమైన నిధులు వెంటనే విడుదల చేయాలి



**హైదరాబాద్, వెలుతురు, అక్టోబర్ 21:**
మంత్రి జూపల్లి కృష్ణారావు విసిరిన సవాల్‌ను స్వీకరిస్తున్నానని మాజీ వ్యవసాయ శాఖ మంత్రి, బీఆర్ఎస్ నేత సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి తెలిపారు. నార్లాపూర్ రిజర్వాయర్ నుంచి ఎల్లూరు రిజర్వాయర్‌కు నీరు వస్తుండటం గత బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల ఫలితమేనని పేర్కొన్నారు. జూపల్లి కృష్ణారావు తాజాగా విడుదల చేసిన తూమును తాను అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కోరడంతోనే ఏర్పాటు చేశారని తెలిపారు. కేఎల్ఐ పథకంలో తక్కువ సామర్థ్యంతో నిర్మించిన కాలువల కారణంగా రైతాంగానికి పూర్తిస్థాయిలో ప్రయోజనం కల్పించేందుకు పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని నార్లాపూర్ నుంచి ఎల్లూరుకు, ఏదుల నుంచి బుద్ధారం కాలువకు, వట్టెం రిజర్వాయర్ నుంచి కల్వకుర్తి ఎత్తిపోతల పథకం కాలువకు అనుసంధానం చేసినట్లు వివరించారు. కాంగ్రెస్ హయాంలో జరిగిన అన్యాయాలను బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సరిదిద్దేందుకు ప్రయత్నించామని చెప్పారు.

**శ్రీశైలంలో నీరున్నా ఎందుకు వినియోగించరు?**
ప్రస్తుతం శ్రీశైలం ప్రాజెక్టులో నీరు అందుబాటులోనే ఉందని నిరంజన్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ప్యాకేజీ--3లో అడ్డంకిగా ఉన్న మట్టిని తొలగించి నీటిని పారించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఉన్న పంపులను నడిపేందుకు ఎలాంటి ఇబ్బంది లేదని, పది పంపులను ఒకేసారి నడిపితేనే ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితి ఉందన్నారు. ఏదుల, వట్టెం వద్ద పంపులు సిద్ధంగా ఉన్నాయని, కరివెన వరకు నీటిని తీసుకెళ్లే అవకాశం ఉందని చెప్పారు. ప్రతి రిజర్వాయర్‌లో ఐదు టీఎంసీల చొప్పున నీటిని నింపే అవకాశం ఉందని, మిగిలిన పనులను వచ్చే ఏడాది పూర్తిచేసుకునే అవకాశం ఉందని తెలిపారు. ప్యాకేజీ--3లో అడ్డంకిగా ఉన్న మట్టిని తొలగిస్తే నీరు పారేందుకు ఎలాంటి ఇబ్బంది ఉండదని స్పష్టం చేశారు.

**మూడేళ్లుగా పనులు ఎందుకు నిలిపివేశారు?**
పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులను మూడేళ్లుగా ఎవరు ఆపారని నిరంజన్‌రెడ్డి ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన కాలువల టెండర్లను ఎందుకు రద్దు చేశారని, వాటికి తిరిగి ఎందుకు టెండర్లు పిలవలేదని నిలదీశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పాలమూరు--రంగారెడ్డి పనులు ఎందుకు ముందుకు సాగడం లేదని ప్రశ్నించారు. తెలంగాణ ప్రాజెక్టులకు వ్యతిరేకంగా పనిచేసిన అధికారులను తెలంగాణ సాగునీటి సలహాదారులుగా ఎందుకు నియమించుకున్నారని ప్రశ్నించారు. పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులు పూర్తి చేయాలని బీఆర్ఎస్ గత మూడేళ్లుగా డిమాండ్ చేస్తున్నప్పటికీ మంత్రి జూపల్లి కృష్ణారావు ఒక్కసారి కూడా ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు.

**ప్రజల ప్రయోజనాలే శాశ్వతం**
జూపల్లి కృష్ణారావుకు వ్యక్తిగత, రాజకీయ ప్రయోజనాలే తప్ప పాలమూరు ప్రజల ప్రయోజనాలు పట్టడం లేదని నిరంజన్‌రెడ్డి ఆరోపించారు. బీఆర్ఎస్‌కు అధికారం ఉన్నా లేకపోయినా పాలమూరు ప్రజల, తెలంగాణ ప్రయోజనాల కోసం పోరాడామని, ఇకముందూ పోరాడుతామని అన్నారు. అధికారం శాశ్వతం కాదని, ప్రజల ప్రయోజనాలే శాశ్వతమని పేర్కొన్నారు. రాజకీయాల్లో ఎవరైనా అధికారంలో ఉండవచ్చని, అయితే ఆ అవకాశం కల్పించిన ప్రజల ప్రయోజనాల కోసం పనిచేసిన వారిని ప్రజలు జీవితాంతం గుర్తుంచుకుంటారని అన్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు విసిరిన సవాల్‌ను స్వీకరించాలని, అదే సమయంలో రైతులకు ఉన్న ఇబ్బందులను తొలగించేందుకు అవసరమైన నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేసి పనులకు సహకరించాలని నిరంజన్‌రెడ్డి కోరారు.

## చోరీలకు పాల్పడుతున్న ప్రేమ జంట

ఆలయంలో ఒంటరిగా ఉన్న వృద్ధురాలిని లక్ష్యంగా చేసుకుని ఆమె మెడలోని బంగారు పుస్తెలతాడును బలవంతంగా అపహరించిన ఘటనలో వనస్థలిపురం పోలీసులు ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి సుమారు 30 గ్రాముల బంగారు పుస్తెలతాడుతో పాటు రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఘటన జరిగిన మూడు రోజుల్లోనే కేసును ఛేదించి నిందితులను పట్టుకోవడం పోలీసుల దర్యాప్తులో కీలక పరిణామంగా నిలిచింది.
పోలీసుల వివరాల ప్రకారం.. ఈ నెల 18వ తేదీ ఉదయం సుమారు 6.04 గంటలకు హస్తినాపురం వెంకటరమణ కాలనీలోని రాజరాజేశ్వరి ఆలయంలో ఆండుగుల రాములమ్మ (66) ఆలయ శుభ్రంపై నిమగ్నమై ఉన్నారు. ఆ సమయంలో అక్కడికి వచ్చిన ఇద్దరు నిందితులు ఆమెను లక్ష్యంగా చేసుకున్నారు. మహిళా నిందితురాలు వృద్ధురాలిని గట్టిగా పట్టుకుని నోరు మూయగా, పురుష నిందితుడు ఆమె మెడలోని సుమారు 30 గ్రాముల బంగారు పుస్తెలతాడును బలవంతంగా లాక్కున్నట్లు పోలీసులు తెలిపారు. అనంతరం ఇద్దరూ ద్విచక్ర వాహనంపై అక్కడి నుంచి పరారయ్యారు. ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లి.. ఆభరణాన్ని విక్రయించేందుకు నిందితులు ప్రయత్నించినప్పటికీ కొనుగోలుదారులు లభించలేదని పోలీసులు వెల్లడించారు. దీంతో ఆంధ్రప్రదేశ్‌లోని నడికుడి రైల్వే స్టేషన్ సమీపంలో ద్విచక్ర వాహనాన్ని పార్క్ చేసి, రైలులో తిరిగి హైదరాబాద్‌కు వచ్చినట్లు దర్యాప్తులో గుర్తించారు. ఒకేసు దర్యాప్తును వేగవంతం చేసిన వనస్థలిపురం పోలీసులు అక్టోబర్ 21 ఉదయం కమలానగర్‌లోని ఓ నగల దుకాణం సమీపంలో ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారిని అన్నపురెడ్డి దుర్గ రమణారెడ్డి (23), తంక వరలక్ష్మి (24)గా గుర్తించారు. వీరిద్దరూ రంగారెడ్డి జిల్లాలో నివసిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుల వద్ద నుంచి సుమారు 30 గ్రాముల బంగారు పుస్తెలతాడుతో పాటు రియల్‌మీ, వివో వై–31కు చెందిన రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఒంటరిగా ఉన్న వృద్ధ మహిళలను లక్ష్యంగా చేసుకుని ఆభరణాలు అపహరించేందుకు నిందితులు ప్రయత్నించినట్లు దర్యాప్తులో వెల్లడైందని పోలీసులు తెలిపారు. మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి, ఐపీఎస్ ఆదేశాల మేరకు, ఎల్‌బీనగర్ జోన్ డీసీపీ బి. అనురాధ, ఐపీఎస్ పర్యవేక్షణలో వనస్థలిపురం డివిజన్ ఇన్‌చార్జి ఏసీపీ టి. కరుణాకర్‌రావు ఆధ్వర్యంలో ఈ కేసును ఛేదించారు. వనస్థలిపురం ఎస్‌హెచ్ఓ ఎస్. రవిబాబు, డీఐ బి. రాజేష్, డీఎస్ఐ వి. రవి, ఎస్ఐ డి. మల్లయ్య తదితరులు దర్యాప్తులో పాల్గొన్నారు. ఆలయాలు, పార్కులు, రద్దీ తక్కువగా ఉండే ప్రాంతాల్లో ఒంటరిగా ఉన్నప్పుడు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తుల కదలికలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. మహిళలు, వృద్ధుల భద్రతకు ప్రజల అప్రమత్తతతో పాటు పోలీసుల సహకారం కూడా కీలకమని పేర్కొన్నారు.



## పండుగ రద్దీకి సికింద్రాబాద్ నుంచి ప్రత్యేక రైళ్లు

సికింద్రాబాద్: పండుగల నేపథ్యంలో ప్రయాణికుల రద్దీని తగ్గించేందుకు దక్షిణ మధ్యరైల్వే ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు ఒక ప్రకటన లో తెలిపారు. సికింద్రాబాద్--తిరుపతి మధ్య ఈ నెల 22న ప్రత్యేక రైలును నడపనుంది. రైలు నంబర్ 07424 సికింద్రాబాద్‌లో రాత్రి 8 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 11 గంటలకు తిరుపతి చేరుకుంటుంది. ఈ రైలు చర్లపల్లి, నల్గొండ, మిర్యాలగూడ, గుంటూరు, తెనాలి, చీరాల, ఒంగోలు, నెల్లూరు, రేణిగుంట స్టేషన్లలో ఆగుతుంది. అలాగే విశాఖపట్నం--సికింద్రాబాద్ మధ్య 08517 నంబర్ ప్రత్యేక రైలును ఈ నెల 22, 25 తేదీల్లో నడపనున్నారు. ఈ రైలు విశాఖపట్నంలో మధ్యాహ్నం 3.50 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 8 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో 08518 నంబర్ రైలును ఈ నెల 23, 26 తేదీల్లో నడపనున్నారు. ఈ రైలు సికింద్రాబా ద్‌లో రాత్రి 8 గంటలకు బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 12.05 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ ప్రత్యేక రైళ్లు దువ్వాడ, అనకాపల్లి, సామర్లకోట, రాజమండ్రి, భీమవరం టౌన్, గుడివాడ, విజయవాడ, గుంటూరు, మిర్యాలగూడ, నల్గొండ, చర్లపల్లి స్టేషన్లలో ఆగుతాయి. ప్రయాణికుల సౌకర్యార్థం ఈ రైళ్లలో ఏసీ 2 టైర్, ఏసీ 3 టైర్, స్లీపర్, జనరల్ సెకండ్ క్లాస్ బోగీలను ఏర్పాటు చేశారు.




## డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల నిరసన

ఎన్‌హెచ్‌ఎం (నేషనల్ హెల్త్ మిషన్) ఉద్యోగుల నిరసన కొనసాగుతోంది. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమ్మె 9వ రోజుకు చేరింది. హైదరాబాద్ డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట ఎన్‌హెచ్‌ఎం (నేషనల్ హెల్త్ మిషన్) ఉద్యోగుల నిరసన కొనసాగిస్తున్నారు. తెలంగాణలో రెగ్యులరైజేషన్ అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. హెల్త్ కార్డులతోపాటు సమానపనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వివిధ జిల్లాల నుంచి ఎన్‌హెచ్ ఎం ఉద్యోగులు భారీ ఎత్తున తరలివచ్చారు. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను ఎలాంటి షరతులు లేకుండా రెగ్యులరైజేషన్ చేయాలని డిమాండ్ చశారు. మరోవైపు నాగర్‌కర్నూల్ కలెక్టరేట్ ముందు నిరవధిక సమ్మె కొనసాగుతోంది. పండగ రోజు నల్లబ్యాడ్జీలు ధరించి.. గొడ్డు కారంతో భోజనం చేస్తూ వినూత్నంగా నిరసన తెలియజేశారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్చలకు పిలవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## కేటీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు..



దసరా పండుగ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారంతా కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం అందించి.. శాలువాతో సత్కరించి దసరా శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం నేడు పుట్టినరోజు జరుపుకుంటున్న కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానందను కేటీఆర్ శాలువాతో సత్కరించి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కేటీఆర్‌ను కలిసిన వారిలో ఎమ్మెల్యేలు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, మాధవరం కృష్ణారావు, కాలేరు వెంకటేశ్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డితోపాటు పలువురు బీఆర్ ఎస్ నాయకులు, పార్టీ ప్రతినిధులు, కార్యకర్తలు ఉన్నారు.

# 'ప్రత్యామ్నాయ పంటలతో రైతులకు అధిక ఆదాయం'



రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని టీజీఎస్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ జితేశ్ వి. పాటిల్ రైతులకు సూచించారు. ఎల్‌నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితులు ప్రతికూలంగా మారుతున్న నేపథ్యంలో భూగర్భ జలాలను సంరక్షించేందుకు తక్కువ నీటితో సాగయ్యే పంటలకు ప్రాధాన్యమివ్వాలని కోరారు. రైతులతో ముఖాముఖి కార్యక్రమంలో భాగంగా బుధవారం బీబీనగర్ మండలంలోని బ్రాహ్మణపల్లి, చినరావులపల్లి, బట్టుగూడెం గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా రైతులతో నేరుగా మాట్లాడి వ్యవసాయ సమస్యలు, నీటి లభ్యత, ప్రత్యామ్నాయ పంటల సాగు ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. వరి సాగుతో పోలిస్తే తక్కువ నీటితో పండించే కూరగాయలు, మునగ వంటి వాణిజ్య పంటల సాగుతో మెరుగైన ఆదాయం పొందే అవకాశాలున్నాయని వివరించారు. మార్కెట్ అవసరాలకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమ, మేకల పెంపకం వంటి అనుబంధ రంగాలపై దృష్టి సారించాలని తెలిపారు. తద్వారా రైతు కుటుంబాలకు అదనపు ఆదాయం సమకూరి ఆర్థికంగా బలోపేతమయ్యే అవకాశం ఉందన్నారు. సేంద్రియ పద్ధతుల్లో కూరగాయల సాగును ప్రోత్సహించాలని, నీరు, విద్యుత్‌ను పొదుపుగా వినియోగించుకోవాలని పేర్కొన్నారు. తక్కువ నీటి అవసరమున్న పంటల సాగుతో భూగర్భ జలాల వినియోగం తగ్గడమే కాకుండా వ్యవసాయ విద్యుత్ వినియోగాన్ని కూడా ఆదా చేయవచ్చని చెప్పారు. రైతులకు నాణ్యమైన, నమ్మకమైన విద్యుత్ సరఫరా అందించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని విద్యుత్ అధికారులను సీఎండీ ఆదేశించారు. వ్యవసాయ విద్యుత్ సరఫరాలో అంతరాయాలను తగ్గించి, సరఫరా నాణ్యతను మెరుగుపరిచేందుకు చేపట్టాల్సిన అభివృద్ధి పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ రైతులకు మెరుగైన విద్యుత్ సేవలు అందించాలని సూచించారు. నీటి లభ్యతకు అనుగుణంగా పంటలను ఎంచుకోవడం, ప్రత్యామ్నాయ సాగును ప్రోత్సహించడం ద్వారా వనరులను సంరక్షించడంతో పాటు వ్యవసాయాన్ని మరింత లాభదాయకంగా మార్చుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ దక్షిణ విద్యుత్ పంపిణీ సంస్థ లిమిటెడ్ డైరెక్టర్ (ఆపరేషన్స్?? ) ఎన్ . నరసింహులు, చీఫ్ ఇంజినీర్ యు. బాలస్వామి, సూపరింటెండింగ్ ఇంజినీర్ కె. సురేశ్ కుమార్, భువనగిరి డివిజనల్ ఇంజినీర్ ఎస్. వెంకటేశ్వర్లు, డివిజనల్ ఇంజినీర్ (ఎంఆర్ టీ) విజయభాస్కర్ రెడ్డి, బీబీనగర్ అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ వి. మచ్చేందర్, అసిస్టెంట్ ఇంజినీర్ డి. మనోహర్ రెడ్డి, పాల్గొన్నారు.

# విద్యపై దృష్టి పెట్టి ఉన్నత లక్ష్యాలను సాధించాలి

: విద్యార్థులు విద్యపై ప్రత్యేక దృష్టి సారించి, ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించేందుకు కృషి చేయాలని చంచల్‌గూడ జైలర్ సంజీవరెడ్డి అన్నారు. కట్టంగూర్‌కు చెందిన వీరమల్ల హనుమాన్--మంజుల దంపతుల ప్రథమ పుత్రిక తేజశ్రీ ఇటీవల విడుదలైన నీట్ పరీక్ష ఫలితాల్లో మెడిసిన్ సీటు సాధించి వైద్య విద్యను అభ్యసించే అవకాశం దక్కించుకుంది. చిన్ననాటి స్నేహితుడి కుమార్తె వైద్య విద్యలో సీటు సాధించడంతో ఆనందం వ్యక్తం చేసిన జైలర్ సంజీవరెడ్డితో పాటు ఆయన చిన్ననాటి మిత్రులు బుధవారం తేజశ్రీని ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టపడి చదివితే సాధించలేనిదంటూ ఏదీ ఉండదన్నారు. తేజశ్రీ విజయం ఇతర విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. కష్టపడి చదివి అనుకున్న లక్ష్యాన్ని చేరుకున్నప్పుడే జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగడంతో పాటు తల్లిదండ్రుల కలలను సాకారం చేయగలమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నిమ్మనగోటి



రమేశ్, భూపతి సురేశ్, చెరుకు శ్రీనివాస్, పోగుల యాదగిరి, కానుగు శీను, కొంపెల్లి నాగరాజు, బండ శ్రవణ్, అంతటి నగేశ్, మాతంగి శంకర్ పాల్గొన్నారు.

## స్కూటీని తప్పించబోయి చెట్టును ఢీ



పెద్దపల్లి మండలం రాంపల్లి గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదం లో ఆరుగురికి గాయాలయ్యాయి. జమ్మికుంట నుంచి పెద్దపల్లి వైపు వస్తున్న కారు ( ఝుతీ ) ఎదురుగా వస్తున్న స్కూటీ ని తప్పించబోయి రాంపల్లి శివారులో అదుపు తప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ ఘటనలో పెనుప్రమాదం తప్పినప్పటికీ ఆరుగురికి గాయాలు కాగా 108 ద్వారా పెద్దపల్లి దవాఖానకు తరలించారు. జమ్మికుంటలో జరిగిన ఓ ఫంక్షన్‌కు హాజరై తిరిగి వస్తున్న ఓ కుటుంబం అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు పురుషులు, ఇద్దరు మహిళలు, ఓ చిన్నారికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను హుటాహుటిన 108 అంబులెన్స్ ద్వారా పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## హత్యాయత్నం కేసులో ముగ్గురు నిందితులు అరెస్ట్

దసరా పండుగ సందర్భంగా కత్తితో దాడి చేసి గాయపరిచి హత్యాయత్నానికి పాల్పడ్డ ముగ్గురు నిందితులను కోరుట్ల పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కోరుట్ల పట్టణంలోని అర్బన్ కాలనీకి చెందిన గుద్దేటి రాజేందర్ కాలనీలో దుర్గామాత అమ్మవారి నిమజ్జన కార్యక్రమంలో ఉండగా రామ్ నగర్ కాలనీకి చెందిన కిరణ్, అజయ్ గొడవ పడ్డారు.
బుధవారం తెల్లవారుజామున మరో వ్యక్తి జ్ఞానదీప్‌తో కలిసి వచ్చి రాజేందర్‌తో మరోసారి గొడవపడ్డారు. వెంట తెచ్చుకున్న కత్తితో జ్ఞానదీప్ దాడి చేయడంతో రాజేందర్ ఎడమ భుజం, మెడ ఎడమ వైపు గాయాలయ్యాయి. స్థానికులు నిందితులను పట్టుకోవడానికి ప్రయత్నించగా, వారు కత్తితో బెదిరించి అక్కడి నుంచి పారిపోయారని సీఐ తిరుపతి వెల్లడించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి ముగ్గురిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు.

## స్కూటీని తప్పించబోయి చెట్టును ఢీకొట్టిన కారు

పెద్దపల్లి జిల్లా పరిధిలో పెను ప్రమాదం తప్పింది. పెద్దపల్లి మండలం రాంపల్లి గ్రామ సమీపంలో రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. జమ్మికుంట నుంచి పెద్దపల్లి వైపు వస్తున్న కారు ఎదురుగా వస్తున్న స్కూటీని తప్పించబోయి రాంపల్లి శివారులో అదుపు తప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ ఘటనలో పెనుప్రమాదం తప్పినప్పటికీ ఆరుగురికి గాయాలయ్యాయి. కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు పురుషులు, ఇద్దరు మహిళలు, ఓ చిన్నారికి గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో వారిని వెంటనే 108 ద్వారా పెద్దపల్లి దవాఖానకు తరలించారు. కుటుంబసభ్యులంతా జమ్మికుంటలో జరిగిన ఓ ఫంక్షన్‌కు హాజరై **TS 22 C** 7888 నంబర్ గల కారులో తిరిగి వస్తున్న క్రమంలో ఆ కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది.







# వయసును గెలిచిన వజ్ర సంకల్పం



## అంతర్జాతీయ వేదికలపై ప్రదీప్ కుమార్ స్వర్ణ విహారం!







**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 21:** అకుంఠిత దీక్ష, అచంచలమైన ఆత్మవిశ్వాసం ముందు వయసు సైతం శిరస్సు వంచక తప్పలేదు! సాధన ఉంటే సాధ్యం కానిది ఏదీ లేదని నిరూపిస్తూ, 63 ఏళ్ల అపరాజిత వయసులో ప్రపంచ పవర్ లిఫ్టింగ్ రంగంలో ఎన్నోమార్లు విశ్వవిజేతగా నిలిచి యువ తరానికి నిలువెత్తు స్ఫూర్తిగా నిలిచారు పెరుమాళ్ల ప్రదీప్‌కుమార్. రాచకొండ పోలీస్ కమిషనరేట్‌లో అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్‌గా విశేష సేవలు అందించి జులై 2024 లో పదవీ విరమణ చేసిన ఆయన, విశ్రాంతి జీవితాన్ని బంగారు పతకాల పంటగా మార్చుకున్నారు.

**విధిరాతను మార్చిన వ్యాయామ దీక్ష:**
రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నానికి చెందిన ప్రదీప్‌కుమార్ క్రమశిక్షణ గల కుటుంబ నేపథ్యం నుండి వచ్చారు, ప్రదీప్ కుమార్ తండ్రి పెరుమాళ్ల వెంకన్న సబ్ ఇనస్పెక్టర్‌గా పోలిస్ శాఖలో సేవలు అందించారు మరియు తల్లి పాపాయై గవర్నమెంట్ టీచర్ గా విశిష్ట సేవలందించారు . విద్యార్థి దశ నుంచే శారీరక దారుఢ్యంపై మక్కువ పెంచుకున్న ప్రదీప్ కుమార్ గారు, బాడీబిల్డింగ్‌లో శిక్షణ పొంది స్థానిక యు వతకు మార్గదర్శిగా నిలిచారు. అయితే, ప్రభుత్వ ఉద్యోగ బాధ్యతల వల్ల వ్యాయా మానికి దూరం కావడంతో, 2015లో (51వ ఏట) తీవ్రమైన ఊబకాయం బారిన పడి దాదాపు 100 కేజీల బరువుకు చేరుకున్నారు. కానీ, పట్టుదల వీడని ఆయన, ఫిట్‌నెస్ కోచ్ వంశీ పర్యవే క్షణలో ఇనుప సంకల్పంతో శ్రమించి కేవలం ఒక్క ఏడాదిలోనే 22 కేజీల బరువు తగ్గి అద్భుత పునరాగమనాన్ని చాటారు.

**ఇన్‌స్పెక్టర్ ప్రోత్సాహంతో**
**పవర్ లిఫ్టింగ్ వైపు అడుగులు:**
రాచకొండ కమిషనరేట్ రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ పవన్ గారు ప్రదీప్ కుమార్ గారిలోని అసాధారణ ప్రతిభను గుర్తించి పవర్ లిఫ్టింగ్ వైపు నడిపించారు. 2021లో అధికారికంగా సాధన ప్రారంభించిన ప్రదీప్ కుమార్ గారు, 2022 నాటికి ఎల్బీ స్టేడియంలో స్వర్ణ పతకం సాధించి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఆ తర్వాత ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన జాతీయ పోటీల్లో అగ్రశ్రేణి క్రీడాకారులతో తలపడి నాల్గవ స్థానంలో నిలిచారు.

**ప్రపంచ వేదికలపై భారత జెండా.. పదవీ విరమణ తర్వాత పతకాల ప్రభంజనం!**
ఉద్యోగ విరమణ తర్వాత చాలామంది విశ్రాంతి కోరుకుంటే, ప్రదీప్ కుమార్ గారు మాత్రం భారతదేశం తరఫున అంతర్జాతీయ వేదికలపై సరికొత్త చరిత్ర సృష్టించడం ప్రారంభించారు. తన కఠోర శ్రమతో పవర్ లిఫ్టింగ్ ప్రపంచంలో తిరుగులేని శక్తుగా ఎదిగి వరుస విజయాలతో సంచలనం సృష్టించారు.

**2023--కిర్గిజిస్తాన్ విశ్వవిజేత:**
కిర్గిజిస్తాన్‌లోని బిష్కెక్ నగరంలో జరిగిన వరల్డ్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో మాస్టర్స్ విభాగంలో ప్రత్యర్థులను మట్టికరిపించి ఏకంగా 3 బంగారు పతకాలను గెలుచుకుని ప్రపంచ ఛాంపియన్‌గా అవతరించారు.

**2024 - రష్యాలో స్వర్ణ విహారం:**
రష్యా వేదికగా జరిగిన అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీలలో అమోఘమైన బలప్రదర్శనతో 2 బంగారు పతకాలను కైవసం చేసుకుని దేశ కీర్తిని చాటారు.

**2026 ఫిబ్రవరి -- ఈజిప్ట్ వరల్డ్ కప్‌లో రజతం:**
ఈజిప్ట్ రాజధాని కైరోలో హోరాహోరీగా జరిగిన పవర్ లిఫ్టింగ్ వరల్డ్ కప్‌లో ప్రపంచ దిగ్గజాలకు గట్టి పోటీనిస్తూ ఒక వెండి పతకాన్ని (రాఅశ్రీజవతీ వీవఘ్మశ్రీ) సొంతం చేసుకున్నారు.

**2026 సెప్టెంబరు -- కజకిస్తాన్ లో త్రివర్ణ పతాకం:** కజకిస్తాన్‌లోని కరాగండా నగరంలో జరిగిన అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో తన పాత రికార్డులను తిరగరాస్తూ ఏకంగా 3 బంగారు పతకాలను సాధించి దేశానికి గర్వకారణంగా నిలిచారు.

ఆయన సాధిస్తున్న ఈ అసాధారణ విజయాలకు గాను రాచకొండ, మల్కాజ్‌గిరి పోలీస్ ఉన్నతాధికారులతో పాటు ముఖ్యమంత్రి వర్యులు ఎందరో ప్రభుత్వ పెద్దలు , క్రీడా లోకం యావత్తూ ఆయనకు అభినందనలు తెలియజేస్తోంది.

**యువతకు సింహ గర్జన లాంటి సందేశం : పెరుమాళ్ల ప్రదీప్‌కుమార్**
"ప్రస్తుత కాలంలో రసాయనిక ఆహారపు అలవాట్లు, సోమరితనం వల్ల యువత ఊబకాయం బారిన పడి ఆరోగ్యాన్ని, మానసిక ఉల్లాసాన్ని కోల్పోతున్నారు. శారీరక దారుఢ్యం, నిరంతర వ్యాయామం ద్వారానే సంపూర్ణ ఆరోగ్యం జ్ఞాపకశక్తి సాధ్యమవుతాయి. తక్కువ సమయంలో, క్షణికమైన ఆకర్షణ కోసం కృత్రిమ మందులు, ప్రమాదకరమైన ఇంజక్షన్లు వాడి జీవితాలను నాశనం చేసుకోవద్దు. ప్రకృతిసిద్ధమైన ఆహారం, క్రమశిక్షణతో కూడిన నిత్య సాధన మాత్రమే మిమ్మల్ని విజేతలుగా నిలబెడుతుంది."










# తెలంగాణ ప్రజలకు దసరా పండుగ శుభాకాంక్షలు

- టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్
- దసరా పండుగ సందర్భంగా ఉప్పల్ లో పెద్ద ఎత్తున జరిగిన రవాణా దహన కార్యక్రమంలో పాల్గొన్న టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ దంపతులు





**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 21:** దసరా పండుగ సందర్భంగా ఉప్పల్ లో పెద్ద ఎత్తున జరిగిన రవాణా దహన కార్యక్రమంలో పాల్గొన్న టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ దంపతులు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ నియోజక వర్గ పరమేశ్వర్ రెడ్డి, డీసీసీ అధ్యక్షులు వజ్రేశ్ యాదవ్, మాజీ కార్పొరేటర్ రజిత, కాంగ్రెస్ నాయకులు భూపతిరెడ్డి నర్సారెడ్డి తదితరులు.. ఈ సందర్భంగా పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ ప్రజలకు దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. దసరా పండుగ ఒక అద్భుతమైన హితం తెలిపే పండుగ అని చెడు మీద మంచి సాధించే విజయానికి గుర్తుగా దసరా పండుగను ప్రజలు పెద్ద ఎత్తున చేసుకుంటారని ప్రజల జీవితాలలో మంచి జరగాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్న అని అన్నారు. ఈ సందర్భంగా రవాణ దహన కార్యక్రమాన్ని మహేష్ కుమార్ గౌడ్ చేపట్టారు. నియోజక వర్గ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.







# టీవీ ఛానెళ్లకు కేంద్రం హెచ్చరిక

- నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్న కేంద్రం
- ఏఐని సహాయక సాధనంగా మాత్రమే వాడాలని సూచన
- వార్తల కచ్చితత్వం, విశ్వసనీయత కాపాడాలని స్పష్టీకరణ
- చర్చల్లో అభ్యంతరకర వ్యాఖ్యలకు తావివ్వొద్దు



**న్యూఢిల్లీ, వెలుతురు, అక్టోబర్ 21:** టీవీ ఛానళ్లు వార్తలు, కార్యక్రమాల ప్రసారంలో నిబంధ నలు తప్పనిసరిగా పాటించాలని కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ హెచ్చరించింది. కృత్రిమ మేధ (ఏఐ) వినియోగంలోనూ జాగ్రత్తలు తీసుకోవా లని సూచించింది. వార్తల్లో వాస్తవాలు వక్రీకరిం చినా, నిబంధనలు ఉల్లంఘించినా చర్యలు తప్పవని స్పష్టం చేసింది. వార్తలు, గ్రాఫిక్స్, వర్చువల్ న్యూస్ ప్రెజెంటేషన్లలో ఏఐని సహాయక సాధనంగా మాత్రమే ఉపయోగించాలని తెలిపింది. దాని వల్ల వార్తల కచ్చితత్వం, విశ్వసనీయత దెబ్బతినకూడ దని పేర్కొంది. కేబుల్ టెలివిజన్ నెట్‌వర్క్స్ చట్టం-1995, నిబంధనలు-1994 ప్రకారం నిర్దేశించిన ప్రోగ్రామ్ కోడ్‌ను కొన్ని ఛానళ్లు ఉల్లంఘించినట్లు మంత్రిత్వ శాఖ గుర్తుచేసింది. నిబంధనలకు విరుద్ధంగా ప్రసారాలు చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. వివిధ ఛానళ్లలో ఒకే తరహా వార్తలు, దృశ్యాలు ప్రసారమవుతున్న తీరుపై అంతర్ శాఖల కమిటీ ఆందోళన వ్యక్తం చేసింది. టీవీ కార్య క్రమాల్లో అభ్యంతరకర భాష, అనుచిత ప్రవర్తనను సాధారణ విషయాలుగా చూపకూడదని సూచించి ంది. చర్చా కార్యక్రమాల్లో పాల్గొనే ప్యానెలిస్టుల ఎం పికలో జాగ్రత్తలు తీసుకో వాలని కేంద్రం తెలిపింది. మత విద్వేషాలు రెచ్చ గొట్టే, ఉద్రిక్తతలు పెంచే వ్యాఖ్య లకు తావివ్వకూ డదని స్పష్టం చేసింది. అవసరమైతే అలాంటి వ్యాఖ్యలను మ్యూట్ చేయడం, హెచ్చరికలు ఇవ్వడం, డిస్‌క్లెయిమర్లు చూపడం లేదా ప్రసారాన్ని నిలిపివేయడం వంటి చర్యలు తీసుకోవాలన్నారు.

### శోభయాత్రలో పాల్గొని ప్రత్యేక పూజలు

# నిర్వహించిన టీపీసీసీ అధ్యక్షుడు




**నిజామాబాదు, వెలుతురు అక్టోబర్ 21:** నిజామాబాద్ పట్టణంలోని మార్కం డేయ దేవాలయంలో నిర్వహించిన శోభ యాత్రలో టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారిని దర్శించుకుని భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. ఈ కార్య క్రమంలో నిజా మాబాద్ మేయర్ ఉమా రాణి, డీసీసీ అధ్యక్షులు నగేష్ రెడ్డి, బొబ్బి లి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# ఎన్‌ఓసీ అక్కర్లేదు..!

- స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్లపై రాష్ట్ర ఎన్నికల సంఘం స్పష్టత
- నామినేషన్ల దాఖలుకు నో డ్యూస్ సర్టిఫికెట్ అవసరం లేదని వెల్లడి
- ఈ కారణంతో నామినేషన్లను తిరస్కరించవద్దని అధికారులకు ఆదేశం
- నామినేషన్ల అడ్డంకులపై సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో ఈ ప్రకటన

**అమరావతి, వెలుతురు, అక్టోబర్ 21:** ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియపై రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్‌ఈసీ) కీలకమైన స్పష్టత ఇచ్చింది. నామినేషన్లు దాఖలు చేసే అభ్యర్థులు 'నో అబ్జెక్షన్ సర్టిఫికెట్' (ఎన్‌ఓసీ) లేదా 'నో డ్యూస్ సర్టిఫికెట్' సమర్పించాల్సిన అవసరం లేదని బుధవారం స్పష్టం చేసింది. ఈ మేరకు అమరావతి నుంచి ఎస్‌ఈసీ ఒక ప్రకటన విడుదల చేసింది. స్థానిక సంస్థల ఎన్నికల చట్టాల ప్రకారం ఈ పత్రాలు తప్పనిసరి కాదని పేర్కొంది. కేవలం ఈ సర్టిఫికెట్లు లేవన్న కారణంతో నామినేషన్ల స్వీకరణను నిలిపివేయవద్దని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. అయితే, నామినేషన్‌కు అవసరమైన ఇతర పత్రాలను మాత్రం అభ్యర్థులు తప్పనిసరిగా సమర్పించాల్సి ఉంటుందని తెలిపింది. రాష్ట్రంలో పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ




కొనసాగుతున్న నేపథ్యంలో ఈ స్పష్టత ప్రాధాన్యం సంతరించుకుంది. కొన్ని ప్రాంతాల్లో తమ అభ్యర్థులు నామినేషన్లు వేయకుండా అడ్డుకుంటున్నారని, దాడులకు పాల్పడుతున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆరోపణలు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ వివాదాల నేపథ్యంలో కొందరు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన సర్వోన్నత న్యాయస్థానం, నామినేషన్ల అడ్డంకులపై వచ్చిన ఫిర్యాదులను పరిశీలించాలని ఎస్‌ఈసీని ఆదేశించింది. అవసరమైతే ప్రభావిత ప్రాంతాల్లో కనీసం 48 గంటల పాటు గడువు పొడిగింపుపై గురువారం నాటికి నిర్ణయం తీసుకో వాలని సూచించింది. అలాగే, అక్టోబర్ 25 వరకు అభ్యర్థుల తుది జాబితాను ప్రచురించవద్దని ఆదేశిం చింది. ఈ పరిణామాల మధ్య, ఎటువంటి సాంకేతిక అడ్డంకులు లేకుండా నామినేషన్ల ప్రక్రియ సజావుగా సాగేందుకు వీలుగా ఎస్‌ఈసీ తాజా మార్గదర్శకాలను జారీ చేసింది.

### 26 ఏళ్ల సంప్రదాయానికి కేసముద్రం

# మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సమ్మయ్యగౌడ్ చేయూత!

- ఉప్పరపల్లి రావణ వధ ప్రతిమ విరాళం.. యువత యూత్ క్లబ్‌కు ప్రోత్సాహం
- గ్రామాన్ని సొంత ఊరుగా భావిస్తూ సేవా కార్యక్రమాలకు అండ
- గత ఏడాది సైతం సహకారం.. సమ్మయ్యగౌడ్ ఔదార్యంపై గ్రామస్థుల హర్షం



**కేసముద్రం, వెలుతురు అక్టోబర్ 21:** గ్రామీణ సంప్రదాయాల పరిరక్షణకు, యువత నిర్వ హించే సాంస్కృతిక కార్యక్రమాల ప్రోత్సాహానికి కేస ముద్రం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సమ్మ య్యగౌడ్ తనవంతు సహకారం అందిస్తు న్నారు. మండలంలోని ఉప్పరపల్లి గ్రామంలో యువత యూ త్ క్లబ్ ఆధ్వర్యంలో గత 26 ఏళ్లుగా కొనసాగుతున్న రావణ వధ కార్యక్రమానికి ఈ ఏడాది సైతం రావణ వధ బొమ్మను విరాళంగా అందించి తన ఔదార్యాన్ని చాటుకున్నారు. గత ఏడాది కూడా బొమ్మకు విరా ళం అందించిన ఆయన, వరుసగా యువత కార్యక్ర మానికి అండగా నిలవడం పట్ల గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఉప్పరపల్లి గ్రామాన్ని తన సొంత గ్రామంగా భావిస్తూ పలు సేవా కార్యక్ర మాలకు సహకరిస్తున్న సమ్మయ్యగౌడ్‌కు యువత యూత్ క్లబ్ సభ్యులు, గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు. యువత యూత్ క్లబ్ అధ్యక్షుడు తండ శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామంలో గత 26 ఏళ్లుగా యువత ఆధ్వర్యంలో రావణ వధ కార్యక్రమాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇన్నేళ్లుగా కార్యక్రమాన్ని కొనసాగించడంలో గ్రామ ప్రజలు, పెద్దలు, దాతల సహకారం మరువలేనిదని పేర్కొన్నారు. ముఖ్యంగా కేసముద్రం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సమ్మయ్యగౌడ్ గత ఏడాది కూడా రావణ వధ బొమ్మకు విరాళం అందించారని, ఈ ఏడాది కూడా రావణ వధ ప్రతిమను ఇచ్చి మా యువత యూత్ సహకరించి యువతకు ప్రోత్సా హాన్ని అందించారని కొనియాడారు. ఇలాంటి సహ కారం యువతలో మరింత ఉత్సాహాన్ని నింపుతుం దని, గ్రామంలో నిర్వహించే సేవా, సాంస్కృతిక కార్యక్రమాలకు ఆయన అందిస్తున్న తోడ్పాటు అభినందనీయమని అన్నారు. సమ్మయ్యగౌడ్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో యువత ఐక్యంగా ముందుకు వచ్చి మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడేందుకు కృషి చేయడం సంతోషకరమని తెలిపారు. ఉప్పరపల్లి గ్రామాన్ని తాను సొంత గ్రామంగా భావిస్తానని, గ్రామ ప్రజలతో తనకు ప్రత్యేకమైన అనుబంధం ఉందని పేర్కొన్నారు. యువత నిర్వహించే ఇలాంటి కార్యక్రమాలు గ్రామంలో ఐక్యతను పెంపొందించడంతోపాటు భావితరాలకు మన సంప్రదాయాలను పరిచయం చేస్తాయని అన్నారు. ఉప్పరపల్లిలో జరిగే ప్రజోపయోగ, సేవా, సాంస్కృతిక కార్యక్రమాలకు తనవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో యువత యూత్ క్లబ్ అధ్యక్షుడు తండ



శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నూకల వెంకటేశ్వర్లు, వార్డు సభ్యులు జెనిగల అనిల్, బోనగిరి జ్యోతి రమేష్, కంచ రాజు, పలుస పద్మ వెంకన్న, తండ సంపత్, సీనియర్ నాయకులు బందరు దయాకర్, తండ వెంకటేశ్వర్లు, ఎటురోజు సత్యనారాయణ, నాలాగుర్తి ఉప్పలయ్య, కట్ల పాపయ్య, పబ్బతి సారంగం, శాగంటి రాములు, అడపా రమేష్, టేకుల శ్రీకాంత్, ఎం.డి. షబ్బీర్, గుండా కమలాకర్, కార్తీక్, రాజేష్, అల్లావుద్దీన్, రహీమ్, నగేష్, రాంబాబు, కర్ణాకర్ తదితరులు పాల్గొన్నారు..

# ఇన్‌ఫ్లుయెన్సర్ అనుమానాస్పద మృతి

- సైబర్ వేధింపులు, బెదిరింపుల వల్లే చనిపోయాడని తండ్రి ఫిర్యాదు
- మరో వ్యాపారవేత్త జేసన్ శామ్యూల్‌పై పోలీసులకు ఫిర్యాదు
- చనిపోయే ముందు తన ఆవేదనను వీడియోలో రికార్డ్ చేసిన హరీశ్
- ఆరోపణలను ఖండించిన శామ్యూల్, లైసెన్స్ గురించే ప్రశ్నించానని వెల్లడి



**చెన్నై, వెలుతురు అక్టోబర్ 21 :** సోషల్ మీడియాలో ఆర్థిక సలహాలు ఇస్తూ ఎంతో ప్రాచుర్యం పొందిన యువ ఫైనాన్స్ ఇన్‌ఫ్లుయెన్సర్ వి. హరీశ్ (27) అనుమానాస్పద స్థితిలో మరణించారు. చెన్నై సమీపంలోని ముట్టుకాడు వద్ద అద్దెకు తీసుకున్న విల్లాలో మంగళవారం ఆయన మృతదేహాన్ని గుర్తించారు. 'ఫైనాన్స్ విత్ హరీశ్' పేరుతో ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్‌లో ఐదేళ్లుగా వ్యక్తిగత ఫైనాన్స్, పెట్టుబడులపై కంటెంట్ రూపొందిస్తూ ఆయన 13 లక్షల మందికి పైగా ఫాలోవర్లను సంపాదించుకున్నారు. హరీశ్ మరణం వెనుక తీవ్రమైన సైబర్ వేధింపులు, బెదిరింపులు ఉన్నాయని ఆయన తండ్రి జె. వినాయగం ఆరోపిస్తున్నారు. జెమురియా ఇంక్ అనే వెంచర్ స్టూడియో సీఈఓ జేసన్ శామ్యూల్ తన కుమారుడిని లక్ష్యంగా చేసుకుని పరువు నష్టం కలిగించేలా సోషల్ మీడియా పోస్టులు పెట్టారని, తీవ్ర మానసిక ఒత్తిడికి గురిచేశారని ఆయన పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. అక్టోబర్ 18న హరీశ్ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాడంటూ శామ్యూల్ వీడియోలు, పోస్టులు ప్రచురించాడని తెలిపారు. హరీశ్ సోషల్ మీడియా ఖాతాలను బ్లాక్ చేయిస్తానని, రూ. 3 కోట్లు ఇవ్వాలని బెదిరించాడని, ఈ క్రమంలో పుదుచ్చేరి ముఖ్యమంత్రి, ఓ ఎమ్మెల్యే పేర్లను కూడా ప్రస్తావించాడని ఫిర్యాదులో వివరించారు. చనిపోయే ముందు హరీశ్ ఒక వీడియోను రికార్డ్ చేశారు. ఈ వివాదం తన ప్రతిష్ఠను, పనిని ఎలా దెబ్బతీసిందో అందులో వివరించారు. ఐదేళ్ల తన కష్టాన్ని కొందరు నాశనం చేశారని, తనపై మానసిక వేధింపులకు పాల్పడ్డారని, ఇన్‌కమ్ ట్యాక్స్ పేరుతో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని బెదిరించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వీడియోను తప్పకుండా విడుదల చేయాలని ఆయన కోరారు. శామ్యూల్ ఆరోపణల తర్వాత మెటా సంస్థ హరీశ్ అధికారిక ఖాతాలను డిజేబుల్ చేయగా, ఆయన కొత్తగా ప్రారంభించిన ఖాతాను కూడా తొలగించారు. హరీశ్ మరణవార్త తర్వాత జేసన్ శామ్యూల్ 'ఎక్స్' వేదికగా స్పందించారు. సైబర్ వేధింపుల ఆరోపణలను ఖండించారు. హరీశ్ మృతి పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఫైనాన్స్ సలహాలు ఇచ్చేందుకు హరీశ్‌కు ఉన్న అర్హతలను మాత్రమే తాను ప్రశ్నించానని స్పష్టం చేశారు. సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ) రిజిస్టర్డ్ ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్ లైసెన్స్ లేకుండా, అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఇన్ ఇండియా (ఏఎంఎఫ్ఐ) రిజిస్ట్రేషన్‌ను తప్పుగా చూపిస్తూ సలహాలు ఇస్తున్నారని మాత్రమే తాను అన్నట్లు తెలిపారు. సరైన లైసెన్స్‌తో పనిచేయాలని సూచించానే తప్ప, ఇలాంటి పరిణామం జరుగుతుందని ఊహించలేదని పేర్కొన్నారు. ఈ ఘటనపై కానతూరు పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఘటనా స్థలంలో ఎలాంటి సూసైడ్ నోట్ లభించలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు, హరీశ్ చివరి వీడియో, సోషల్ మీడియా పోస్టులు, సందేశాలు, ఇతర డిజిటల్ ఆధారాలను పోలీసులు పరిశీలిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఈ సంఘటన ఆన్‌లైన్ క్రియేటర్ల మధ్య ఉన్న అర్హతల వివాదాలు, సోషల్ మీడియా వేదికల బాధ్యత, ఆన్‌లైన్ ఘర్షణల తీవ్రత వంటి అంశాలపై చర్చకు దారితీసింది.

# సీజేపీ నేతలకు ఊరట

- విడుదల కానున్న సౌరవ్ దాస్, అశుతోశ్ రాంకా
- ప్రత్యేక ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ కోర్టు ఆదేశాలు జారీ



**న్యూఢిల్లీ, వెలుతురు, అక్టోబర్ 21 :** కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నేతలు సౌరవ్ దాస్, అశుతోశ్ రాంకాకు ఊరట లభించింది. దిల్లీలోని జంతర్ మంతర్ వద్ద అక్టోబర్ 13న జరిగిన నిరసనకు సంబంధించిన కేసులో వారిని విడుదల చేయాలని ప్రత్యేక ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ కోర్టు బుధవారం ఆదేశించింది. ఇరువురి జ్యుడీషియల్ కస్టడీ గడువు ముగియడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. వారి కస్టడీ గడువు ముగియడంతో ముందుగా సౌరవ్ దాస్, అశుతోష్ రాంకాను పోలీసులు ఇవాళ ఎస్‌ఈఎం ఎదుట హాజరుపరిచారు. విచారణ ప్రక్రియలో భాగంగా పూచీకత్తులను కూడా సమర్పించారు. అనంతరం వారిని విడుదల చేయాలని మేజిస్ట్రేట్ ఆదేశాలు జారీ చేశారు. జంతర్ మంతర్ వద్ద అక్టోబర్ 13న జరిగిన నిరసనల సందర్భంగా ఇరువురిని దిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిషేధిత ప్రాంతం లేదా నిరసనలకు అనుమతి లేని ప్రదేశంలోకి ప్రవేశించారని, శాంతిభద్రతలను కాపాడతామని ఇచ్చిన పీస్ బాండ్ నిబంధనల్ని ఉల్లంఘించారన్న ఆరోపణలతో ఈ చర్యలు తీసుకున్నారు. అనంతరం వారిని అక్టోబర్ 14న మేజిస్ట్రేట్ 5 రోజుల జ్యుడీషియల్ కస్టడీకి అప్పగించారు. అక్టోబర్ 19న గడువు ముగియడంతో కస్టడీని మరో రెండు రోజులు పొడిగించారు. ఈ గడువు బుధవారం ముగియడంతో విడుదల ఆదేశాలు వచ్చాయి. ప్లైలేట్ కోర్టును ఆశ్రయించవచ్చని స్పష్టం చేసింది.

# ఘనంగా ఎంపీ గోడం నగేష్ జన్మదిన వేడుకలు

**అదిలాబాద్, అక్టోబర్ 21 (వెలుతురు):** అదిలాబాద్ పార్లమెంట్ సభ్యుడు గోడం నగేష్ జన్మదిన వేడుకలను బుధవారం అదిలాబాద్ పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి అశోక్ ముస్తాపూరే హాజరై కేక్ కట్ చేసి ఎంపీ గోడం నగేష్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అశోక్ ముస్తాపూరే మాట్లాడుతూ.. భగవంతుడి ఆశీస్సులతో గోడం నగేష్ ప్రజాసేవలో ఉన్నత బాధ్యతలు చేపట్టారని పేర్కొన్నారు. గతంలో ఎమ్మెల్యేగా, మంత్రిగా ఈ ప్రాంత అభివృద్ధికి నిరంతరం కృషి చేసిన ఆయన, ప్రస్తుతం పార్లమెంట్ సభ్యుడిగా ఆదిలాబాద్ ప్రాంత అభివృద్ధికి పలు కార్యక్రమాలు చేపడుతున్నారని అన్నారు. రానున్న రోజుల్లోనూ మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలతో ఈ ప్రాంతాన్ని ప్రగతిపథంలో నడిపించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానంద్‌తో పాటు రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి నాయకులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని



ఎంపీ గోడం నగేష్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అశోక్ ముస్తాపూరే కార్యక్రమానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

# పంజాబ్‌లో పాలనకు ఉద్యోగుల షాక్



- 3 లక్షల మంది మూకుమ్మడి సెలవు..
- రెవెన్యూ, రిజిస్ట్రేషన్లు, పౌర సేవలు అందించే కేంద్రాల్లో నిలిచిన కార్యకలాపాలు
- డీఏ బకాయిలు, ఓపీఎస్ పునరుద్ధరణ, కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణే ప్రధాన డిమాండ్లు

**చండీగఢ్, వెలుతురు అక్టోబర్ 21**

పంజాబ్‌లో ప్రభుత్వ ఉద్యోగులు చేపట్టిన మెరుపు సమ్మెతో రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పరిపాలన తీవ్రంగా స్తంభించింది. పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, పాత పెన్షన్ విధానాన్ని (ఓపీఎస్) పునరుద్ధరించాలని, కాంట్రాక్ట్ సిబ్బందిని క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ సుమారు 3 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులు బుధవారం నుంచి మూకుమ్మడి సెలవులోకి వెళ్లారు.

ఉద్యోగ సంఘాల ఐక్య వేదిక పిలుపుతో సచివాలయ స్థాయి సిబ్బంది నుంచి జిల్లా, తాలూకా కార్యాలయాల అధికారులు, క్లర్కులు వరకు విధులను బహిష్కరించారు. దీంతో రెవెన్యూ, రిజిస్ట్రేషన్లు, పౌర సేవలు అందించే కేంద్రాల్లో కార్యకలాపాలు నిలిచిపోయాయి. వివిధ పనుల కోసం కార్యాలయాలకు వచ్చిన సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

### రవాణా రంగానికీ సమ్మె సెగ

ప్రభుత్వ ఉద్యోగుల ఆందోళనకు రవాణా రంగ కార్మికులు మద్దతు ప్రకటించడంతో పరిస్థితి మరింత తీవ్రంగా మారింది. పంజాబ్ రోడ్‌వేస్, పీఆర్‌టీసీ బస్సులు డిపోలకే పరిమితం కావడంతో కీలక బస్టాండ్లలో రాకపోకలు నిలిచిపోయాయి. బస్సుల కోసం ఎదురుచూసిన ప్రయాణికులు, విద్యార్థులు, ఉద్యోగులు తీవ్ర అవస్థలు పడ్డారు.

### ఆసుపత్రుల్లోనూ సేవలకు ఆటంకం

సమ్మె ప్రభావం ప్రభుత్వ ఆసుపత్రులపైనా పడింది. అత్యవసర వైద్య సేవలను కొనసాగిస్తున్నప్పటికీ, సాధారణ పరిపాలనా కార్యకలాపాలు మందగించాయి. దీంతో ప్రభుత్వ యంత్రాంగంపై సమ్మె ప్రభావం స్పష్టంగా కనిపించింది.

### సమస్యలు పరిష్కరించకుంటే నిరవధిక సమ్మె

తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారంలో ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తోందని ఉద్యోగ సంఘాల నేతలు ఆరోపించారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి డీఏ బకాయిలు, ఓపీఎస్ పునరుద్ధరణ, కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణపై స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకుంటే సమ్మెను నిరవధికంగా కొనసాగిస్తామని హెచ్చరించారు.

### చర్చలకు ప్రభుత్వం సన్నాహాలు

మరోవైపు సమ్మెతో ఏర్పడిన పరిస్థితిని చక్కదిద్దేందుకు ప్రభుత్వం ఉద్యోగ సంఘాల నేతలతో చర్చలు జరిపేందుకు సన్నాహాలు చేస్తోంది. చర్చల ద్వారా సమస్యకు పరిష్కారం కనుగొని పరిపాలనను సాధారణ స్థితికి తీసుకురావాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోంది.

# అమరుల త్యాగాలతోనే రాష్ట్రంలో శాంతిభద్రతలు

- పోలీసు సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం
- కొత్త నేరాలను ఎదుర్కొనేందుకు నైపుణ్యాలు పెంచుకోవాలి
- నిజాయతీగా సేవ చేయడమే అమరులకు నిజమైన నివాళి: డీజీపీ






**హైదరాబాద్, వెలుతురు, అక్టోబర్ 21:**

ప్రజల భద్రత కోసం విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని డిజిపి సి.వి. ఆనంద్ అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా గోషామహల్ స్టేడియంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, తీవ్రవాదం, నక్సలిజం, మావోయిజం, ఇతర అసాంఘిక శక్తులను ఎదుర్కొనే క్రమంలో ప్రాణాలు కోల్పోయిన పోలీసులకు నివాళులర్పించి, వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

తెలంగాణ ఉద్యమాల గడ్డ అని, నక్సలైట్ల హింసను ఎదుర్కొనే క్రమంలో వందలాది మంది పోలీసులు ప్రాణత్యాగం చేశారని గుర్తుచేశారు. వారి ధైర్యసాహసాల ఫలితంగానే రాష్ట్రంలో శాంతిభద్రతలు మెరుగుపడి అభివృద్ధి సాధ్యమవుతోందన్నారు. కర్రెగుట్టల వంటి మారుమూల ప్రాంతాల్లో జాతీయ జెండాను ఎగురవేయడం పోలీసుల పట్టుదలకు నిదర్శనమన్నారు. 1997లో తాను నిజామాబాద్ ఎస్పీగా పనిచేసిన సమయంలో 126 మంది పోలీసులు అమరులైన ఘటనను గుర్తుచేస్తూ, మందుపాతరలు, కాల్పులు, పోలీసు సిబ్బందిపై దాడుల్లో పలువురు ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. ఈ ఏడాది దేశవ్యాప్తంగా విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన 154 మంది పోలీసుల్లో తెలంగాణకు చెందిన ఏఎస్ఐ దేవ్‌సింగ్, కానిస్టేబుళ్లు ఎంపల్లి ప్రమోద్‌కుమార్, శీలం కరుణాకర్ ప్రాణ త్యాగం చేశారన్నారు.

పోలీసు కుటుంబాల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని, అమరవీరుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా, ఇతర ప్రయోజనాలు సకాలంలో అందేలా చూడాలని అన్నారు. పండుగలు, సెలవు రోజుల్లోనూ ప్రజల భద్రత కోసం పోలీసులు విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. పోలీసు పిల్లలకు నాణ్యమైన విద్య అందించేందుకు ముఖ్యమంత్రి యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ (వైఐపీఎస్)ను ప్రారంభించారని, ప్రస్తుతం సుమారు 350 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. మంచిరేవులలో శాశ్వత క్యాంపస్ ఏప్రిల్ నాటికి పూర్తయితే సుమారు 720 మంది విద్యార్థులకు విద్య అందించే అవకాశం ఉంటుందని, పోలీసు సంక్షేమ కార్యక్రమాలను మరింత వేగవంతం చేయాలని ముఖ్యమంత్రిని కోరుతున్నట్లు తెలిపారు.

మాదకద్రవ్యాలు, సైబర్ నేరాలు, ఆహార కల్తీ, రోడ్డు ప్రమాదాలు, వ్యవస్థీకృత నేరాలు కొత్త సవాళ్లుగా మారుతున్నాయని, వాటిని ఎదుర్కొనేందుకు సిబ్బంది నిరంతరం నైపుణ్యాలు పెంపొందించుకుని, ఇన్ సర్వీస్ శిక్షణకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. ఆధునిక నేరాల నియంత్రణతోపాటు ప్రాథమిక, విజిబుల్ పోలీసింగ్‌ను కొనసాగించాలని స్పష్టం చేశారు. సైబర్ నేరాల నియంత్రణకు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో, మాదకద్రవ్యాల నిర్మూలనకు ఈగల్ ఫోర్స్, ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి టి-మార్స్, ఆహార కల్తీ నియంత్రణకు తెలంగాణ ఫుడ్ సేఫ్టీ విభాగం ద్వారా చర్యలు చేపడుతున్నట్లు వివరించారు.

తెలంగాణ జనాభాలో కేవలం 0.3 శాతం మందికే పోలీసు యూనిఫాం ధరించి ప్రజలకు సేవ చేసే అవకాశం లభిస్తుందని డీజీపీ పేర్కొన్నారు. ప్రజల సమస్యలకు చట్టప్రకారం, నిజాయతీతో పరిష్కారం చూపాలని, సేవాభావంతో విధులు నిర్వర్తించాలని సిబ్బందికి పిలుపునిచ్చారు. చట్టాన్ని సమర్థంగా అమలు చేస్తూ ప్రజలకు నిబద్ధతతో సేవలందించడమే పోలీసు అమరవీరులకు అర్పించే నిజమైన నివాళి అని స్పష్టం చేశారు.

## 19 మున్సిపాలిటీల్లో నామినేషన్ల గడువు పెంపు

### సుప్రీం ఆదేశం



**న్యూఢిల్లీ, వెలుతురు అక్టోబర్ 21:** ఏపీ ఎన్నికలపై సుప్రీంకోర్టు సంచలన నిర్ణయం తీసుకుంది. హింస జరిగిన 19 మున్సిపాలిటీల్లో నామినేషన్ల గడువు పెంచాలని సుప్రీం ఆదేశం జారీ చేసింది. వైసీపీ అభ్యర్థులకు భద్రత కల్పించాలని ఎస్పీలకు ఆదేశం జారీ చేసింది. నామినేషన్ల గడువుపై ఈరోజే నిర్ణయం తీసుకోవాలని సూచించింది. జిల్లా కేంద్రాల్లో కలెక్టర్లు నామినేషన్ తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. ఈనెల 25 వరకు అభ్యర్థుల తుది జాబితా ప్రకటించొద్దని ఆదేశం ఇచ్చింది.

## నామినేషన్ కేంద్రాలలో ఏర్పాట్లు పటిష్టంగా ఉండాలి

**రాయచోటి, వెలుతురు అక్టోబరు 21:** అన్నమయ్య జిల్లాలోని మదనపల్లెలోని జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన జెడ్పీటీసీ నామినేషన్ కేంద్రాన్ని జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా నామినేషన్ల స్వీకరణకు అవసరమైన ఏర్పాట్లను సమీక్షించి, అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు, హెల్ప్‌డెస్క్ సిబ్బందికి స్పష్టమైన విధులు కేటాయించాలని, రద్దీ నియంత్రణకు చర్యలు చేపట్టాలని సూచించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం నామినేషన్ల ప్రక్రియను పారదర్శకంగా, సజావుగా నిర్వహించాలని, పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ లక్ష్మీపతి, మదనపల్లె తహసీల్దార్ మాధవి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## పలు చోట్ల వైకాపా నేతల గృహ నిర్బంధం

**కడప, వెలుతురు అక్టోబరు 21:** ఎంపీటీసీ, జెడ్పీటీసీ నామినేషన్ల వేళ వైసీపీ నేతల ను పోలీసులు గృహ నిర్బంధంలో పెట్టారు . ప్రొద్దుటూరులో ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ హౌస్ అరెస్ట్ చేసారు. బద్వేల్ ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధా, పులివెందుల వేంపల్లిలో సతీష్ రెడ్డిని హౌస్ అరెస్ట్ చేసారు. వి.ఎన్.పల్లె వెళ్తున్న కమలా పురం వైసీపీ ఇంచార్జ్ నరేన్ రెడ్డిని అడ్డుకున్నారు. నామినేషన్ల ప్రక్రియలో పాల్గొనేందుకు వెళ్తుండగా అడ్డుకున్నారు. కడప జిల్లా ఆర్టీఐ జనరల్ సెక్రటరీ భూమిరెడ్డి నారాయణరెడ్డి సతీమణి భూమిరెడ్డి భారతి, సోమిరెడ్డిపల్లె -2 ఎంపీటీసీ స్థానానికి నామినేషన్ దాఖలు చేసేందుకు వెళ్తుండగా టీడీపీ నాయకులు అడ్డుకొని నామినేషన్ చించివేసారు.

# గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ బరిలో కవిత పార్టీ

**హైదరాబాద్, వెలుతురు అక్టోబరు 21 :**



తెలంగాణ రక్షణ సేన ప్రత్యక్ష ఎన్నికల సమరానికి తొలిసారిగా శంఖారావం పూరించింది. ఉమ్మడి వరంగల్ - ఖమ్మం - నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ అభ్యర్థిగా ఉద్యమకారుడు, విద్యావేత్త డాక్టర్ నలమాస శ్రీకాంత్ గౌడ్‌ను పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవిత అధికారికంగా ప్రకటించారు. దసరా పర్వదినం శుభ ముహూర్తాన్ని పురస్కరించుకుని పార్టీ తరఫున ప్రత్యక్ష ఎన్నికల బరిలోకి దిగుతున్న మొట్టమొదటి అభ్యర్థిని ఖరారు చేస్తూ ఆమె నిర్ణయం తీసుకున్నారు. పార్టీ ఆవిర్భావం తర్వాత ఎదుర్కొంటున్న తొలి ఎన్నిక కావడంతో ఈ స్థానాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని, బలమైన విద్యా నేపథ్యం ఉన్న ఉద్యమ నేతను బరిలో నిలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని, గ్రౌండ్ లెవల్ సమన్వయాన్ని వేగవంతం చేసేందుకు పార్టీ సంస్థాగత యంత్రాంగాన్ని కూడా రంగంలోకి దించారు. ఈ ఎన్నికల ప్రక్రియను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించేందుకు, సమన్వయం చేసేందుకు స్టేట్ పార్టీ అబ్జర్వర్, ఎన్నికల కో-ఆర్డినేటర్‌గా పార్టీ సీనియర్ నాయకుడు సయ్యద్ ఇస్మాయిల్‌ను కల్వకుంట్ల కవిత నియమించారు. పట్టభద్రుల సమస్యలు, నిరుద్యోగ యువత ఆకాంక్షలను ప్రధాన ఎజెండాగా తీసుకుని ఎన్నికల ప్రచారాన్ని ముందుకు తీసుకెళ్లేలా పక్కా కార్యాచరణను రూపొందించాలని ఇస్మాయిల్‌కు బాధ్యతలు అప్పగించారు. అభ్యర్థిగా ఎంపికైన డాక్టర్ నలమాస శ్రీకాంత్ గౌడ్ సుదీర్ఘమైన ఉద్యమ, విద్యా నేపథ్యం కలిగిన నాయకుడు. దసరా పండుగ శుభసందర్భంగా శ్రీకాంగ్ గౌడ్‌ను తమ పార్టీ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా కవిత ప్రకటించారు. ఈ ఎమ్మెల్సీ స్థానంలో ఎన్నికల సమన్వయం, పర్యవేక్షణ కోసం స్టేట్ పార్టీ అబ్జర్వర్‌గా సయ్యద్ ఇస్మాయిల్‌ను నియమించినట్లు కవిత తెలిపారు. ఈ ప్రకటనతో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కవిత పార్టీ పోటీకి సిద్ధమైనట్లు స్పష్టం చేసింది. అభ్యర్థి ప్రకటనతో పట్టభద్రుల ఎన్నికల ప్రచారాన్ని మరింత వేగవంతం చేయాలని పార్టీ నిర్ణయించింది. ఉమ్మడి వరంగల్ జిల్లా నర్సింహులపేట మండలం కౌసల్యాదేవిపల్లికి చెందిన ఆయన కాకతీయ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పూర్తి చేశారు. మలిదశ తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో విద్యార్థి దశ నుంచే చురుకైన పాత్ర పోషించారు. తెలంగాణ జాగృతి సంస్థ ప్రారంభమైన నాటి నుంచి కల్వకుంట్ల కవిత వెన్నంటి నడిచిన ఆయన.. పార్టీ అధికార ప్రతినిధిగా టీవీ చర్చల్లో, ప్రజా సంఘాల వేదికలపై సమర్థవంతంగా గళం వినిపిస్తూ ప్రజల్లో విశేష గుర్తింపు పొందారు. బహుజనుల గొంతుకగా నిలుస్తూ నిరంతరం ప్రజా ఉద్యమాలకు రూపకల్పన చేస్తున్న కల్వకుంట్ల కవిత.. అదే సంప్రదాయాన్ని తొలి ఎన్నికల అభ్యర్థి ఎంపికలోనూ కొనసాగించారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన ఉన్నత విద్యావంతుడికి ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా పార్టీ విధానాలను చేతల్లో చాటిచెప్పారు. తెలంగాణ రక్షణ సేన నేరుగా ఎన్నికల క్షేత్రంలోకి దిగడం, అందునా విద్యావంతులు, నిరుద్యోగులు నిర్ణయాత్మక శక్తిగా ఉన్న పట్టభద్రుల స్థానాన్ని ఎంచుకోవడంతో వరంగల్ - ఖమ్మం - నల్గొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ పోరు ఆసక్తికరంగా మారింది.

# నవంబర్ 1 నుంచి కాలింగ్ నేమ్ ప్రెజెంటేషన్

**న్యూఢిల్లీ, వెలుతురు అక్టోబర్ 21:** భారత్‌లో మొబైల్ వినియోగదారులకు తెలియని నంబర్ల నుంచి వచ్చే కాల్స్‌ను గుర్తించడం మరింత సులభం కానుంది. 2026 నవంబర్ 1 నుంచి మొబైల్ ఫోన్లలో కాల్ చేసే వ్యక్తి పేరు కనిపించేలా కాలింగ్ నేమ్ ప్రెజెంటేషన్ వ్యవస్థను తప్పనిసరి చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు అందించిన సమాచారం వెల్లడిస్తోంది. ఈ విధానం ద్వారా ఫోన్ నంబర్‌తో పాటు కాల్ చేస్తున్న వ్యక్తి పేరు కూడా స్క్రీన్‌పై కనిపిస్తుంది. దీంతో వినియోగదారులు గుర్తు తెలియని కాల్స్‌ను సులభంగా గుర్తించడంతో పాటు, మోసపూరిత కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండేందుకు అవకాశం ఉంటుంది. ప్రస్తుతం ఫోన్‌కు కాల్ వచ్చినప్పుడు సాధారణంగా ఫోన్ నంబర్ మాత్రమే కనిపిస్తుంది. ఆ నంబర్‌ను మనం కాంటాక్ట్స్‌లో సేవ్ చేసుకుంటేనే మనం పెట్టుకున్న పేరు కనిపిస్తుంది. అయితే కొత్తగా అమలు చేయనున్న అఔంఖ విధానంలో టెలికాం ఆపరేటర్ల వద్ద నమోదైన చందాదారుల వివరాల ఆధారంగా కాల్ చేస్తున్న వ్యక్తి పేరు కూడా కనిపిస్తుంది. ఈ విధానాన్ని అమలు చేయాలని కేంద్ర టెలికమ్యూనికేషన్స్ విభాగం టెలికాం సేవల సంస్థలను ఆదేశించినట్లు సమాచారం. తొలుత 4ఉ, 5ఉ వంటి నెట్‌వర్క్‌లలో ఈ సేవను అందుబాటులోకి తీసుకురానున్నారు. 2ఉ, 3ఉ నెట్‌వర్క్‌లు, ల్యాండ్‌లైన్ కనెక్షన్లకు సంబంధించి అమలు విధానాన్ని ప్రత్యేకంగా పరిశీలించనున్నారు. అఔంఖ విధానంలో ఫోన్‌కు ఇన్‌కమింగ్ కాల్ వచ్చినప్పుడు నంబర్‌తో పాటు కాల్ చేస్తున్న వ్యక్తి పేరు కూడా స్క్రీన్‌పై కనిపిస్తుంది. ఈ ప్రక్రియలో కొన్ని అంశాలను తెలుసుకోవాలి. కాంటాక్ట్స్‌లో నంబర్ ఉంటే: ఫోన్‌లో ఇప్పటికే సేవ్ చేసుకున్న పేరు కనిపిస్తుంది. నంబర్ సేవ్ చేయకపోతే: టెలికాం ఆపరేటర్ వద్ద నమోదైన చందాదారుడి పేరు కనిపిస్తుంది. విదేశాల నుంచి వచ్చే కాల్స్: స్క్రీన్‌పై అని కనిపిస్తుంది.

ఈ వ్యవస్థ సక్రమంగా పనిచేయడానికి ప్రతి టెలికాం సంస్థ తన వినియోగదారుల పేర్లు, ఫోన్ నంబర్లకు సంబంధించిన డేటాబేస్‌ను నిర్వహించాల్సి ఉంటుంది. కాల్ అందుకునే వ్యక్తి ఉపయోగిస్తున్న టెలికాం సంస్థ అవసరమైన వివరాలను సంబంధిత డేటాబేస్ నుంచి సేకరించి స్క్రీన్‌పై ప్రదర్శిస్తుంది. కొత్త వ్యవస్థలో వినియోగదారుల వ్యక్తిగత సమాచార భద్రతకు కూడా ప్రాధాన్యం ఇచ్చినట్లు ఆదేశాల్లో పేర్కొన్నట్లు సమాచారం. కాల్ సమయంలో పేరు తెలుసుకునేందుకు ఉపయోగించే సమాచారాన్ని కాల్ ముగిసిన తర్వాత నిల్వ చేయకూడదనే నిబంధనను అమలు చేయనున్నారు. అలాగే, కాలింగ్ లైన్ ఐడెంటిఫికేషన్ రిస్ట్రిక్షన్ ) సేవను ఉపయోగిస్తూ తమ నంబర్ వివరాలను ఇతరులకు కనిపించకుండా చేసుకున్న చందాదారులకు ఈ వ్యవస్థ నుంచి మినహాయింపు ఉంటుంది. అలాంటి వినియోగదారుల పేర్లు ద్వారా ప్రదర్శించరు. వ్యాపార సంస్థలు, బల్క్ కనెక్షన్ల వినియోగదారులకు టెలికాం సంస్థల వద్ద నమోదైన పేరుకు బదులుగా వేరే వ్యాపార పేరును ప్రదర్శించుకునే అవకాశం కల్పించవచ్చు. అయితే, ఆ పేరుకు సంబంధించి రిజిస్టర్డ్ ట్రేడ్‌మార్క్ లేదా వస్తు సేవల పన్ను పోర్టల్‌లో నమోదైన వ్యాపార పేరు వంటి ఆధారాలు ఉండాలి. వ్యాపార సంస్థలు కోరుకున్న పేరును ప్రదర్శించే ముందు సంబంధిత టెలికాం ఆపరేటర్లు ఆ పేరును, దానికి సంబంధించిన పత్రాలను పరిశీలించాల్సి ఉంటుంది. ఇప్పటికే నమోదైన వ్యాపార పేరును మార్చుకోవాలనుకునే వారు తమ టెలికాం సేవల సంస్థకు అభ్యర్థన సమర్పించాలి. గుర్తు తెలియని నంబర్ల నుంచి వచ్చే కాల్స్‌ను గుర్తించడం, మోసపూరిత కాల్స్‌ను ఎదుర్కోవడంలో వినియోగదారులకు సహాయపడటం ఈ వ్యవస్థ ప్రధాన ఉద్దేశం.

# జగన్ వేసిన ట్రాప్‌లో చంద్రబాబు చిక్కుకున్నారా?

**పులివెందుల, వెలుతురు అక్టోబరు 21:**





స్థానిక సంస్థల ఎన్నికల్లో జరుగుతున్న ఘటనలు చూస్తుంటే టీడీపీ, వైసీపీలు రెండూ ఒకే బాట పయనిస్తున్నాయి. అరాచకాలలో ఒకరిని మించి మరొకరు అన్నట్లు వ్యవహరిస్తున్నారు. గతంలో వైఎస్ జగన్ పాలనపై విమర్శలు చేసే చంద్రబాబు నేడు జరుగుతున్న పరిస్థితులను అవతలి వారిపైకి నెట్టడం సమర్థనీయం కాదు. ఎన్నికలంటే శాంతిభద్రతల సమస్య తలెత్తకూడదు. ఇప్పుడు జరుగుతున్న, జరిగిన పరిణామాలకు కూటమి ప్రభుత్వం బాధ్యత వహించాల్సి ఉంటుంది. అలాగే రాష్ట్ర ఎన్నికల కమిషన్ కూడా చేష్టలుడిగి చూస్తున్నట్లు కనిపిస్తుంది. ఇంత ఉదాసీన వైఖరి కారణంగా ఆంధ్రప్రదేశ్‌లో ఇక ఏ ప్రభుత్వం వచ్చినా ఇవే పరిస్థితులు తలెత్తక మానవన్న కామెంట్స్ రాజకీయ విశ్లేషకులు కూడా చేస్తున్నారు. రాజకీయాలు చూడండి. అయితే ఇప్పుడు ఏపీలో మాత్రం అధికార పార్టీది, విపక్ష పార్టీది ఒకే దారి అన్నట్లు వ్యవహరిస్తున్నాయి. ఇప్పుడు వైసీపీ బాధిత పార్టీగా కనిపించవచ్చు. కానీ అదే తమ పాలనలో జగన్ ప్రభుత్వం అవలంబించిన చర్యలేవిటి? అని చంద్రబాబు ప్రశ్న కూడా అందరూ ఆలోచించాల్సిన విషయమే. అలాగే ఇదే విమర్శ రేపు చంద్రబాబు కూడా ఎదుర్కొనే పరిస్థితులు రావచ్చు. నాడు కుప్పం నియోజకవర్గంలో జగన్ చేసిన పని, నేడు పులివెందులలో టీడీపీ చేసింది. ఇందులో తప్పు వెతుక్కోవడానికి ఇద్దరిలోనూ వెతికినా కనిపించవు. కానీ జనం మాత్రం వీటిని గమనిస్తూనే ఉంటారన్న విషయాన్ని మాత్రం వైసీపీ, టీడీపీలు మర్చి పోకూడదు. ప్రజాస్వామ్యం మనుగడ కొనసాగించాలంటే రెండు పార్టీల అధినేతలు ఎవరికి వారే ఆత్మవిమర్శలు చేసుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. స్థానిక సంస్థల ఎన్నికలను టీడీపీ, వైసీపీలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. అధికారంలో ఉన్న కూటమి పార్టీకి అత్యధిక స్థానాల్లో గెలుపు సాధించుకోవాలని సహజంగానే భావిస్తుంది. అదే సమయంలో వైసీపీ స్థానిక సంస్థల ఎన్నికల్లో కొంత బలోపేతం అయితే రానున్న సాధారణ ఎన్నికలకు పుంజుకుంటామని భావన కారణంగానే ఈ రకమైన పరిస్థితులు ఏర్పడ్డాయన్నది కాదనలేని వాస్తవం. స్థానిక సంస్థల ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలి. అందులో తప్పులేదు. కానీ హింసా రాజకీయాలకు స్వస్తి పలకాలి. అనుభవమున్న చంద్రబాబుకు ఇది ఎంత మాత్రం అభిలషణీయం కాదు. ఒకరకంగా జగన్ వేసిన ట్రాప్‌లో చంద్రబాబు చిక్కుకున్నారా? అన్న అనుమానం కూడా చాలా మంది సీనియర్ నేతల్లో వ్యక్తమవుతుంది. మొత్తం మీద ఆంధ్రప్రదేశ్ లో స్థానిక సంస్థల ఎన్నికల్లో మున్సిపల్ నామినేషన్ల సందర్భంగానే చూశాం. ఇక జడ్పీటీసీ, పంచాయతీ ఎన్నికల్లో ఇంకెంత రగడ చూడాలో.. .దేవుడా ఏపీకి నీవే దిక్కు. అని అనుకోవడం తప్ప చేసేదేమీ లేదు

### వ్యూహాలు ప్రతివ్యూహాలతో

ఆంధ్రప్రదేశ్ స్థానిక సంస్థల ఎన్నికలలో వైసీపీ అధినేత వైఎస్ జగన్ పాచికలు పారినట్లు కనపడుతుందివైఎస్ మోహన్ రెడ్డి వ్యూహాలు ప్రతివ్యూహాలతో సర్వసన్నద్ధమవుతున్నారు. కూటమి ప్రభుత్వానికి గట్టి పోటీ ఇచ్చేందుకు ఆయన వేస్తున్న అడుగులు రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేపుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో టీడీపీ స్థానిక సంస్థల ఎన్నికలకు దూరంగా ఉంది. దీంతో తాడిపత్రి మున్సిపాలిటీ తప్పించి అన్నింటా వైసీపీ విజయం సాధించింది. అయితే ఇప్పుడు టీడీపీ పాలనపై వ్యతిరేకత తెచ్చేందుకు, తమ పార్టీపై సానుభూతి కురిసేందుకు జగన్ వేసిన వ్యూహం సక్సెస్ అయినట్లే కనపడుతుంది. ప్రతి చోట ఖచ్చితంగా నామినేషన్లు వేయాలని, ఏకగ్రీవం జరిగితే వచ్చే ఎన్నికల్లో టిక్కెట్ కూడా ఇవ్వనని జగన్ నాడు చేసిన హెచ్చరికలను వేరే విధంగా చూసిన వారికి ఇప్పుడు అసలు విషయం అర్థమవుతుంది. జగన్ తన ఎత్తుగడలో భాగంగనే నామినేషన్లు వేయించి అభ్యర్థులను బరిలోకి దిగితే శాంతిభద్రతలు అదుపు తప్పి టీడీపీ పాలనపై వ్యతిరేకత ఏర్పడుతుందని అంచనా నిజమవుతుంది. గత రెండు రోజులుగా జరుగుతున్న నామినేషన్ల పర్వం చూస్తేనే ఇది ఎవరికైనా ఇట్టే అర్థమవుతుంది. మ్యాప్‌లు చూడండి ప్రతి సీటులోనూ పోటీకి... గత ఎన్నికల్లో జరిగిన పొరపాట్లను పునరావృతం కానివ్వకుండా, ఈసారి ప్రతి స్థానంలోనూ వైసీపీ అభ్యర్థిని పోటీకి నిలపాలని జగన్ పార్టీ శ్రేణులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఎక్కడా అధికార కూటమికి ఏకగ్రీవాలు చేసుకునే అవకాశం ఇవ్వకూడదని, ఒకవేళ ఏదైనా నియోజకవర్గంలో ఏకగ్రీవమైతే దానికి స్థానిక నాయకత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. కూటమి పార్టీలైన టీడీపీ, జనసేన, బీజేపీల మధ్య సీట్ల సర్దుబాటు చర్చలు పూర్తయి ఏ పార్టీ ఎక్కడ పోటీ చేయాలో అధికారికంగా ప్రకటించినప్పటికీ... వైఎస్ జగన్ మాత్రం ఒక అడుగు ముందే వేసి మొదటి విడతగా 27 మంది అభ్యర్థులతో కూడిన జాబితాను కూడా విడుదల చేశారు. గ్రౌండ్ రిపోర్టుల ఆధారంగా ప్రజాదరణ కలిగిన బలమైన అభ్యర్థులను ఎంపిక చేస్తూ కొత్త ఎత్తుగడలతో ముందుకు వెళ్తున్నారు. ఎన్నికల సమాచారం చూడండి.. ఎన్నికల సమయంలో అధికార యంత్రాంగం లేదా పోలీస్ వ్యవస్థల నుంచి ఎదురయ్యే ఒత్తిళ్లను, అక్రమాలను తట్టుకునేందుకు వీలుగా నియోజకవర్గాల వారీగా ప్రత్యేక లీగల్ సెల్స్, మీడియా సెల్స్‌ను ఏర్పాటు చేశారు. క్షేత్రస్థాయిలో ఏవైనా అధికార దుర్వినియోగ ఘటనలు జరిగితే వాటిని రికార్డ్ చేయడానికి 'డిజిటల్ డైరీ' విధానాన్ని తీసుకువచ్చారు. ఈ స్థానిక ఎన్నికలను కేవలం ఒక పోటీలా కాకుండా, మొన్నటి అసెంబ్లీ ఎన్నికల ఓటమి తర్వాత పార్టీని గ్రామ స్థాయి నుండి తిరిగి బలోపేతం చేసుకునే ఒక ప్రక్రియగా జగన్ భావిస్తున్నారు. అందుకోసం రీజనల్ కో-ఆర్డినేటర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లతో వరుస సమీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ ఎన్నికల్లో అధికార పార్టీ ఆగడాలు చూసి క్యాడర్ లోనూ కసి పెరుగుతుందని, అది తమకు వచ్చే సాధారణ ఎన్నికల్లో అనుకూలంగా మారుతుందని జగన్ అంచనా వేశారు. అనుకున్నట్లుగానే క్యాడర్ ఏకతాటిపైకి రావడంతో జగన్ పాచిక పారినట్లయింది. అధికార కూటమి సీట్ల సర్దుబాటు పూర్తి చేసుకుని పటిష్టంగా ఉన్న నేపథ్యంలో, జగన్ ముందస్తు వ్యూహాలు,ఒంటరి పోరాటం క్షేత్రస్థాయిలో ఎంతవరకు ఓటర్లను ఆకర్షిస్తాయనే దానిపైనే ఆయన "పాచిక" సక్సెస్ ఆధారపడి ఉంటుంది. నామినేషన్లు వేయకుండా అడ్డుకుంటే అది తమకు కలసి వస్తుందని అంచనా వేస్తున్నారు జగన్.

# హైదరాబాద్ వేదికగా అక్టోబర్ 25న 'కె-హార్మనీ ఫెస్టా'

## సాంస్కృతిక మార్పిడితో పర్యాటక రంగానికి ప్రోత్సాహం: మంత్రి జూపల్లి




**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 21:**

భారత్-దక్షిణ కొరియా దేశాల మధ్య సాంస్కృతిక సంబంధాలను మరింత బలోపేతం చేయడంతోపాటు, ఇరు దేశాల ప్రజల మధ్య స్నేహభావం, పరస్పర అవగాహన పెంపొందించేందుకు అంతర్జాతీయ సాంస్కృతిక ఉత్సవాలు దోహదపడతాయని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. తెలంగాణ గొప్ప చారిత్రక వారసత్వం, విభిన్న కళారూపాలు, సంప్రదాయాలను అంతర్జాతీయ వేదికపై పరిచయం చేసేందుకు ఇటువంటి కార్యక్రమాలు మంచి అవకాశాన్ని కల్పిస్తాయని పేర్కొన్నారు.

కొరియన్ కల్చరల్ సెంటర్ ఇండియా ఆధ్వర్యంలో, తెలంగాణ ప్రభుత్వ సహకారంతో అక్టోబర్ 25న హైదరాబాద్‌లోని శిల్పకళావేదికలో 'కె-హార్మనీ ఫెస్టా-2026' నిర్వహించనున్నారు. భారత్, దక్షిణ కొరియా దేశాల మధ్య సాంస్కృతిక మార్పిడిని ప్రోత్సహించాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్న ఈ ఉత్సవం, ఇరు దేశాల కళలు, సంప్రదాయాలను ఒకే వేదికపైకి తీసుకురానుంది.

భారతదేశం భిన్న సంస్కృతులు, సంప్రదాయాలకు నిలయమని, తెలంగాణ సంస్కృతి తనదైన కళారూపాలు, జానపద సంప్రదాయాలు, పండుగలతో ప్రత్యేక గుర్తింపు పొందిందని మంత్రి పేర్కొన్నారు. తెలంగాణకు చెందిన పేరిణి నృత్యం, డప్పుల దరువుతో పాటు ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు ఈ ఉత్సవంలో ప్రదర్శించనుండటం రాష్ట్ర కళా వైభవాన్ని ప్రపంచానికి పరిచయం చేయడానికి దోహదపడుతుందని తెలిపారు.

హైదరాబాద్ చారిత్రక వారసత్వం, సాంస్కృతిక వైవిధ్యంతో వివిధ దేశాల ప్రజలను ఆకర్షిస్తున్న నగరమని జూపల్లి కృష్ణారావు అన్నారు. ఇటువంటి అంతర్జాతీయ కార్యక్రమాల నిర్వహణతో హైదరాబాద్ సాంస్కృతిక కేంద్రంగా మరింత గుర్తింపు పొందడంతోపాటు, తెలంగాణ పర్యాటక రంగానికి కొత్త అవకాశాలు ఏర్పడతాయని పేర్కొన్నారు.

తెలంగాణ చారిత్రక కట్టడాలు, వారసత్వ సంపద, జానపద కళలు, సంప్రదాయ ఉత్సవాలను అంతర్జాతీయ స్థాయిలో ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి తెలిపారు. సాంస్కృతిక మార్పిడి కార్యక్రమాలు కళాకారులకు కొత్త అవకాశాలను కల్పించడంతోపాటు, పర్యాటక రంగ అభివృద్ధికి, ప్రజల మధ్య స్నేహ సంబంధాల బలోపేతానికి దోహదపడతాయని అన్నారు.

ఈ ఉత్సవంలో కొరియా సంప్రదాయ కళలు, సంగీతం, తైక్వాండో ప్రదర్శనలతోపాటు ఆధునిక సంగీత కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ప్రముఖ కె-పాప్ బృందం ఎన్‌టీఎక్స్ (టీమ్) ప్రత్యేక ప్రదర్శన ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. కొరియా సంప్రదాయ, సమకాలీన సంస్కృతిని పరిచయం చేసే కార్యక్రమాలతోపాటు తెలంగాణ కళారూపాల ప్రదర్శనలు ప్రేక్షకులను అలరించనున్నాయి.

## దసరా వేడుకల్లో స్పీకర్



**వికారాబాద్ జిల్లా, వెలుతురు అక్టోబర్ 21:**

వికారాబాద్ శాసనసభ్యులు గడ్డం ప్రసాద్ కుమార్ పాల్గొనడంతో పండుగ వాతావరణం మరింత ఉత్సాహభరితంగా మారింది. అడుగడుగునా ఆత్మీయ స్వాగతాలు, అభిమాన పలకరింపులతో వికారాబాద్ పట్టణం పండుగ శోభను సంతరించుకుంది. ఆప్యాయతను పంచుకుంటూ, ఆత్మీయతను చాటుకుంటూ సాగిన ఈ వేడుకలు దసరా సంప్రదాయాల గొప్పతనాన్ని మరోసారి చాటి చెప్పాయి. దసరా సందర్భంగా స్పీకర్ ప్రసాద్ కుమార్ తన సొంత నియోజకవర్గంలోని ప్రజల మధ్య ఆత్మీయంగా గడుపుతూ, పెద్దలు, చిన్నారులను ఆప్యాయంగా పలకరిస్తూ, సరదాగా ముచ్చటిస్తూ పండుగ ఆనందాన్ని అందరితో పంచుకున్నారు. వికారాబాద్ ప్రజా భవన్ (ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం)లోనూ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మర్యాదపూర్వకంగా కలిసి విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు.

# ఉప్పల్‌లో ఘనంగా దసరా వేడుకలు

## రవణ దహన కార్యక్రమంలో పాల్గొన్న టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ దంపతులు





**హైదరాబాద్, వెలుతురు, అక్టోబర్ 21:**

దసరా పండుగ సందర్భంగా ఉప్పల్‌లో నిర్వహించిన రవణ దహన కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ దంపతులు పాల్గొన్నారు. నియోజకవర్గ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై దసరా వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ రవణ దహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ తెలంగాణ ప్రజలకు దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా దసరా పండుగను ప్రజలు పెద్ద ఎత్తున జరుపుకుంటారని అన్నారు. దసరా పండుగ ప్రజలకు మంచి సందేశాన్ని అందించే అద్భుతమైన పండుగ అని పేర్కొన్నారు.

తెలంగాణ ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు, శాంతి, అభివృద్ధి వెల్లివిరియాలని, ప్రతి ఒక్కరికీ మంచి జరగాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు పరమేశ్వర్ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు వజ్రేశ్ యాదవ్, మాజీ కార్పొరేటర్ రజిత, కాంగ్రెస్ నాయకులు భూపతిరెడ్డి, నర్సారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి దసరా శుభాకాంక్షలు తెలినిర మహేష్ గౌడ్



**జూబ్లీహిల్స్, వెలుతురు అక్టోబర్ 21:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి దసరా శుభాకాంక్షలు తెలిపిన టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్.. పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్న సీఎం, పీసీసీ అధ్యక్షులు. ఈ సందర్భంగా ఎంపీ అనిల్ యాదవ్, ఎమ్మెల్యే నవీన్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రోహిన్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## దీప్తి జీవంజికి మహేష్ గౌడ్ అభినందనలు




**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 21:**

జపాన్‌లో జరుగుతున్న ఆసియా పారా గేమ్స్-2026లో మహిళల 400 మీటర్ల (T20) పరుగుపందెంలో 56.36 సెకన్లలో లక్ష్యాన్ని చేరుకుని రికార్డు సృష్టిస్తూ స్వర్ణ పతకం సాధించిన తెలంగాణ ముద్దుబిడ్డ దీప్తి జీవంజికి టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

దీప్తి జీవంజి సాధించిన ఈ చారిత్రాత్మక విజయం తెలంగాణకే కాకుండా దేశానికే గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. ఆమె విజయం దేశవ్యాప్తంగా ఉన్న పారా అథ్లెట్లకు, యువ క్రీడాకారులకు ఎంతో స్ఫూర్తినిస్తుందని అన్నారు. ఎదురయ్యే అడ్డంకులను అధిగమిస్తూ పట్టుదల, ఆత్మవిశ్వాసం, నిరంతర శ్రమతో అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చని దీప్తి తన విజయంతో నిరూపించారని కొనియాడారు. అంతర్జాతీయ క్రీడా వేదికపై తెలంగాణ ప్రతిభను చాటిన దీప్తి జీవంజి భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి, అంతర్జాతీయ స్థాయిలో భారతదేశ కీర్తిప్రతిష్ఠలను ఇనుమడింపజేయాలని మహేష్ కుమార్ గౌడ్ ఆకాంక్షించారు. ఆమె క్రీడా ప్రస్థానం మరెందరో యువతకు ప్రేరణగా నిలవాలని అభిలషించారు.

# నార్లాపూర్ నుంచి ఎల్లూరు రిజర్వాయర్‌లోకి నీటి విడుదల

- అదనంగా లక్ష ఎకరాలకు సాగునీటి సదుపాయం
- పాలమూరు ప్రాజెక్టులపై గత బీఆర్ఎస్ ప్రభుత్వానిది నిర్లక్ష్యం
- బీఆర్ఎస్ నేతల విమర్శలకు మంత్రి జూపల్లి కృష్ణారావు కౌంటర్



**నార్లాపూర్, వెలుతురు, అక్టోబర్ 21:**

పాలమూరు ప్రాంత సాగునీటి ప్రాజెక్టులను పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నిర్లక్ష్యం చేశారని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు విమర్శించారు. అసంపూర్తిగా వదిలేసిన పనులను తమ ప్రభుత్వం పూర్తి చేస్తూ రైతులకు సాగునీరు అందించేందుకు చర్యలు చేపడుతోందని తెలిపారు. నార్లాపూర్ రిజర్వాయర్ నుంచి ఎల్లూరు రిజర్వాయర్‌లోకి ఆయన నీటిని విడుదల చేశారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మహాత్మా గాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం పరిధిలోని కల్వకుర్తి, అచ్చంపేట, నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, వనపర్తి నియోజకవర్గాల్లో అదనంగా లక్ష ఎకరాలకు సాగునీటి సదుపాయం కల్పించే దిశగా నీటిని విడుదల చేసినట్లు వెల్లడించారు. నార్లాపూర్ రిజర్వాయర్ నుంచి ఎల్లూరు రిజర్వాయర్‌లోకి 1,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు తెలిపారు. సాగునీటితోపాటు ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా మిషన్ భగీరథ ద్వారా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

### మూడు నెలల్లో కాలువల పనులు పూర్తి చేసేలా చర్యలు

నార్లాపూర్ నుంచి ఏదుల వరకు కాలువల తవ్వకం, బ్రిడ్జిల నిర్మాణం వంటి కీలక పనులు ఇంకా కొనసాగుతున్నాయని మంత్రి వివరించారు. మార్గమధ్యంలో మూడు చోట్ల టన్నెల్ తవ్వకాలు చేపట్టాల్సి ఉండటంతోపాటు, కొన్ని ప్రాంతాల్లో రాతి నేల కారణంగా పనులు ఆలస్యమవుతున్నాయని తెలిపారు. కాలువల నిర్మాణం పూర్తికాకుండా నీటిని విడుదల చేస్తే ఆశించిన స్థాయిలో నీటిని ముందుకు తీసుకెళ్లడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. మహాత్మా గాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలోని మూడో ప్యాకేజీ పనులను గత బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిచేసి ఉంటే ప్రస్తుతం ఈ పరిస్థితి ఎదురయ్యేది కాదని జూపల్లి అన్నారు. గతంలో అసంపూర్తిగా నిలిచిపోయిన పనులను తమ ప్రభుత్వం కొనసాగిస్తోందని, కాలువల తవ్వకం, బ్రిడ్జిల నిర్మాణం పూర్తయ్యేందుకు మరో మూడు నెలల సమయం పట్టే అవకాశం ఉందని వెల్లడించారు.

### క్షేత్రస్థాయి వాస్తవాలు తెలుసుకోకుండా విమర్శలా?

మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సహా ఆ పార్టీ నాయకులు ప్రాజెక్టుల వాస్తవ పరిస్థితులను తెలుసుకోకుండా విమర్శలు చేస్తున్నారని మంత్రి మండిపడ్డారు. ప్రాజెక్టుల నిర్మాణ పనులు పూర్తికాకుండా నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేయడం సరికాదన్నారు. నీటిని విడుదల చేయాలని కోరడం సులభమేనని, అయితే ఆ నీరు కాలువల ద్వారా ఎక్కడికి చేరుతుందో కూడా ఆలోచించాలని హితవు పలికారు.

ప్రాజెక్టుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించి వాస్తవాల ఆధారంగా మాట్లాడాలని బీఆర్ఎస్ నేతలకు సూచించారు. గాలి మాటలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు మానుకోవాలని అన్నారు. అసంపూర్తి పనులను పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు.

## పండుగ సాయన్న జయంతిని అధికారికంగా నిర్వహించడం గర్వకారణం

- నేడు రవీంద్ర భారతిలో జరిగే జయంతి వేడుకలకు ముదిరాజ్ బంధుమిత్రులు పెద్ద ఎత్తున తరలిరావాలి: మంత్రి వాకిటి శ్రీహరి



**మక్తల్ వెలుతురు అక్టోబర్ 21:**

మక్తల్‌లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో పండుగ సాయన్న 174వ జయంతి పోస్టర్‌ను మంత్రి వాకిటి శ్రీహరి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...

పండుగ సాయన్న జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముదిరాజుల తరపున ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ నెల 22వ తేదీన హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో నిర్వహించనున్న జయంతి వేడుకలకు ముదిరాజ్ బంధుమిత్రులు, అభిమానులు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంత్రి పిలుపునిచ్చారు.

పండుగ సాయన్న తన కాలంలో సామాజిక అసమానతలను, దోపిడీని ఎదిరిస్తూ పేదలు, బలహీన వర్గాల పక్షాన నిలిచిన ప్రజానాయకుడిగా గుర్తింపు పొందారని తెలిపారు. అన్యాయాన్ని ప్రశ్నిస్తూ, అణగారిన వర్గాలకు అండగా నిలిచిన ఆయన జీవితం ప్రజల్లో ధైర్యాన్ని, ఆత్మగౌరవాన్ని నింపిందని పేర్కొన్నారు. పండుగ సాయన్న చరిత్రను భావితరాలకు అందించడంతో పాటు, ఆయన ఆశయాలను సమాజంలో విస్తృతంగా ప్రచారం చేయాల్సిన అవసరం ఉందన్నారు.

పండుగ సాయన్న జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం ద్వారా ఆయన సేవలకు, పోరాట స్ఫూర్తికి తగిన గుర్తింపు లభిస్తోందని మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. పండగ సాయన్న జయంతి కార్యక్రమాన్ని ముదిరాజ్ సమాజం ఐక్యతకు, మహనీయుల చరిత్రను స్మరించుకునే వేదికగా మలచాలని మంత్రి వాకిటి శ్రీహరి ఆకాంక్షించారు.

## మక్తల్ దసరా వేడుకల్లో కుటుంబ సమేతంగా పాల్గొన్న మంత్రి వాకిటి శ్రీహరి

- అమ్మవారికి ప్రత్యేక పూజలు.. రావణ దహన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి



**మక్తల్, వెలుతురు అక్టోబర్ 21:**

మక్తల్ పట్టణంలోని రామ్‌లీలా మైదానంలో నిర్వహించిన దసరా వేడుకల్లో మంత్రి వాకిటి శ్రీహరి కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. తొలుత అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆయన ప్రార్థించారు. అనంతరం రామ్‌లీలా మైదానంలో నిర్వహించిన రావణ దహన కార్యక్రమంలో మంత్రి వాకిటి శ్రీహరి పాల్గొన్నారు.

చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే విజయదశమి పండుగ ప్రజల్లో ధర్మం, సత్యం, ఐక్యతా భావాలను పెంపొందిస్తుందని ఈ సందర్భంగా మంత్రి పేర్కొన్నారు. మక్తల్ పట్టణంలో పండుగ వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో జరగడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ప్రజలందరికీ విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు.

## తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని ప్రపంచానికి చాటాలి

- డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026
- సమ్మిట్ ప్రారంభోత్సవం, కల్చరల్ కార్నివాల్, ప్రచార కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాలి: సీఎస్ సంజయ్ జాజు



**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 21:**

తెలంగాణ గొప్ప సాంస్కృతిక, కళా వారసత్వాన్ని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో చాటిచెప్పేలా డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్--2026 సందర్భంగా జానపద, శాస్త్రీయ సంగీత, నృత్య కార్యక్రమాలతో పాటు వివిధ సాంస్కృతిక కళారూపాల ప్రదర్శనలను విస్తృతంగా ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు.

ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026 నిర్వహణకు చేపట్టాల్సిన ఏర్పాట్లపై బుధవారం సంబంధిత ఉన్నతాధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సమ్మిట్ నిర్వహణ,అతిథులకు స్వాగతం,సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రచార వ్యూహాలు తదితర అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు.

జాతీయ, అంతర్జాతీయ స్థాయి ప్రముఖ పారిశ్రామికవేత్తలు, ప్రతినిధులు హాజరుకానున్న ఈ సమ్మిట్ ద్వారా తెలంగాణ పెట్టుబడుల అవకాశాలతో పాటు రాష్ట్ర చారిత్రక, సాంస్కృతిక వైభవాన్ని ప్రపంచానికి పరిచయం చేయాలని సీఎస్ సూచించారు. సమ్మిట్ ప్రారంభోత్సవం సందర్భంగా అతిథులకు ఘన స్వాగతం పలికేలా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన సంప్రదాయ కళారూపాలతో ప్రత్యేక ప్రదర్శనలు ఏర్పాటు చేయాలన్నారు.

సమ్మిట్‌లో భాగంగా డిసెంబర్ 7 నుంచి 9 వరకు నిర్వహించనున్న రక్షా ఎక్స్‌పో చివరి రోజైన డిసెంబర్ 9న ఏర్పాటు చేయనున్న ఎయిర్ షోను వీక్షించేందుకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యే అవకాశం ఉన్నందున, ఆ రోజున తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని ప్రతిబింబించేలా ప్రత్యేక కల్చరల్ కార్నివాల్ నిర్వహించాలని ఆదేశించారు.

### సమ్మిట్‌కు విస్తృత ప్రచారం కల్పించాలి

ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు కర్టెన్ రైజర్ కార్యక్రమాలను ఈ నెల 24న హైదరాబాద్‌లో, 29న న్యూఢిల్లీలో ఘనంగా నిర్వహించాలని సీఎస్ సూచించారు. సమ్మిట్, రక్షా ఎక్స్‌పోలకు సంబంధించిన సమాచారాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఢిల్లీ, ముంబై, బెంగళూరు వంటి ప్రధాన నగరాల్లోని అంతర్జాతీయ విమానాశ్రయాల్లో ఆకర్షణీయమైన హోర్డింగులు ఏర్పాటు చేయాలన్నారు.

న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌తో పాటు ఇతర ప్రముఖ ప్రాంతాల్లోనూ ప్రచార హోర్డింగులు ఏర్పాటు చేయాలని, హైదరాబాద్‌లో శంషాబాద్ విమానాశ్రయానికి వెళ్లే మార్గంతో పాటు నగరంలోని ప్రధాన రహదారులు, ప్రముఖ ప్రాంతాలు, స్టార్ హోటళ్ల వద్ద వెంటనే హోర్డింగులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

జాతీయ స్థాయి ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాతో పాటు సోషల్ మీడియా వేదికల ద్వారా సమ్మిట్‌కు విస్తృత ప్రచారం కల్పించాలని తెలిపారు. సినీ ప్రముఖులు, ఇతర సెలబ్రిటీల భాగస్వామ్యంతో ప్రత్యేక షార్ట్ ఫిల్మ్‌లు రూపొందించి, సమ్మిట్ ప్రాధాన్యతను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్, ముఖ్య కార్యదర్శి శిఖా గోయల్, కార్యదర్శులు హరిచందన, శశాంక, ముకుంద్ రెడ్డి, అజిత్ రెడ్డి, ముఖ్యమంత్రి కార్యాలయ సీపీఆర్ఓ మల్సూర్, డిజిటల్ విభాగం డైరెక్టర్ కర్రీ శ్రీరామ్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITOR G BAKKA YADAIAH, R.N.I. TEL TEL/2019/78609. Cell: 91773 87328, Email: velthurunewspaper@gmail.com